
వెలిగండ్ల సచివాలయం వద్ద రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

పామూరు మండలంలోని ఏడు జగనన్న లేఅవుట్లలో 2,957 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అందులో మంగళవారం నాటికి 2,000 రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. మిగిలిన వాటిని కూడా వెంటనే పూర్తి చేయాలని జిల్లాస్థాయి అధికారుల నుంచి సచివాలయాల సిబ్బందిపై ఒత్తిడి పెరిగింది. సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్‌లు ముందుకు సాగడం లేదు. రోజుకు 30 మంది లబ్ధిదారులకు కూపన్‌లు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నా ముందుకు సాగడం లేదు.

వెలిగండ్ల మండలంలో 1,075 మందికి గతంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వారందరికీ రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా 280 మందికి మాత్రమే చేశారు. మొత్తం 29 లేఅవుట్లు వేయగా హుస్సేన్‌పురంలో 10మంది మాత్రమే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. 28 గ్రామాల్లో పునాదులు కూడా పడలేదు. రోజుకు 40-50 పత్రాలకు రిజిస్ట్రేషన్ చేయాలన్న లక్ష్యం ఉండగా సర్వర్ సతాయిస్తుండటంతో పది కూడా చేయలేని పరిస్థితి నెలకొంది. పనివేళల్లో అధిక లోడ్‌తో సైట్ నిలిచిపోతోంది. దీంతో రాత్రుళ్లు 10 గంటల వరకూ రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు సచివాలయ సిబ్బంది చెప్తున్నారు.


ఒంగోలులోని ఘోషా ఆసుపత్రి వద్ద ఉన్న సచివాలయంలో పడిగాపులు కాస్తున్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు


కంప్యూటర్ వద్ద కుస్తీపడుతున్న సిబ్బంది

పనులు మానుకొని రోజుల తరబడి..

పేదలు తమ ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు రోజుల తరబడి సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సాధారణంగా ఏ రోజుకా రోజు పనులకు వెళ్లి పూటగడుపుకొనే పేదలు కూడా లక్షల్లో ఉన్నారు. అటువంటి వారందరూ తమ పనులు మానుకొని సచివాలయాల వద్దనే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉన్నా.. పట్టుమని పది మందికి కూడా వేలిముద్ర పడటం లేదు. సాధారణంగా సాంకేతిక సమస్యలు లేకుండా సర్వర్ పనిచేస్తే రోజుకు ఒక సచివాలయం నుంచి 30 నుంచి 40 మంది పట్టాలను రిజిస్ట్రేషన్ చేసే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం నాలుగైదు మించి కావడం లేదు.

- ఎన్నికల వేళ ప్రభుత్వం హడావుడి
- జగనన్న లేఅవుట్లలో అనేక అవకతవకలు
- ఇబ్బందిపడుతున్న సచివాలయ సిబ్బంది
- గంటల తరబడి లబ్ధిదారుల ఎదురుచూపులు

సర్వర్.. సంకటం

పట్టాల రిజిస్ట్రేషన్‌కు అనేక అడ్డంకులు

జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు సర్వర్ చిక్కులు ఏర్పడ్డాయి. దీంతో సకాలంలో రిజిస్ట్రేషన్లు కాక లబ్ధిదారులు అవస్థ పడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓట్ల కోసం అధికారపార్టీ హడావుడిగా ప్రక్రియ చేపట్టడంతోనే ఈ సంకటం నెలకొంది. పట్టాలకు రిజిస్ట్రేషన్లు అని పిలుస్తుండటంతో లబ్ధిదారులు పరుగులు తీస్తున్నారు. తమ స్థలాలు ఎక్కడున్నాయో తెలియదు గానీ అధికారుల ఒత్తిడితో సచివాలయాలకు వస్తున్నారు. ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌తో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవచ్చని, సర్టిఫైడ్ కాపీని పొందే వీలుంటుందని, ఇంటిని అమ్ముకునే సమయంలో ఈ డాక్యుమెంట్ సరిపోతుందని వైసీపీ నాయకుల ప్రచారమే ఇందుకు కారణం. తీరా వచ్చాక సర్వర్ పని చేయక పడిగాపులు కాయాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలు(కలెక్టరేట్)/పామూరు/వెలిగండ్ల, ఫిబ్రవరి 20 : సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తుండటంతో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో అధికారులే కాకుండా ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం హడావుడిగా సచివాలయాల ద్వారా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ అని చెప్పి రెండురోజులపాటు శిక్షణ ఇచ్చి ప్రక్రియను ప్రారంభించడం ఉద్యోగులకు తలనొప్పిగా మారింది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు చేసేందుకు సాఫ్ట్‌వేర్ వెర్షన్ మార్చారు. అయితే అదిసరిగ్గా లేకపోవడంతో ప్రస్తుత వెర్షన్‌తోనే సచివాలయాల్లో పట్టాల రిజిస్ట్రేషన్‌కు శ్రీకారం చుట్టారు. అనేక గ్రామాల్లో పెద్దఎత్తున ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అటువంటి గ్రామాల్లో పేదలు పనులు మానుకొని పది రోజులుగా సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. జిల్లావ్యాప్తంగా జగనన్న కాలనీల లేఅవుట్లలో 51,060 మందికి పట్టాలు ఇవ్వగా ఇప్పటివరకు 25వేల మందికి మాత్రమే రిజిస్ట్రేషన్లు చేశారు. మిగిలిన వాటి రిజిస్ట్రేషన్‌కు సాంకేతిక సమస్య ఎదురవుతోంది. సర్వర్ పనిచేయక అటు ఉద్యోగులు, ఇటు లబ్ధిదారులు సచివాలయాల వద్దనే పడిగాపులుకాయాల్సి వస్తోంది. శనివారం సర్వర్ బాగా పనిచేయగా సోమవారం మొరాయించింది. మంగళవారం కొంతసేపు పనిచేసి నిలిచిపోయింది. సర్వర్ పూర్తిగా నెమ్మదించింది. సబ్‌ట్రెజరీ కార్యాలయాలపై కూడా ఆ ప్రభావం పడింది.

తప్పులతడకలతో ఇబ్బందులు

పేదలకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఆచరణలో తగిన సౌకర్యం కల్పించడం లేదని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. పేదలకు ఇచ్చిన పట్టాల్లో పేర్లు, సర్వే నంబర్లు, ప్లాట్ నెంబర్, హద్దులు తప్పుగా ఉండడంతో రిజిస్ట్రేషన్ కావడం లేదు. ఆన్‌లైన్ దరఖాస్తు తర్వాత రిజిస్ట్రేషన్‌కు ఇచ్చిన తేదీన కార్యాలయానికి వచ్చినా తిరస్కరణకు గురవుతుండటంతో లబ్ధిదారులు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. మరోపక్క గ్రామాల్లో కరెంట్ కోతల కారణంగా ప్రక్రియ ముందుకు సాగడం లేదు. సాంకేతిక సమస్యలు లేకుంటే 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని చెప్తున్నారు. కాగా రోజూ సర్వర్ సమస్యతో నిరీక్షించాల్సి వస్తోందని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పట్టా ఒకరికి... పొజిషన్ మరొకరికి!

సచివాలయాల ద్వారా జగనన్న కాలనీల స్థలాల రిజిస్ట్రేషన్ల సమయంలో అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. లేఅవుట్లు వేసిన తర్వాత ఆయా గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారుల పేరుతో రెవెన్యూ అధికారులు పొజిషన్ చూపించారు. అయితే వివిధ కారణాల పేరుతో పొజిషన్ చూపించిన లబ్ధిదారుడికి కాకుండా మరొకరి పేరుతో పట్టా ఇచ్చారు. ఇప్పుడు సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల సమయంలో ఇవి వెలుగులోకి వస్తున్నాయి. కొంతమంది లబ్ధిదారులకు పట్టా ఉన్నా, రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో తేడాలు వస్తున్నాయి. సచివాలయ ఉద్యోగులు ఈ విషయాన్ని ప్రశ్నించినప్పుడు పట్టా పొందిన వ్యక్తి సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో సుమారు 20 శాతం మంది పట్టాల్లో తేడాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.


నుచ్చుపొద సచివాలయం వద్ద పరిస్థితి ఇదీ..


ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

కదంతొక్కిన ఉద్యోగులు

- బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ ఆందోళన
- సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి
- సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం
- మహాధర్నాలో ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరిక


ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20 : తమకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కదంతొక్కారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. జేఏసీ వైస్ చైర్మన్, పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయన్నారు. డీఏలు, సరెండర్ లీవులు, పీఆర్సీ అరియర్స్, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్, మెడికల్ బిల్లులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో రోడ్డు మీదకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ధర్నాకు అధ్యక్షత వహించిన జేఏసీ జిల్లా చైర్మన్ కూచిపూడి శరత్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 27న చలో విజయవాడ చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అంకిరెడ్డి, చెన్నుపాటి మంజుల, డి. వీరాంజనేయులు సుబ్బారావు, వెంకటేశ్వరరావు, సాగర్‌రెడ్డి, ఏడుకొండలు, కిరణ్, మధు, రోజ్‌కుమార్, లక్ష్మయ్య, మంజేష్, షరీఫ్, శివకుమార్, సునీల్, కిషోర్, తోట శ్రీను, కరీముల్లా, మాధవి, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థుల పరీక్షల షెడ్యూల్ విడుదల

- ఈనెల 23 నుంచి ఎఫ్‌ఏ-4, ప్రీఫైనల్ ప్రారంభం

ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 20: పాఠశాలల్లో 1 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. 1 నుంచి 9 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)4, 10వ తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలను ఈనెల 23 నుంచి నిర్వహించాలని పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్ ఆదేశించారు. ఈనెల 23 నుంచి 28 వరకు ఎఫ్‌ఏ-4 పరీక్షలు, 23 నుంచి మార్చి 4 వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతాయి.

- ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులకు 23న ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం, 24న ఉదయం పరిసరాల విజ్ఞానం, మధ్యాహ్నం ఇంగ్లీషు పార్ట్ ఏ, పార్ట్ బీ, 25న ఓఎస్ఎస్‌సీ పరీక్ష జరుగుతుంది.
- ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 6, 7, 8 తరగతుల విద్యార్థులకు 23న ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం, 24న హిందీ, జనరల్ సైన్స్, 26న సోషల్ స్టడీస్, 27న ఇంగ్లీషు పార్ట్ ఏ, టోఫెల్, 28న ఓఎస్ఎస్‌సీ, ఓఎస్ఎస్‌సీ-2 పరీక్ష ఉంటుంది.
- 9వ తరగతి విద్యార్థులకు 23న తెలుగు, గణితం, 24న హిందీ, జనరల్ సైన్స్, 26న సోషల్, 27న ఇంగ్లీషు, 28న ఓఎస్ఎస్‌సీ పరీక్ష నిర్వహిస్తారు.
- పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఈనెల 23 నుంచి ప్రీఫైనల్ పరీక్షలు మధ్యాహ్నం 1.15 నుంచి 4.30 వరకు జరుగుతాయి. 23న తెలుగు, 24న హిందీ, 26న ఇంగ్లీషు, 27న గణితం, 28న ఫిజికల్ సైన్స్, 29న బయాలజికల్ సైన్స్, మార్చి 1న సోషల్, 2న కాంపోజిట్ కోర్సు, ఓఎస్ఎస్‌సీ, 4న ఓఎస్ఎస్‌సీ-2 పరీక్ష ఉంటుంది. ఎఫ్‌ఏ-4 పరీక్షలకు ప్రశ్నపత్రాలను వాట్సాప్ ద్వారా ఆ పాఠశాలలకు చేరుస్తారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులే ప్రశ్నపత్రాలను సమకూర్చుకుని విద్యార్థులకు అందజేయాలి. పదో తరగతి విద్యార్థుల ప్రీఫైనల్ పరీక్షలకు ప్రశ్నపత్రాలను డీసీఈబీ ద్వారా పాఠశాలలకు అందజేస్తారు.



జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

- సీఎం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి
- ఒంగోలులో జర్నలిస్టుల ర్యాలీ
- కలెక్టర్‌కు వినతిపత్రం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20 : తమకు రక్షణ కల్పించడంతోపాటు రాప్తాడు బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వైసీపీ రౌడీ మూకలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జర్నలిస్టు నాయకులు డిమాండ్ చేశారు. వివిధ జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రమైన ఒంగోలులో ర్యాలీ నిర్వహించి కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో జర్నలిస్టు సంఘాల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి బహిరంగ సభ కవరేజ్ కోసం వెళ్లిన ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేసి పాశవికంగా కొట్టడం దుర్మార్గమన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇటువంటి దాడులను ఆపకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. శ్రీకృష్ణపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి దాసరి కనకయ్య, రాష్ట్ర ప్రతినిధి ఎ.సురేష్, ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు పి.రామకోటేశ్వరరావు, ఎన్.జనార్దన్, ఏబీఎన్ వెంకట్రావు, ఇష్తేకర్ బాషా, మేకపాటి మాల్యాద్రి, నంబూరి సురేష్, అజయ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు

పొగాకు కొనుగోళ్లకు సన్నాహాలు

- నెలాఖరు నుంచి ప్రారంభించే అవకాశం
- నేడు రైతు ప్రతినిధులతో బోర్డు ఉన్నతాధికారుల సమావేశం
- కర్ణాటకలో ముగింపు దశలో మార్కెట్

ఒంగోలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లకు బోర్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నెలాఖరులో వేలం ప్రక్రియను ప్రారంభించాలన్న యోచనలో ఉన్న వారు క్షేత్రస్థాయి పరిస్థితులపై ఇప్పటికే వేలంకేంద్రాల వారీ రైతులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. తిరిగి గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కో వేలంకేంద్రం నుంచి ఇద్దరేసి రైతు ప్రతినిధులు, ఆయా వేలంకేంద్రాల అధికారులను ఆ సమావేశానికి హాజరుకావాలని సూచించారు. అలాగే బోర్డులో రాష్ట్రం నుంచి ఉన్న రైతు ప్రతినిధులు కూడా పాల్గొనే ఈ సమావేశానికి వ్యాపారుల ప్రతినిధులు కూడా వస్తారని సమాచారం. గతేడాది ఫిబ్రవరి 24న రాష్ట్రంలో తొలివిడత దక్షిణాదిలోని కొన్ని వేలంకేంద్రాల్లో కొనుగోళ్లను ప్రారంభించారు. అలాగే ఈ ఏడాది కూడా ఈ నెలలోనే వేలం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్రంలో 2023-24 సంవత్సరానికి 140 మిలియన్ కిలోల ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా మరో 40 మిలియన్ కిలోల వరకూ అధికంగా ఉత్పత్తయ్యే అవకాశం కనిపిస్తోంది. దీనికితోడు గతం కన్నా ఎండలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో దక్షిణాదిలో తక్షణం వేలం ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై బుధవారం నాటి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇదిలా ఉండగా కర్ణాటకలో ప్రస్తుత మార్కెట్ ఉగింపు దశకు చేరింది.


మర్రెడ్డిని పరామర్శిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల, నేతలు


గాయాలతో ఉన్న మర్రెడ్డి

తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డిపై హత్యాయత్నం

- తలకు తీవ్రగాయాలు, ఆస్పత్రిలో చికిత్స
- లావాదేవీలపై మాట్లాడేందుకు పిలిచి దాడి
- డాక్టర్ అసిస్టెంటే కారకుడు
- ప్రోత్సహించిన జిమ్స్ నిర్వాహకుడు

వివరాలు మెయిన్‌లో..


పూర్తిగా దగ్ధమైన ఆటో

దూసుకొచ్చిన మృత్యువు

- ఆటోను ఢీకొన్న కారు
- ముగ్గురు దుర్మరణం
- వారిలో ఇద్దరు సజీవదహనం
- మృతుల్లో అన్నదమ్ములు
- అందరూ బార్లకుంటకు చెందిన వారు
- మిర్చి అమ్ముకొని తెచ్చుకుంటున్న రూ.6లక్షలు బూడిద

వివరాలు మెయిన్‌లో..


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

తెలుగుకు వెలుగేది?

అమ్మభాషలోనే కమ్మనైన మాధుర్యం • అచ్చమైన తెలుగుకు దూరమవుతున్న యువతరం • ప్రభుత్వ విధానంతో తెలుగుమీడియం కనుమరుగు
ఆవేదన వ్యక్తం చేస్తున్న సాహితీవేత్తలు • నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 20: ప్రపంచంలో ఏ భాషకు లేని అక్షర సౌష్టవం, మాధుర్యం తెలుగుభాషకు ఉన్నాయనటం ఏమాత్రం అతిశయోక్తి కాదు. అందుకే 'దేశభాషలందు తెలుగు లెస్స' అని 'ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్' అని తెలుగుభాష గొప్పదనాన్ని గురించి చెబుతారు. ప్రపంచంలో ఎక్కువగా మాట్లాడే భాషల్లో తెలుగుది 15వ స్థానం. ప్రపంచంలోని ఏ మూలకు వెళ్లినా తప్పనిసరిగా తెలుగువారు కనబడితీరతారు. అనేక దేశాల్లో తెలుగుసంఘాలు సైతం ఎంతో చురుగ్గా పనిచేస్తూ తెలుగుభాష, తెలుగు సంస్కృతి పరిరక్షణకు కృషిచేస్తున్నాయి. అయినప్పటికీ నేటితరం మాత్రం తమ మాతృభాష అయిన తెలుగులో చక్కగా రాయటం, మాట్లాడటం వంటివి చేయలేకపోతున్నారనేది భాషాభిమానుల్ని కలిచివేస్తున్న సత్యం. దీనికి కారణం నేటి యువతీయువకులకు, వారి తల్లిదండ్రులకు ఆంగ్లభాషపై, ఆంగ్లమాధ్యమంలో విద్యాభ్యాసంపై విపరీతమైన మోజు పెరగటమే. ప్రస్తుత పరిస్థితుల్లో ఆంగ్లభాషను నేర్చుకోవటం తప్పనిసరి. అందులో పరిజ్ఞానం ఉంటేనే సాఫ్ట్‌వేర్ వంటి ఉద్యోగాలు పొందగలిగేది. అయితే ఆంగ్లం అంతవరకే పరిమితమయితే, తెలుగుభాష గురించి దిగులుపడాల్సిన పనిలేదు. కానీ 'అమ్మ' స్థానాన్ని 'మమ్మీ', 'అత్త' స్థానాన్ని 'ఆంటీ' ఆక్రమిస్తుంటేనే మన అమ్మభాషగురించి ఆలోచించాల్సిన పరిస్థితి నేడు కనిపిస్తుంది. ఆ విధంగా అమ్మభాష ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేసి దాని పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపట్ల ఉద్యుక్తులు కావటానికి ఏర్పాటుచేసిందే 'అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం'. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని యునెస్కో ప్రకటించి 2000 సంవత్సరం నుంచి అమలుచేస్తోంది.

తెలుగుకు ఘన చరిత్ర..

మన తెలుగుభాషకు శతాబ్దాల ఘన చరిత్ర ఉంది. దాదాపు 2600 సంవత్సరాల కిందటే 'ఆంధ్ర' శబ్దం మనకు ఐతరేయ బ్రాహ్మణీయంలో కనిపిస్తుంది. ఆనాడు పురుడుపోసుకున్న తెలుగుభాష అనంతరకాలంలో పరిపాలించిన శాతవాహనులు, ఇక్ష్వాకులు వంటి వారి పరిపాలనలో ఉజ్వలంగా వెలిగింది. సామాన్యశకం 3వ శతాబ్దంలో తెలుగులో లిఖించబడిన శిలాశాసనం మనకు అమరావతి స్థూపాల్లో కనిపిస్తుంది. దీన్నిబట్టి తెలుగుభాష ఎంత ప్రాచీనమైనదో అర్థమవుతుంది. మరి అంతటి ప్రాచీన భాషను ఎందరో రాజులు, చక్రవర్తులు పోషించారు. ఇక నన్నయ, తిక్కన, ఎర్రన మొదలు ఆధునిక కవుల వరకు అనేకమంది సాహితీవేత్తలు తమ కలాల ద్వారా సొబగులద్దారు. గ్రామగ్రామాన తమ గళం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే జానపద కళాకారులు తమ పాటలద్వారా తెలుగభాషకు కీర్తిని సముపార్జించిపెట్టారు. అయినప్పటికీ తెలుగుభాషను నేర్చుకునే, మాట్లాడే వారి సంఖ్య క్రమంగా తగ్గుతుందన్న గణాంకాలు కలవరానికి గురిచేస్తున్నాయి. దీంతో వారు తెలుగుభాషకు ప్రాచీన హోదా కోసం అనేక సంవత్సరాలు ఉద్యమించాల్సి వచ్చింది. చివరకు 2006వ సంవత్సరంలో తెలుగు భాషకు ప్రాచీన హోదా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. ప్రాచీన హోదా అయితే వచ్చింది కానీ తెలుగుభాష అభివృద్ధికి, పరిశోధనకు తగిన నిధులు మాత్రం కేంద్రం నుంచి రాలేదు. వీటిని సాధించటంలో మన రాష్ట్ర పాలకులు, ప్రజాప్రతినిధులు ఏ మాత్రం కృషిచేయటం లేదన్నది అక్షరసత్యం.

తెలుగు వెలుగులకు కృషి..

జిల్లాలో తెలుగు సాహిత్యవేత్తలకు కొదవలేదు. ఎందరో మహనీయులు తమ భాషాపటిమతో తెలుగు సాహితీరంగాన్ని సుసంపన్నం చేశారు. ఆధునిక కవుల్లో డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు మొదలు మల్లవరపు జాన్, బి.హనుమారెడ్డి, ఈమని దయానంద, దారా రామనాథశాస్త్రి, గాడేపల్లి సీతారామమూర్తి, ఆర్‌వీఎస్.భరద్వాజ, ఒలుకుల శివశంకర్, ఇటీవల కాలంలో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, తేళ్ల అరుణ, షేక్ మహబూబ్‌జాన్ ఇలా చెప్పుకుంటూపోతే కొన్ని వందలమంది సాహితీవేత్తలు తెలుగుభాషామతల్లికి తమ సాహిత్యం ద్వారా నీరాజనాలు పడుతున్న వారే. ఇక పాటిబండ్ల ఆనందరావు, ఎంవీ.ఎస్.హరనాథరావు వంటి సినీ, నాటక రచయితలు, అద్దంకి మాణిక్యాలరావు, షణ్ముఖి ఆంజనేయరాజు, బండారు రామారావు వంటి రంగస్థల దిగ్గజాలు ఇతోధికంగా తెలుగుభాషకు జిల్లాలో ఊతమిచ్చిన మహనీయుల్లో కొందరు. అదేవిధంగా ఏభై సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ప్రకాశం జిల్లా రచయితల సంఘం మొదలు, మహిళాచైతన్యాన్ని రచనారంగంలో నింపుతున్న నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం, శ్రీశ్రీ కళావేదిక, జానుడి సెంటర్ ఫర్ ఆర్ట్స్ అండ్ లిటరేచర్ ఇలా అనేక సాహిత్యసంఘాలు సైతం తెలుగుభాషకు అందిస్తున్న సేవలు అపూర్వమైనవి.

అయితే తెలుగుభాష యువతరం వద్దకు చేరినప్పుడు, వారు సైతం సాహిత్య, సాంస్కృతిక రంగాలవైపు ఆకర్షితులై అయా రంగాల్లో పాలుపంచుకున్నపుడే తెలుగువైభవం మరోతరానికి జీవనదిలా ప్రవహిస్తుంది. అంతేకాకుండా తమ కార్యాలయాల్లో తెలుగును ఉపయోగించటం ద్వారా ప్రభుత్వాధికారులు, తెలుగుభాష సౌందర్యాన్ని, అమ్మభాష ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజెప్పటం ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మన తెలుగుభాష కోటికాంతులు విరజిమ్మేలా కృషిచేయాలి.

ప్రభుత్వ విధానంతో కనుమరుగు

ఇక ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంతో నేటి తరానికి తెలుగుభాష పూర్తిగా దూరమయ్యే ప్రమాదం ఉంది. పాఠశాల స్థాయిలో తెలుగు మీడియాన్ని ఎత్తివేసి పూర్తిగా ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టటం ఇందుకు కారణం. విద్యార్థులు తమ భవిష్యత్ దృష్ట్యా ఆంగ్లాన్ని నేర్చుకోవటం తప్పనిసరి. అయితే అదే సమయంలో తెలుగును విస్మరించటం, తెలుగు పూర్తిగా కనుమరుగయ్యేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉండటం మాత్రం భాషాభిమానులు ఏ మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అధికార భాషా సంఘం, సాహిత్య అకాడమీ వంటి వాటికి తగినన్ని నిధులు కేటాయించి ప్రోత్సహించగా, ప్రస్తుత ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలుగా వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసింది.

ప్రభుత్వ విధానంతో మాతృభాష దూరం



భాష, సంస్కృతి అనేది ఒకతరం నుంచి ఇంకొకతరానికి వారసత్వంగా అందాల్సిన సంపద. అయితే ప్రస్తుత, భావితరాలకు మన మాతృభాష తెలుగు దూరమయ్యేలా ప్రభుత్వ విధానం ఉంది. పాఠశాలలో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టటం, అధికార భాషా సంఘం, సాహిత్య అకాడమీ వంటి సంస్థలు నిర్వీర్యం అవుతుండటం భాషాభిమానులను, సాహిత్యవేత్తలను తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, భాషాభిమానులు తెలుగుకు వెలుగులు నింపేందుకు కృషి చేయాలి. ఇందుకోసం తగిన కార్యాచరణ రూపొందించాలి

-తేళ్ల అరుణ, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు

తెలుగుపై మక్కువ పెంచాలి



యువతకు తెలుగు భాషపై మమకారం పెంచాల్సిన అవసరం ప్రస్తుతం ఎంతైనా ఉంది. అందుకోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చిన్నతనం నుంచే తెలుగు భాషను పిల్లలకు నేర్పేందుకు కృషి చేయాలి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్లంలో విద్యాభ్యాసం ఎంతో అవసరం. అయితే అదే సమయంలో మన సంస్కృతి, భాష పదికాలాలు పదిలంగా మనగలగాలంటే మాత్రం పిల్లలకు స్వచ్ఛమైన తెలుగును నేర్పించాల్సిన ఆవశ్యకత ఉంది. ఇందుకోసం అందరూ పాటుపడాలి.

-డాక్టర్ మున్నంగి రాజకుమారి, నరసం జిల్లా అధ్యక్షురాలు

సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారు

• ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈనెల 23న ఒంగోలు పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు ఉదయం 9.35 గంటలకు తాడేపల్లిలోని సీఎం నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరుతారు. 10.15 గంటలకు ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని ఎన్.అగ్రహారంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. 10.15నుంచి 10.25 వరకు ప్రజాప్రతినిధులను కలుస్తారు. 10.30నుంచి 10.40 గంటల వరకు లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. 10.45 గంటలకు బహిరంగ సభ వేదిక వద్దకు వస్తారు. 10.45నుంచి 10.50 వరకు ఒంగోలు నగరంలో తాగునీటి ప్రాజెక్టుకు సీఎం శిలాఫలకం ఆవిష్కరిస్తారు. 11.05నుంచి 11.10 వరకు కలెక్టర్ దినేష్‌కుమార్ అతిథులను వేదికమీదకు ఆహ్వానిస్తారు. 11.25నుంచి 11.35 వరకు లబ్ధిదారులతో మాట్లాడిస్తారు. 11.35 నుంచి 12.35 వరకు ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. 12.40 గంటలకు వేదిక నుంచి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. హెలిప్యాడ్ వద్దకు 12.45నుంచి 1.45 గంటల వరకు స్థానిక లీడర్లతో జగన్ మాట్లాడతారు. 1.50కి అగ్రహారం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2.35 గంటలకు తాడేపల్లి చేరుకుంటారు. ఈమేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి షెడ్యూల్ ఖరారు కావడంతో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టారు. ఎన్.అగ్రహారం వద్ద హెలిప్యాడ్‌తో పాటు బహిరంగ సభకు అవసరమైన చర్యలను అధికారులు చేపట్టారు.

మర్రెడ్డికి దామచర్ల పరామర్శ

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 20: ఒంగోలులోని జిమ్స్ హాస్పిటల్‌లో డాక్టర్ రామచంద్రరెడ్డి, అతని అనుచరుల దాడిలో గాయపడిన తెలుగు రైతు రాష్ట్ర ప్రెసిడెంట్ మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డిని మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ పరామర్శించారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో ఐసీయూలో చికిత్స పొందుతున్న శ్రీనివాసులురెడ్డితో మాట్లాడిన దామచర్ల హత్యాయత్నానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

కల్యాణమస్తు, షాదీతోఫా నిధులు విడుదల



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్); ఫిబ్రవరి 20: జిల్లాలో వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా కింద ఐదవ విడతలో 416మంది లబ్ధిదారులకు రూ.3.43కోట్లు లబ్ధి చేకూరిందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం సీఎం లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వధువుల తల్లుల ఖాతాల్లోకి ఈ నిధులను జమచేస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలతో జీవనం దుర్భరం

• జనసేన పార్టీ నాయకుల ధ్వజం



కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20 : పెరిగిన ధరలతో సామాన్యులు జీవనం సాగించలేని పరిస్థితి ఏర్పడిందని జనసేన పార్టీ నాయకులు ఆరోపించారు. జనచైతన్య యాత్రలో భాగంగా మంగళవారం కొప్పోలులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా ప్రజల సమస్యలను తెలుసుకొని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ వైసీపీ పాలకులు అధికారం కోసం అనేక హామీలు ఇచ్చి తరువాత విస్మరించారన్నారు. ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో అన్ని రకాల ధరలు పెరిగి సామాన్యుల జీవనం అస్తవ్యస్తంగా పెరిగిందని విమర్శించారు. ప్రజల ఆదాయం పెరగలేదని, ధరలు మాత్రం అమాంతంగా పెరగడంతో సామన్యులకు పూటగడవని పరిస్థితి ఏర్పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన నేతృత్వంలో ఏర్పడే ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. జగన్‌రెడ్డి పాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు తేళ్ళ హరీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చనపతి రాంబాబు, ముత్యాల కళ్యాణ్, పల్ల ప్రమీల, ఆకుపాటి ఉష, ఉంగరాల వాసు, కోట సుధీర్, నరసింహారావు, అవినాష్‌నాయుడు, సాయికృష్ణ, అనూష, మర్రిపూడి మాధవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలు దొంగ ఓట్లు చేరుస్తున్నారు!

ఎమ్మెల్యే స్వామి విమర్శ
అప్రమత్తంగా ఉండాలని టీడీపీ శ్రేణులకు సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, ఫిబ్రవరి 20: నియోజకవర్గంలో వైసీపీ నాయకులు బరితెగించి దొంగ ఓట్లను చేరుస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆరోపించారు. కొత్త ఓట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని టీడీపీ శ్రేణులకు సూచించారు. నూతనంగా ప్రారంభించిన స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే స్వామి, పార్టీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో స్వామి పాల్గొని మాట్లాడారు. అధికారపార్టీ నేతలు ఓటమి భయంతో పక్క నియోజకవర్గాల ఓట్లను కొండపి సెగ్మెంట్‌లో చేరుస్తున్నారని మండిపడ్డారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు రాష్ట్రంలో, ఇటు నియోజకవర్గంలో టీడీపీ విజయం ఖాయమైందని తెలిపోయాక దొడ్డిదారులను వెతుకుతున్నారని ధ్వజమెత్తారు. అందులోభాగంగానే నియోజవర్గ ఈఆర్వోలుగా నెలవ్యవధిలో ముగ్గురుని, వారం రోజుల్లో సింగరాయకొండ తహసీల్దార్లు ముగ్గురిని మార్చారని తెలిపారు. ఇదంతా మంత్రి సురేష్ ప్రోద్బలంతోనే జరుగుతున్నదని విమర్శించారు. సింగరాయకొండలో అధిక భాగం దొంగ ఓట్లను చేరుస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి తప్పులు చేస్తే అధికారులు తగినమూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. దొంగ ఓట్ల విషయమై టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సందానీబాషా, మించల బ్రహ్మయ్య, గాంధీచౌదరి, రామారావు, కూనపరెడ్డి సుబ్బారావు, సన్నెబోయిన శ్రీనివాసులు, వేల్పుల వెంకట్రావు, నర్రా రాంబాబు, గౌస్, యస్థాని, నరసింహ పాల్గొన్నారు.

23న సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీ

• ఎమ్మెల్యే బాలినేని



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: ఒంగోలులోని పేదలకు ఈనెల 23వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ జరుగుతుందని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని పలు సచివాలయాల్లో లబ్ధిదారులకు పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. స్థానిక భాగ్యనగర్, మరాఠిపాలెం, క్లౌపేట, కబాడిపాలెం, మారుతినగర్, శ్రీనగర్‌కాలనీ, ఎస్‌బీఐకాలనీ తదితర సచివాలయాలను ఆయన సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. రిజిస్ట్రేషన్ సక్రమంగా చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు అనంతరం ఆయా సచివాలయాల్లో అడ్మిన్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్టాలు పంపిణీ చేసేందుకు వస్తున్నందున రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సచివాలయాల్లో చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలోమేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఒంగోలు(కార్పొరేషన్): ఒంగోలు నగరంలోని 34వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులురెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. స్థానిక డివిజన్‌కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు రూ.2కోట్లు విలువైన రోడ్డు విస్తరణ, గద్దలగుంట పార్కు అభివృద్ధి, మహిళా భవన్, బావి సెంటర్ నుంచి రాజీవ్ నగర్ వరకు రోడ్డు విస్తరణ, శ్మశానవాటిక అభివృద్ధి పనులకు బాలినేని శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను టంగుటూరులోకి వచ్చేలా చూడాలి

• కాంగ్రెస్ నాయకుల డిమాండ్



ర్యాలీగా వెళుతున్న నాయకులు

టంగుటూరు, ఫిబ్రవరి 20: టంగుటూరుకు దూరంగా ఉండే జాతీయ రహదారిలో వెళ్లే ఆర్టీసీ బస్సులన్నింటినీ రాత్రి వేళల్లో పట్టణంలోపల నుంచి పంపాలని కాంగ్రెస్ పార్టీ కొండపి నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు బొడ్డు సతీష్‌బాబు డిమాండ్ చేశారు. బస్సుల సమస్యపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం టంగుటూరులో ధర్నా నిర్వహించారు. తొలుత పార్టీ నాయకులు స్థానిక పరం సెంటర్‌కు చేరుకొని అక్కడి నుంచి పాదయాత్రగా బస్టాండ్ రోడ్డు కూడలికి వచ్చారు. అక్కడి పోతుల చెంచయ్య విగ్రహం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ రాత్రి 9.30 తర్వాత జిల్లా కేంద్రమైన ఒంగోలు నుంచి టంగుటూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని, రాత్రి 9.30 గంటల తరువాత ఒంగోలు నుంచి వచ్చేవారుంటే తెల్లవార్లూ బస్టాండ్‌లో కునికిపాట్లు పడాల్సి వస్తున్నదన్నారు. వ్యాపారాలు, ఆసుపత్రికి చికిత్స నిమిత్తం, ఇతర పనులపై ఒంగోలు వచ్చి ఆలస్యమయ్యే వారంతా రాత్రి పూట టంగుటూరు చేరుకునే మార్గం లేక నానాఅగచాట్లు పడుతున్నారన్నారు. తక్షణమే పగలు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు బస్టాండ్‌కు, రాత్రి వేళంతా ఆర్టీసీ బస్సులను ఊరిలో నుంచి నడపాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో రాస్తారోకో చేస్తామని, ఒక్క బస్సును కూడా హైవేలో పోనివ్వమని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిల్లి భాస్కర్‌రెడ్డి, కాకర్లపూడి వేణు, ఈమని కోటేశ్వరరావు, రమణమ్మ, ఆంద్రా రాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యం

• నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్



మహిళకు నమస్కరిస్తున్న విజయ్‌కుమార్

చీమకుర్తి, ఫిబ్రవరి 20: తెలుగుదేశంపార్టీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. చీమకుర్తి పట్టణంలోని దిన్నేపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ ఇంటింటా తిరుగుతూ టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలను వివరించే కరపత్రాలను అందించారు. మహిళలకు ప్రత్యేకంగా అందించే తల్లికి వందనం, మహిళాశక్తి, గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించే పథకాల గురించి మహిళలకు వివరించారు. టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించటం ద్వారా రాష్ట్రం అభివృద్ధిపథంలో పయనిస్తుందని తెలిపారు. కాగా గ్రామంలో విజయ్‌కుమార్‌కు మహిళలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, రావిపాటి రాంబాబు, ఉన్నం సుబ్బారావు, నర్రా నాగరాజు, కాట్రగడ్డ రమణయ్య, జనసేన నాయకులు పల్లపు శివప్రసాద్, తాతినేని శ్రీరామ్, దరిమడుగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

యువతిని మోసం చేసిన నిందితుడికి పదేళ్ల జైలు

ఒంగోలు(క్రైం) ఫిబ్రవరి 20: పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి యువతిని మోసం చేసిన పోకూరి మహేష్ అనే యువకుడికి 10 ఏళ్ళ జైలు, రూ.4వేలు జరిమానా విధిస్తూ జిల్లా రెండవ అదనపు న్యాయాధికారి ఎం.సోమశేఖర్ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడుకు చెందిన పోకూరి మహేష్ అదే మండలానికి చెందిన యువతికి మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. పెళ్ళి చేసుకుంటానని నమ్మించాడు. యువతిని గర్భవతిని చేసి అబార్షన్ చేయించాడు. అనంతరం పెళ్ళి చేసుకోకుండా మోసం చేశాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు 2018జూలై 16న మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయగా అప్పటి ఒంగోలు రూరల్ సీఐ మురళీకృష్ణ దర్యాప్తు చేశారు. నిందితుడు మహేష్‌ను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. బాధితురాలి తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యాతం కొండారెడ్డి వాదనలు వినిపించారు. నిందితునికి శిక్ష పడేలా సాక్ష్యాలు సేకరించిన పోలీసులను ఎస్పీ పరమేశ్వరరెడ్డి అభినందించారు.

జడ్పీ పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 20: జిల్లాలోని జడ్పీ పరిధిలోని ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవీ.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు కోరారు. ఈమేరకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. టీచర్ల పీఎఫ్ ఖాతాల్లో పెండింగ్‌లు లేకుండా సంబంధిత డీడీవోల నుంచి షెడ్యూల్స్‌ను తెప్పించి మిస్సింగులు లేకుండా చూడాలన్నారు. సీఎఫ్ఎంఎస్‌కు వీలైనంత త్వరగా అప్‌డేట్ చేసిన ఖాతాలకు సంబంధించిన సమాచారం పంపాలని వారు కోరారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: రానున్న వేసవికాలంలో గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలను ఆర్థికంగా నిర్వీర్యం చేయడం ద్వారా నిత్యం ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. అధికారుల నిర్లక్ష్యం కూడా తోడై గత కొన్ని సంవత్సరాలుగా బిల్లుల చెల్లింపుల లేక కనీస అవసరాలను కూడా తీర్చలేని స్థితిలో సర్పంచ్‌లు ఉన్నారని, అందువల్ల గ్రామాల్లో నీటి ఎద్దడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

శనగపంటలో నూతన వంగడాలు



శనగపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 20: ఒంగోలు మండలం మండవవారి పాలెంలో సాగు చేసిన శనగపంటలో నూతన వంగడాలైన ఎన్‌బీఈజీ 833, ఎన్‌బీఈజీ810 రకాలను నంద్యాల వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వీరజయలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నూతన వంగడాలు ఒక హెక్టారుకు 22నుంచి 25క్వింటాలు దిగుబడి వస్తుందని తెలిపారు. వంద గింజలు 45 గ్రాములు బరువు ఉంటుందని, ఈ రకం శనగలు ఎండుతెగులను తట్టుకుంటాయని చెప్పారు. శనగపంటలోని నూతన వంగడాలను ప్రకాశం జిల్లాలో పలు గ్రామాల్లో రైతులతో సాగు చేయించామన్నారు. కొత్త వంగడాలను వచ్చే సీజన్‌లో సాగు చేసి అధిక ఫలసాయంను పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ ఎ.అన్నపూర్ణ, ఏడీఏ రమేష్‌బాబు, ఏవో కిషోర్‌బాబు, రైతులు మండవ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

కొండపి, ఫిబ్రవరి 20: నియోజకవర్గ కేంద్రమైన కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు, అనకర్లపూడిలోని రెండు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్, ఎస్సై వై.నాగరాజు, ఎంఈవో-2 కె.సురేఖ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా స్థానికులతో మాట్లాడారు. గతంలో పోలింగ్ జరిగిన తీరు, ఎదురైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం సందర్శన

కొండపి, ఫిబ్రవరి 20 : కొండపిలోని శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ సందర్శించారు. పాఠకుల రిజిస్టర్‌ను, సభ్యత్వాలను పరిశీలించారు. పోటీ పరీక్షలు రాసే వారికి ఉపయుక్తమైన పుస్తకాలు ఉన్నాయని ఆయన అన్నారు. అందరూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు బత్తుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు పాకల విద్యార్థినులు



విద్యార్థినులతో ఉపాధ్యాయులు

సింగరాయకొండ, ఫిబ్రవరి 20 : మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌కి చెందిన ఆరుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. బాపట్ల జిల్లా చినగంజాంలో జరిగిన ఎంపిక పోటీల్లో కె.నందిని, కె.కార్తీక, వి.హేమలత, పి.స్వాతి, వి.అంకమ్మ, కె.సిపోరా ప్రతిభ చూపి రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. వీరు బుధవారం నుంచి పల్నాడు జిల్లా సత్తెనపల్లెలో నిర్వహించే అంతర్ జిల్లాల సబ్‌జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థినులను మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐవీఎఫ్ పద్ధతి ద్వారా మేలు జాతి దూడ జననం



దూడను పరిశీలిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి20: నాగులుప్పలపాడు మండలం చదలవాడ పశుక్షేత్రంలో ఐవీఎఫ్ ద్వారా ఆవుమేలు జాతి పెయ్యదూడకు మంగళవారం జన్మనిచ్చింది. డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ బి.రవి ఇందుకోసం ఆరోగ్యవంతమైన ఆవును చేశారు. డాక్టర్ టి.శ్రీమన్నారాయణ ఐవీఎఫ్‌తో పిండాన్ని గత సంవత్సరం ఏప్రిల్ 27న ఆవుగర్భంలోకి అమర్చారు. ఈక్రమంలో ఆరోగ్యవంతమైన పెయ్యదూడ పుట్టింది. ఈ సందర్భంగా పశుక్షేత్ర ఏడీఏ బి.రవి మాట్లాడుతూ తక్కువ సమయంలో మేలైన పెయ్యదూడలను ఉత్పత్తి చేసేందుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పశుక్షేత్ర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



తన్నీరు సుబ్బారావు (ఫైల్)

కొండపి, ఫిబ్రవరి 20 : మండలంలోని అనకర్లపూడి గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు తన్నీరు సుబ్బారావు (67) మంగళవారం హఠాన్మరణం చెందారు. సుబ్బారావుకు గుండెనొప్పి రావడంతో ప్రైవేటు వాహనంలో ఒంగోలులోని ఓ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మరోవైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ ఆయన ప్రాణాలు విడిచారు. సుబ్బారావు 2013 నుంచి 2018 వరకు అనకర్లపూడి సర్పంచ్‌గా పనిచేశారు. స్వగృహానికి తరలించిన ఆయన మృతదేహాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బత్తుల నారాయణస్వామి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొర్రపాటి వసంతరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఓటింగ్ యంత్రాలను భద్రపరిచే గోడౌన్‌ను మంగళవారం కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలను, వీవీప్యాడ్‌ను భద్రపర్చిన గోడౌన్ సీల్‌ను తనిఖీ చేసి సంబంధిత రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్ వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దారుణం

• చీమకుర్తిలో పోలీసులకు ఫిర్యాదు

చీమకుర్తి, ఫిబ్రవరి 20: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిపై కఠినచర్యలు చేపట్టాలని సంతనూతలపాడు నియోజకవర్గంలోని జర్నలిస్టులు మంగళవారం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై పాశవికదాడిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు చేస్తుంటే జర్నలిస్టులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. జర్నలిస్టు సంఘ నాయకులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఖండన

ఒంగోలు(కలెక్టరేట్): అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం బహిరంగసభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరిమూకలు దాడి చేయడాన్ని జనసేన పార్టీ ప్రచార కో ఆర్డినేటర్ జడా బాలనాగేంద్రయాదవ్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెం ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమాజంలో అందరికి అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటూ పనిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ కవరేజ్ కోసం వెళ్ళిన శ్రీకృష్ణపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని


చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదును అందజేస్తున్న జర్నలిస్టులు

డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

హేతువాద సంఘం ఆధ్వర్యంలో..

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు మొగల్ కాలేషాబేగ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం సభ కవరేజ్ కోసం వెళ్ళిన శ్రీకృష్ణపై వైసీపీ రౌడీ మూకలు దారుణంగా దాడి చేసి కొట్టడం దుర్మార్గంగా ఉందని, ఈ ఘటనకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. ఇది దుర్మార్గమన్నారు. స్వయానా ముఖ్యమంత్రి సమక్షంలోనే ఇంతటి దారుణం జరగడాన్ని చూస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పాతరేసినట్లే అనిపిస్తున్నదన్నారు. వైసీపీ మూకలు దాడి చేసినట్లు ఫొటో వీడియోల ద్వారా స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ ఇంత వరకూ వారిని అరెస్టు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో ఒక ప్రధాన పత్రిక ఫొటో గ్రాఫర్‌కే రక్షణ లేకుంటే సామాన్యులకు ఏమి ఉంటుందన్నారు. దాడిని ఖండించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు బొడ్డు సతీష్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బక్కా తిరుమలరావు మాదిగ, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు కసుకుర్తి శ్రీధర్, సీపీఐ మండల కార్యదర్శి టి.ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు శాంతపాల్ ఉన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు సహకరించండి

• కేంద్రమంత్రులకు బీజేపీ అధికార ప్రతినిధి లంక దినకర్ విజ్ఞప్తి


వినతిపత్రాన్ని అందజేస్తున్న దినకర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు సహకరించాలని బీజేపీ ఏపీ ముఖ్య అధికార ప్రతినిధి లంక దినకర్ కేంద్రమంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం రెండు రోజులుగా ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలసి వినతిపత్రం అందించారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ సమావేశాలలో పాల్గొన్న అనంతరం బీజేపీ ఏపీ ముఖ్య అధికారప్రతినిధి లంకా దినకర్ ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న దొనకొండ పారిశ్రామికవాడ, కనిగిరి నిమ్జ్, జాతీయ హెలికాప్టర్ శిక్షణ సంస్థ, ఫిషింగ్ హార్బర్, దొనకొండ రైల్వే స్టేషన్ అభివృద్ధి, ఒంగోలు నుంచి దొనకొండ మధ్య రైల్వే లైన్, పశ్చిమ ప్రకాశం జిల్లాలో తాగు, సాగు నీటి సమస్యలు, యువతకు ఉపాధి అంశాల పైన, గ్రానైట్ లోడు ప్రమాదాల నివారణ కోసం ఒంగోలు పట్టణం పశ్చిమాన బైపాస్ రోడ్ నిర్మాణం వంటి అంశాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ , రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఆయా ప్రాజెక్టుల పురోగతి కోసం సహకరించాలని కోరారు.

రాయవరంలో పట్టపగలు చోరీ

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 20: మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీలో గల రైల్వే స్టేషన్ సమీపంలోని ఓడర్ బ్రిడ్జి పక్కన వీధిలో మంగళవారం పట్టపగలు చోరీ జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం భార్యాభర్తలు ప్రైవేట్ ఉద్యోగాల చేస్తుండడంతో ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. సాయంత్రం 6గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉంది. బీరువాలో ఉన్న సుమారు 3 తులాల 2 బంగారు గాజులు, 3 తులాల నల్లపూసల దండ చోరీకి గురైనట్లు తెలిపారు. రూరల్ పోలీసులకు సమాచారం తెలపగా, రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. బాధితుడు కొమ్ము భూషణం ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖనిజ లవణాల లోపాలను అధిగమించాలి

• దర్శి కేవీకే విజ్ఞాన కేంద్ర పశువిభాగ శాస్త్రవేత్త లీలాకృష్ణ

కనిగిరి, ఫిబ్రవరి 20 : పశువుల్లో ఏర్పడే ఖనిజ లవణాల లోపాలను గుర్తించి సమస్యలను అధిగమించాలని దర్శి కేవీకే విజ్ఞాన కేంద్ర పశువిభాగ శాస్త్రవేత్త ఎన్ లీలాకృష్ణ చెప్పారు. మండలంలోని చాకిరాల గ్రామంలో పాడి రైతులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులలో వచ్చే ఖనిజ లవణాలను అధిగమించాలంటే ప్రతి పశువుకు 50 నుంచి 80 గ్రాముల చొప్పున ఖనిజ లవణాలు ఉన్న మిశ్రమాన్ని దాణాతో గేదెలకు అదించాలన్నారు. తద్వారా పాలల్లో అధిక దిగుబడి పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎలీషా, పాడి రైతులు మహిళలు పాల్గొన్నారు.

మర్రెడ్డిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

పామూరు, ఫిబ్రవరి 20 : టీడీపీ తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసులరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో ప్రతిపక్ష నాయకులపై దాడులు పెరిగాయని విమర్శించారు. నిందితులను శిక్షించాలని కోరారు.

యువకుడు ఆత్మహత్య

అద్దంకి, ఫిబ్రవరి 20: మండలంలోని వెంపరాల ఎస్సీకాలనీలో జి.అంకమ్మరావు (32) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. అంకమ్మరావు బేల్దారి పనులకు వెళ్లి కుటుంబపోషణ సాగిస్తున్నాడు. ప్రస్తుతం భార్యాభర్తలు పచ్చాకు పనికి వెళ్తున్నారు. గత కొద్దిరోజులుగా అంకమ్మరావు పనికి వెళ్ళకుండా ఇంటి వద్దనే ఉంటున్నట్లు తెలుస్తుంది. ఈక్రమంలో మంగళవారం కుటుంబసభ్యులు ఎవరూలేని సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే గమనించి 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలోపు మృతి చెందాడు. అంకమ్మరావుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

గ్రానైట్ శ్లాబుల లారీ పట్టివేత

మార్టూరు, ఫిబ్రవరి 20: మార్టూరు సెంటరు నుంచి రాజుపాలెం వెళ్లే సర్వీసు రోడ్డులో సోమవారం అర్ధరాత్రి ఎలాంటి బిల్లులు లేకుండా ఇతర రాష్ట్రానికి వెళుతున్న గ్రానైట్ శ్లాబుల లారీని పట్టుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మూడు రోజుల క్రితం రాజుగారిపాలెం రోడ్డు వద్ద కూడా మరో గ్రానైట్ శ్లాబుల లారీని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీటిని స్టేషన్‌కు తరలించిన అనంతరం మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

తిమ్మనపాలెం రేషన్ డీలర్ తొలగింపు

మేదరమెట్ల , ఫిబ్రవరి 20: తిమ్మనపాలెం రేషన్ డీలర్‌ను తొలగిస్తూ ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. తిమ్మనపాలెం రేషన్ డీలర్‌గా జి.లక్ష్మీకుమారి పనిచేస్తుస్తున్నారు. ఆమె 2021 పంచాయతీ ఎన్నికలల్లో తిమ్మనపాలెం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నవారు రేషన్ షాపు నిర్వహించడానికి వీలు లేదని పౌరసరఫరాల చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారని గ్రామానికి చెందిన వారు ఫిర్యాదు చేయడంతో లక్ష్మీకుమారిని రేషన్ డీలర్‌గా తొలగిస్తు ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి ఉత్వర్వులు జారీ చేశారు. తక్షణమే తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

• టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 20: వైసీపీ పాలనలో అధోగతిపాలైన రాష్ట్ర భవిష్యత్తు తిరిగి బాగుపడాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఆయన కొత్తపట్నం మండలం రంగాయపాలెం పంచాయతీలో జనం కోసం జనార్దన్, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల తెలుగుదేశంపార్టీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. మహిళలు, యువకులతో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే రాబోయే ఎన్నికల్లో చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రి చేసుకుందామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ద్వారాబాకులు శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకులు గేనం సుబ్బారావు, మూగ పోలురాజు, దాసరి పోలయ్య నాళం నరసమ్మ, కత్తి పద్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు అద్దంకి విద్యార్థి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 20: అద్దంకిలోని ఎన్‌టీఆర్ మెమోరియల్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పట్టణంలోని నంబూరివారిపాలెంకు చెందిన దినేష్ ఎన్‌టీఆర్ కళాశాలలో చదువుతూ ప్రకాశం జిల్లాలో జనవరి 30న జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీలో గెలుపొంది గోల్డ్‌మెడల్ సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 28 నుంచి మార్చి 5 వరకు పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలలో పాల్గొననున్నారు. ఈసందర్భంగా కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ఎంఏ రత్తయ్య, కరస్పాండెంట్ ఎంవీ రత్తయ్య, అధ్యాపకులు అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మేదరమెట్ల , ఫిబ్రవరి 20: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల జాతీయరహదారిపై బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనమనమూరు గ్రామానికి చెందిన కొప్పోలు గోపి బైక్ పై బైపాస్‌లోని పెట్రోల్ బంకులో అయిల్ పోయించుకుని బయటకు వచ్చాడు. అదే సమయంలో మరో బైకిస్టుకు ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలపర్వం

ఎమ్మెల్యే స్వామి సమక్షంలో 15 కుటుంబాలు చేరిక

సింగరాయకొండ, ఫిబ్రవరి 20 : మండలంలో అధికారపార్టీను వీడి టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. పాకల పంచాయతీ పరిధిలోని క్రాంతినగర్, చెల్లమ్మపాలెంలో వైసీపీకు చెందిన 15 కుటుంబాలు టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఆయన వారికి కండువాలుకప్పి సాదరరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వాయిల హరికృష్ణ, కొడూరి మురళీకృష్ణ, కటారి బద్రి, వేణు, ఆవల వేణు, గోపిచంద్, కాటంగారి రాము, వాయిల తిరుపతి, ప్రకయకావేరి రమేష్ తదితరులు ఉన్నారు.


యోగానందకు పార్టీ కండువాకప్పి ఆహ్వానిస్తున్న దామచర్ల పూర్ణచంద్రరావు

టీడీపీ తీర్థం పుచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే తనయుడు

కొండపి మాజీ ఎమ్మెల్యే మోరబోయిన మాలకొండయ్య తనయుడు, వైసీపీ నేత యోగానంద ఆపార్టీకి గుడ్‌బై చెప్పారు. టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు సమక్షంలో మంగళవారం సైకిలెక్కారు. మూలగుంటపాడులోని యోగానంద స్వగృహానికి వెళ్లి ఆయనతో చర్చల అనంతరం పూర్ణచంద్రరావు పార్టీ కండువా కప్పి సాదరంగా తెలుగుదేశంలోకి ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఆయనకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బంగారయ్య, చీమకుర్తి కృష్ణ, చిగురుపాటి గిరి, గుదే వెంకటేశ్వర్లు, సుదర్శి చంటి, దక్షిణం శ్రీను, సన్నెబోయిన వెంకటేశ్వర్లు, అంబటి శ్రీను పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక • ఎంపీడీవో, మెడికల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం రెండో విడతను చేపట్టిందని, స్పెషలిస్టు వైద్యులతో గ్రామస్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడంతో పాటు వ్యాధి తీవ్రతను బట్టి ఆరోగ్య శ్రీనెట్‌వర్క్ ఆస్పత్రులకు కేసులకు రిఫర్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో సగటు ఓపీ రిజిస్ట్రేషన్ల కంటే


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

తక్కువగా ఉన్న వెలిగండ్ల ఎంపీడీవో, మెడికల్ ఆఫీసర్లపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హౌస్ సర్వే 90శాతం కంటే తక్కువగా ఉన్న వలంటీర్లను తొలగించాలని చెప్పారు. కౌమార దశలోని బాలికలలో హిమోగ్లోబిన్ పరీక్షలను ఈ వారంలోగా పూర్తి చేయాలన్నారు. పూర్తయిన ప్రభుత్వం భవన నిర్మాణాలను సంబంధిత శాఖలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయాల ద్వారా అందించే సేవలలో ఎలాంటి జాప్యం లేకుండా పర్యవేక్షించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా సమీక్షించి కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు వసుంధర, రవికుమార్, డాక్టర్ పద్మజ, జాలిరెడ్డి, హేమంత్, వెంకటేశ్వర్లు, కొండయ్య, లక్ష్మారెడ్డి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తి కలిగివుండాలి




వాలీబాల్, కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు, విజేతలకు బహుమతులను అందజేస్తున్న వీసీ అంజిరెడ్డి తదితరులు

ఏకేయూ వీసీ అంజిరెడ్డి

ఉత్సాహంగా పెడగాజి గేమ్స్ మీట్

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 20: ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎం.అంజిరెడ్డి పేర్కొన్నారు. పెడగాజి గేమ్స్ మీట్ -2024 మంగళవారం ఒంగోలులోని ఏకేయూ లో జరిగింది. ఈ కార్యక్రమానికి వీసీ అంజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. తాను వీసీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రెండోసారి ఈ స్థాయి క్రీడాపోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అంతేగాకుండా ప్రకాశం జిల్లాను స్పోర్ట్స్ బ్రాండ్‌గా తీర్చిది ద్దేందుకు యూనివర్సిటీ పరంగా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరో మూడునెలల్లో యూనివర్సిటీ ప్రాంగణం పేర్నమిట్ట వద్ద ఉన్న యూనివర్సిటీ భవనంలోకి మారనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ఏకేయూ పేర్నమిట్ట క్యాంపస్‌లో యూనివర్సిటీ పరిధిలోని 224 కళాశాలల విద్యార్థులతో మెగా టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించిన వీసీ ఆయా క్రీడాజట్లను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, స్పోర్ట్ డిప్యూటీ డైరెక్టర్‌దే వీవరప్రసాద్, కేవీఎన్.రాజు, ప్రొఫెసర్ హరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ కె.ని ర్మల, రిమ్స్ వైద్యులు పి.సుధీర్, సీహెచ్.హేమశిల్ప తదితరులు పాలొన్నారు.

కాగా పలు పాఠశాలల విద్యార్థులు వాలీబాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

నికరంపల్లిలో యువకుడి దారుణ హత్య

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే ఘాతుకం

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 20 : మండలంలోని నికరంపల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వెంకటేశ్వర్లు(32) వెంకటేశ్వర్లు తన భార్య తిరుపతమ్మతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మారంరెడ్డి కాశీరామిరెడ్డి అనే యువకుడు గొడ్డలితో విచక్షణారహితంగా ఒంటిపై దాడి చేసి హత్య చేశాడు. తిరుపతమ్మకు కాశీరామిరెడ్డితో వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో తమకు అడ్డుగా ఉన్నాడన్న నెపంతో వెంకటేశ్వర్లును కాశీరామిరెడ్డి హత్య చేసినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. వెంకటేశ్వర్లకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. నిందితుడు మారంరెడ్డి కాశీరామిరెడ్డి పరారీలో ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ బాల సుందరరావు, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎ స్సై వెంకటేశ్వర నాయక్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్ర గాయాలైన తిరుపతమ్మను మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు. మృతదేహాన్ని స్థానిక జిల్లా వైద్యశాలలో శవ పరీక్ష నిర్వహించి మృతుని బంధువులకు అప్పగించారు. వెంకటేశ్వర్లు తండ్రి వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్ఐ

సెయింట్ ఆన్స్ అధ్యాపకునికి జాతీయస్థాయి అవార్డు

చీరాల, ఫిబ్రవరి 20: చీరాలలోని సెయింట్ ఆన్స్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ టి.గోపాలరావు జాతీయస్థాయి అవార్డు సాధించారు. కళాశాలలో మంగళవారం స్థానిక కళాశాలలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు గోపాలరావును అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతున్న కళాశాల ప్రతిష్టను ఇనుమడింపజేసే విధంగా గోపాలరావు ముందడుగు వేయటం హర్షనీయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, మెకానికల్ ఇంజనీరింగ్ వి భాధిపతి డాక్టర్ సీహెచ్ లక్ష్మీతులసి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అధ్యాపకుడిని కళాశాల ప్రతినిధులు


అన్నాభిషేకంలో మార్కండేశ్వరుడు

మార్కండేశ్వరునికి అన్నాభిషేకం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 20: జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి మంగళవారం అన్నాభిషేకం నిర్వహించారు. మాఘ మాసం ఆర్ద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్ తేజ శర్మ స్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ చైర్మన్ పెనుకొండ కేశవరావుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు

- సందుకో దుకాణం
- కొన్ని గ్రామాల్లో పాటలు
- త్రిపురాంతకంలో అన్ని కిచిడీ హోటళ్లు, పట్టణంలో మొబైల్ బెల్టు దుకాణాలు
- ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రూ.10కి అదనంగా కొనుగోలు
- చోద్యం చూస్తున్న అధికారులు


త్రిపురాంతకంలోని ప్రభుత్వ మద్యం దుకాణం

త్రిపురాంతకం, ఫిబ్రవరి 20 : మండలంలోని అన్ని గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. అక్రమ మద్యం వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలుగా సాగుతోంది. కొన్ని గ్రామాల్లో వేలంపాటలు నిర్వహించి ఎక్కువ పాట పాడినవారు దుకాణాలను నిర్వహిస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో అవకాశాన్ని బట్టి దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఇలా నిర్వహించే బెల్టు దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రూ.10 అదనంగా చెల్లించి గ్రామాలకు తరలించి దుకాణాలను నిర్వహిస్తున్నారు. అక్కడ క్వార్టర్ బాటిల్‌కు సమయాన్ని బట్టి రూ.50 నుంచి 70 వరకు అదనంగా తీసుకుని విక్రయిస్తున్నారు. దీనికితోడు మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బందే మద్యం బాటిళ్లను గ్రామాలకు చేరుస్తూ బాటిల్‌కు రూ.10 నుంచి 20 వరకూ అదనంగా వసూలు చేసుకుంటున్నారు. నిబంధన మేరకు ఒక్కో వ్యక్తికి మూడు క్వార్టర్ బాటిళ్ల కన్నా ఎక్కువ విక్రయించకూడదు. కాగా అదనంగా ధరలు వసూలు చేసి ఎన్ని కావాలంటే అన్ని విక్రయిస్తున్నారు. ఈనేపథ్యంలో ఇటీవలే త్రిపురాంతకంలోని ఓదుకాణం నుంచి 200 బాటిళ్లను తరలిస్తుండగా ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేసి నలుగురిని అరెస్టు చేశారు. వారిలో ముగ్గురు ప్రభుత్వ మద్యం దుకాణ సిబ్బందే. గతంలో బెల్టు దుకాణానికి మద్యం తీసుకెళుతున్న ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై, తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ వారం రోజుల తర్వాత మృతి చెందిన సంఘటన కూడా జరిగింది. కాగా మిగిలిన దుకాణాల్లో సిబ్బంది కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తున్నట్లు ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. దీనికితోడు మండల కేంద్రంలో మొబైల్ బెల్టు దుకాణాలు పెరిగిపోయాయి. మద్యం కావాల్సినవారు బెల్టు దుకాణాల నిర్వాహకులకు ఫోన్ చేస్తే చాలు అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా తెల్లవారుజామున 4, 5 గంటలకు కూడా వారు ఎక్కడ ఉన్నా ఒకటో, రెండో క్వాటర్ బాటిళ్లతోపాటుగా అందులోకి అవసరమైన నీళ్లు, శీతలపానీయాలు కూడా సరఫరా చేస్తున్నారు. కాగా దుకాణాల్లో కానీ, బహిరంగ ప్రదేశాల్లో కానీ మద్యం సేవించకూడదనే నిబంధన ఉన్నా మండల కేంద్రంలో మాత్రం దాదాపు అన్ని కిచిడీ హోటళ్లలోనూ, ప్రధాన రహదారి పక్కనే ఉన్న పొలాలలో మద్యం సేవిస్తున్నారు. పోలీసులు రోడ్ల వెంట మద్యం సేవించే వారిని అదుపు చేస్తున్నారే తప్ప కిచిడీ హోటళ్లలో మద్యం సేవించే వారిపై దృష్టి సారించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై స్థానిక పోలీసులతోపాటు ఎస్‌ఈబీ అధికారులు దృష్టి సారించి బెల్టు దుకాణాలను కట్టడి చేయాలని, హోటళ్లలో మద్యం సేవించే వారితోపాటు, అలా నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 20 : రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నాయకులు బాలీశ్వరయ్య అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశానుసారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాలీశ్వరయ్య మాట్లాడుతూ ఎవరిది అభివృద్ధి పాలనో.. ఎవరిది విధ్వంస పాలనో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఏ ఊరికి వెళ్లినా వైసీపీ పాలనలో ఐదేళ్ల విధ్వంసం కనిపిస్తున్నదని, వందల కోట్లు ఖర్చు చేస్తూ అధికార దుర్వినియోగంతో సిద్ధం అంటూ సభలు నిర్వహించడం దారుణమన్నారు. రాయలసీమలోని 52 నియోజకవర్గాల్లో ప్రయాణికులను ఇబ్బంది పెట్టి ఆర్టీసీ, స్కూల్ బస్సులను బలవంతంగా రాప్తాడు సభకు తరలించారన్నారు. టీడీపీ హయాంలో ఉన్న 120 సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు షహన్షావలి, అధికార ప్రతినిధి షేక్ మహబూబ్‌భాషా, కొమ్మునూరు సర్పంచ్ కర్నాటి రామసుబ్బారెడ్డి, కొండయ్య, బిల్లా రమేష్, షేక్ జాఫర్, గుర్రం దానియేలు, జి.సంపత్‌రెడ్డి, పి.రజనీబాబు పాల్గొన్నారు.

కోఆర్డినేటర్‌గా శ్రీకాంత్



గిద్దలూరు, ఫిబ్రవరి 20 : వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా గిద్దలూరుకు చెందిన మాగులూరి శ్రీకాంత్ ఎంపికయ్యారు. కాణిపాకంలో జరిగిన క్లబ్ ట్రైనింగ్ కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ చేతుల మీదుగా శ్రీకాంత్ నియామకపత్రాన్ని అందుకున్నారు. వాసవీ క్లబ్, ఇతర సంస్థల ద్వారా పేద విద్యార్థులతోపాటు అనేక వర్గాలకు సేవా కార్యక్రమాలు అందించిన శ్రీకాంత్‌ను కొనియాడారు.

ఏజీపీగా సంగీతరావు



గిద్దలూరు, ఫిబ్రవరి 20 : గిద్దలూరులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నూతన అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాదిగా (ఏజీపీ) దాసరి సంగీతరావు నియమితులై మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని జమ్ముళ్లపల్లి గ్రామానికి చెందిన సంగీతరావు సంజీవరాయునిపేటలో ప్రాథమిక విద్య, గిద్దలూరులో డిగ్రీ, పీజీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విద్యను అభ్యసించి గత 21 ఏళ్లగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ వచ్చారు. ఇప్పటివరకు ఏజీపీగా వ్యవహరించిన వల్లెల వెంకటరామిరెడ్డి నుంచి సంగీతరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తన నియామకానికి సహకరించిన సీఎంకు, ప్రభుత్వ సలహాదారు సజ్జలకు, స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు సంగీతరావు కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్‌గా సోమ్లానాయక్


బాధ్యతల అనంతరం మాట్లాడుతున్న తహసీల్దార్

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 20 : ఎర్రగొండపాలెం తహసీల్దార్‌గా బీ సోమ్లానాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై ఎర్రగొండపాలెం తహసీల్దార్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా బీఎల్వోలు సక్రమంగా పరిశీలించాలని ఆయన ఆదేశించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, విచారణ అనంతరం పరిష్కరించాలని సూచించారు. కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు హాజరయ్యారు.

పంటల పరిశీలన

గిద్దలూరు, ఫిబ్రవరి 20 : కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు వివిధ పంటలను పరిశీలించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు సూచనలు చేశారు. సంజీవరాయునిపేట, ముండ్లపాడు, రాజుపాలెం, ఇడమకల్లు, తాటిచెర్ల గ్రామాల పరిధిలో సాగైన కంది, మొక్కజొన్న పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ ఏడాది ఎల్‌ఆర్‌జీ-105 రకం కందిని విత్తనోత్పత్తి పథకం ద్వారా రైతులకు ఇవ్వగా వర్షాభావ పరిస్థితుల కారణంగా వచ్చిన దిగుబడుల గురించి తెలుసుకున్నారు. నీరు అందించని పొలాల్లో ఎకరాకు క్వింటా కూడా కంది పంట రాలేదని, రెండు మూడు తడులు ఇచ్చిన సందర్భాలలో 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. నీటితడులు అధికంగా ఇస్తే అధిక దిగుబడులతో పాటు వెర్రి తెగులును కూడా ఈ రకం కంది తట్టుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ శివ, సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్, వ్యవసాయశాఖ అధికారులు విజయభాస్కర్‌రెడ్డి, రఫిక్, రాజశ్రీ, గ్రామవ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నికరంపల్లిలో యువకుడి దారుణ హత్య

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే ఘాతుకం


వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్‌ఐ

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 20 : మండలంలోని నికరంపల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వెంకటేశ్వర్లు(32) వెంకటేశ్వర్లు తన భార్య తిరుపతమ్మతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మారంరెడ్డి కాశీరామిరెడ్డి అనే యువకుడు గొడ్డలితో విచక్షణారహితంగా ఒంటిపై దాడి చేసి హత్య చేశాడు. తిరుపతమ్మకు కాశీరామిరెడ్డితో వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో తమకు అడ్డుగా ఉన్నాడన్న నెపంతో వెంకటేశ్వర్లును కాశీరామిరెడ్డి హత్య చేసినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. వెంకటేశ్వర్లకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. నిందితుడు మారంరెడ్డి కాశీరామిరెడ్డి పరారీలో ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ బాల సుందరరావు, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటేశ్వర నాయక్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్ర గాయాలైన తిరుపతమ్మను మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు. మృతదేహాన్ని స్థానిక జిల్లా వైద్యశాలలో శవ పరీక్ష నిర్వహించి మృతుని బంధువులకు అప్పగించారు. వెంకటేశ్వర్లు తండ్రి వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ సదస్సు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 20: జవహర్ నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నివాసం వద్ద నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ సదస్సు బుధవారం ఉదయం 10గంటలకు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. సమావేశంలో ముఖ్య అతిథిలుగా శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, గుంటూరు ఇన్‌చార్జి నసీర్, మాజీ ఎమ్మెల్యే అత్తర్ చాంద్ బాషా హాజరవుతారని తెలిపారు.

మట్టి తోలకంపై ఫిర్యాదు

గిద్దలూరు, ఫిబ్రవరి 20 : తమ గ్రామపరిధిలో అక్రమంగా మట్టిని తవ్వుతున్నారని మున్సిపాలిటీ పరిధిలోని చట్రెడ్డిపల్లి గ్రామస్థులు స్థానిక తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. చెరువులో, ఇతరత్రా ఖాళీ స్థలాల్లో అక్రమార్కులు జేసీబీల సహాయంతో మట్టిని తవ్వి పెద్దపాటి గుంతలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు వినతిపత్రంలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మట్టి తవ్వితే జేసీబీలను, ట్రాక్టర్లను ధ్వంసం చేస్తామని, అంతవరకు తెచ్చుకోకుండా మట్టి తవ్వకాలను ఆపాలని గ్రామస్థులు అక్రమార్కులను హెచ్చరించారు.


వైసీపీని వీడి పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే కందుల

టీడీపీలో చేరిన 60 వైసీపీ కుటుంబాలు

కొనకనమిట్ల, ఫిబ్రవరి 20 : మండలంలోని గాజులపల్లి గ్రామంలో 60 కుటుంబాల వారు వైసీపీ వీడి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి కందల నారాయణరెడ్డి సమక్షంలో మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తమ ఓట్లను దండుకొన్న వైసీపీ నాయకులు అన్నివిధాలా మోసం చేశారని తెలిపారు. కందులతోనే వెలిగొండ ప్రాజెక్ట్, మార్కాపురం జిల్లా సాధ్యమన్నారు. నారాయణరెడ్డి నాయకత్వం నచ్చి పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారికి కందుల కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన వైస్ సర్పంచ్ బండారు వెంకటేశ్వర్లు, బత్తుల నారాయణ, బండారు రమణయ్య, వెంకట్రావ్, ఏడుకొండలు, పెద్ద ఆలు, వెంకటకొండయ్య, చినవెంకటయ్య, బత్తుల రామయ్య, బత్తుల మాలకొండరాయుడు, కొండలరావు, బండారు కాశయ్య, వెంకటరావు, రమణయ్య బత్తుల పెదమాలకొండయ్య, తిరుపాలు, బండారు శ్రీనివాసులు, శంకర్, తాళ్లూరి సాంబ, తుళ్లూరి శంకర్, దోసపాటి ఏడుకొండలు, రమణయ్య పార్టీలో చేరారు.

మహిళా సాధికారతే లక్ష్యం : ఎమ్మెల్యే రాంబాబు


ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాంబాబు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 20 : రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజార్‌లో ఆసరా నాలుగో విడత కార్యక్రమం వైకేపీ ఏపీఎం రమేష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు ఆయన చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పోరెడ్డి అరుణాచెంచిరెడ్డి, ఎంపీడీవో తోట చందన, మార్కెట్ యార్డు చైర్మన్ షంషీర్ అలీబేగ్, కార్పొరేషన్ డైరెక్టర్లు కొండయ్య, బద్రీనాథ్, సర్పంచులు, ఎంపీటీసీలు, సీసీలు, వీవోఏలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రేపు సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొమరోలు, ఫిబ్రవరి 20 : మండలంలోని గోపానిపల్లి శ్రీ త్రిపురాంతకేశ్వరాలయం దేవాలయంలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు రెండు రోజులపాటు జరగనున్నట్లు ఆలయ ధర్మకర్త వీరంరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొమరోలు-గోపానిపల్లి గ్రామాల మధ్యలో వెలసిన త్రిపురాంతకేశ్వరాలయంలోని నాగదేవతల కాంప్లెక్స్‌లో నూతనంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఈనెల 21, 22 తేదీల్లో కార్యాక్రమాలను ఆలయ పూజారి గౌరిపెద్ది హరిహరకుయార శర్మచే నిర్వహిస్తున్నారు. 21న ఉదయం గణపతి పూజతో ప్రారంభమై రక్షాబంధనం, మాతృకాపూజ, యంత్రాలకు జలాధివాస కార్యక్రమం, సాయంత్రం మృత్సంగ్రహణం, అగ్ని ప్రతిష్ఠ, దీక్షాహోమం, మూలయంత్ర హోమం, 22న గర్తపూజ, ప్రతిష్ఠ హోమాలు, ఉదయం 11.45 గంటలకు యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, బలిహరణ, గోదర్శనం పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

మాజీ సైనికుడికి నివాళి


నివాళులర్పిస్తున్న అశోక్‌రెడ్డి

రాచర్ల, ఫిబ్రవరి 20 : మండలంలోని పాలకవీడు పంచాయతీ పరిధిలో గల అనుమలవీడు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు పాలుగుళ్ల భాస్కర్‌రెడ్డి (65) మృతి చెందారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా మృతదేహాన్ని మంగళవారం అనుమలవీడుకు తీసుకువచ్చారు. మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ మండల యువనాయకులు అంబవరపు శ్రీనివాసరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాచర్ల, ఫిబ్రవరి 20 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార యంత్రాంగం ఆ దిశగా అడుగులు వేస్తున్నది. మండలంలో జెపుల్లలచెరువు, చినగానిపల్లె గ్రామాలలోని పోలింగ్ కేంద్రం 140, 141, 142లను మంగళవారం తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు పరిశీలించారు. అలాగే సెక్టార్ అధికారి షేక్ అబ్దుల్‌రఫిక్, సర్వేయర్ పఠాన్ సిలార్‌సాహెబ్ కూడా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

రాయవరంలో పట్టపగలు చోరీ

ఆరు తులాల ఆభరణాలు మాయం

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 20: మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీలో గల రైల్వే స్టేషన్ సమీపంలోని ఓడర్ బ్రిడ్జి పక్కన వీధిలో మంగళవారం పట్టపగలు చోరీ జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం భార్యాభర్తలు ప్రైవేట్ ఉద్యోగాల చేస్తుండడంతో ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. సాయంత్రం 6గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉంది. బీరువాలో ఉన్న సుమారు 3 తులాల 2 బంగారు గాజులు, 3 తులాల నల్లపూసల దండ చోరీకి గురైనట్లు తెలిపారు. రూరల్ పోలీసులకు సమాచారం తెలపగా, రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర నాయక్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. బాధితుడు కొమ్ము భూషణం ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

309 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 20: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య సురక్ష కింద 309 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించినట్లు చింతల వైద్యాధికారి యగ్నేష్ తెలిపారు. పిల్లల వైద్య నిపుణుడు ఖాదర్ రసూల్, లక్ష్మీకల్యాణి, కవిత రోగులను పరీక్షించారు. ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఈవో మోహన్‌రావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

‘చలో అనంతపురం’ను జయప్రదం చేయండి


పొదిలిలో మాట్లాడుతున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, గిద్దలూరులో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, మాట్లాడుతున్న సయ్యద్‌సాధిక్

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు

పొదిలి, ఫిబ్రవరి 20 : ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడికి నిరసనగా ఈనెల 22న తలపెట్టిన చలో అనంతపురం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు పిలుపునిచ్చారు. మంగళవారం పొదిలి పట్టణంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మీడియా స్వేచ్ఛను కాపాడేందుకు ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక సంఘాలు నిరసన కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలపడం శుభపరిణామమన్నారు. దాడి అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 70 కేంద్రాల్లో వేలాది మంది జర్నలిస్టులు నిరసనలు తెలుపుతున్నారన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జరిగిన తప్పులకు చింతిస్తూ దాడిని ఖండించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు మరోసారి పునరావృతం కాకుండా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలని కోరారు. రాప్తాడులో దాడి జరిగిన సమయంలో అక్కడే ఉన్న ప్రత్యక్షసాక్షి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నుంచి దాడి వివరాలను తీసుకొని నిందితులపై వెంటనే హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డీజీపీని ఏపీయూడబ్ల్యూజే తరఫున డిమాండ్ చేశారు. నేటికీ బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం పోలీస్ వ్యవస్థకే మచ్చగా మిగులుతుందని ఐవీ పేర్కొన్నారు. సీఎం వైసీపీ అల్లరిమూకలను, రౌడినాయకులను ప్రోత్సహించకుండా అదుపులో పెట్టుకోవాలన్నారు. చలో అనంతపురం కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం, ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల నుంచి జర్నలిస్టులు తరలిరానున్నరన్నారు. ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక సంఘాలు, పౌరహక్కుల సంఘాలతోపాటు ప్రజాస్వామిక వాదులంతా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం, పోలీసులు స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సుబ్బారావు స్పష్టం చేశారు. సమావేశంలో పొదిలి జర్నలిస్టులు పీ వేణు, నర్రా వెంకటేశ్వరరెడ్డి, మదార్‌వలి, బానుచందర్, ఓ రాధాకృష్ణ, అహమ్మద్, రమణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శివాజి, కొండయ్య, పిచ్చయ్య, బాజీ, రామారావు, సుబ్బారావు, మందగిరి, ప్రశాంత్, రాయల్, అశోక్, శ్రీనివాసులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

గిద్దలూరులో నిరసన

గిద్దలూరు టౌన్ : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం అమానుషమని, ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమేనని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహం ముందు భారతీయ జనతాపార్టీ, స్థానిక విలేకరుల ఆధ్వర్యంలో రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐవీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో విలేకరులపై దాడులు పెరుగుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమంలో వైసీపీ నాయకులు దాడి చేయడం, పోలీసులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షుడు భవనాశి వెంకటరామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌వలి, జనరల్ సెక్రటరీ మునగనూరి రామక్రిష్ణ, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఎం.రమణ, పలువురు విలేకరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి

ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై జరిగిన దాడికి ముఖ్యమంత్రి, అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు బాధ్యత వహించాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి షేక్ సైదా మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈదాడిని కాంగ్రెస్‌పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వృత్తిలో భాగంగా కవరేజికి వెళ్లిన ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయమైన చర్య అన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. ఈఘటనపై ముఖ్యమంత్రి, హోంమంత్రి వెంటనే స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

దాడి చేసి వారిని శిక్షించాలి

మార్కాపురం వన్‌టౌన్ : ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్ శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ మూకలపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాధిక్ డిమాండ్ చేశారు. ఇటీవల జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తుండడం దురదృష్టకరమన్నారు. హుస్సేన్, రమేష్, పాపయ్య దాడిని ఖండించారు.

చింతగుంట్లలో టీడీపీ ఇంటింటి ప్రచారం


బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విష్ణుష్‌రెడ్డి

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 20 : మండలంలోని చింతగుంట్ల గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆయన కుమారుడు కందుల విష్ణుష్ రెడ్డి, టీడీపీ నాయకులతో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వారు తిరుగుతూ చంద్రబాబు అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేలా పథకాలను రూపొందిచినట్లు చెప్పారు. రాష్ట్రం బాగు కోసం టీడీపీకి పట్టంగట్టాలని, అవినీతి, అరాచక పాలన సాగిస్తున్న జగన్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జవాజి రామానుజులరెడ్డి, చింతగుంట్ల టీడీపీ నాయకులు అబ్రహం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని రథోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 20: గుండ్లకమ్మ నదీ తీరాన వెలసిన లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దేవదేవునికి మంగళవారం రాత్రి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులను ప్రధానార్చకులు ఏవీకే నరసింహాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక అలంకరణలు నిర్వహించి రథంపై వేంచేపు చేశారు. అనంతరం గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు మాలకొండ నరసింహారావు, ఆదినారాయణ రావు, కమిటీ ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంపై నేతల దిగ్భ్రాంతి

మృతులకు నివాళి


బంధువులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, ఫిబ్రవరి 20 : పూసలపాడు సమీపంలో మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడంపై మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి, వైసీపీ ఇన్‌చార్జి కుందురు నాగార్జునరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారు వేర్వేరుగా కంభం వైద్య శాలకు వచ్చి మృతదేహాలకు నివాళులర్పించారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు మృతి చెందడం బాధాకరమన్నారు. కంభం వైద్యశాలలో పోస్టుమార్టంలోని మృతదేహాలను సందర్శించి వారి కటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కుక్కల స్వైరవిహారం

రాచర్ల, ఫిబ్రవరి 20 : మండలంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రతి గ్రామంలో గుంపులుగా కుక్కలు ఉండడంతో ప్రజలు, వాహనదారులు ఎప్పుడు దాడి చేస్తాయోనని హడలెత్తుతున్నారు. రాచర్ల, రాచర్ల ఫారంలో చిట్టెం నాగరాజును కుక్కలు చుట్టుముట్టగా ఓ కుక్క చేతిని కొరికి గాయపరిచింది. పంచాయతీ అధికారులు కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అందరికీ సమన్యాయం


మాట్లాడుతున్న యూసుఫ్

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 20: అందరికీ సమ న్యాయం కోసం సుప్రీం కోర్టు ఉచిత న్యాయ సేవా సహాయ పథకాన్ని ప్రవేశపెట్టిందని సీనియర్ న్యాయవాది షేక్ యూసుఫ్ అలీ అన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సంద్భంగా డ్రైవర్స్ కాలనీలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. అలీ మాట్లాడుతూ సమాజంలో ధనికులతో పాటు పేదలకు కూడా వివక్ష లేని న్యాయం అందుబాటులో ఉండాలని ఈ పథకాన్ని తెచ్చారన్నారు. పేదలు, వృద్ధులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీలు, ప్రకృతి వనరులతో దెబ్బతిన్నవారు, వితంతువులు, దివ్యాంగులు ఈ పథకం కింద ఉచిత న్యాయ సాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే

గిద్దలూరు టౌన్ : చట్టం దృష్టిలో అందరూ సమానమేనని స్థానిక ప్యానల్ న్యాయవాదుల ఎస్.పిచ్చయ్యయాదవ్, షేక్ ఫాజిల్ అన్నారు. పట్టణంలోని విశ్వభారతి పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్యానల్ న్యాయవాదులు మాట్లాడుతూ చట్టం దృష్టిలో ధనిక, పేద అనే తేడా లేదని తెలిపారు. న్యాయవాదిని నియమించుకోలేని, ఆర్థిక స్థోమతలేని వారికి ఉచితంగా న్యాయవాదిని నియమించి న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జనార్దన్, స్కూల్ ఇన్‌చార్జి అంబేడ్కర్, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యకు పరిష్కారం

తర్లుపాడు, ఫిబ్రవరి 20: తర్లుపాడు కోటవీధిలో 20 రోజుల నుంచి నెలకొన్న మంచినీటి సమస్యను ఎట్టకేలకు అధికారులు పరిష్కరించారు. కోటవీధిలో ఉన్న డీప్ బోరు మరమ్మతులకు గురికావడంతో మంచినీటి సమస్య ఏర్పడింది. దీంతో గత 20 రోజుల నుంచి ప్రజలు నీటికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి కోటవీధిలో కొత్త మోటార్‌ను బిగించడంతో సమస్య పరిష్కారం అయింది. దీంతో కోటవీధిలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పల్లెపోగు వరాలు, పంచాయతీ కార్యదర్శి అచ్యుత్‌రావు, కాళంగి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యం



పత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ మనోహర్

పామూరు, ఫిబ్రవరి 20 : ఒక్కఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విఫలమైందని, రాష్ట్ర భవిష్యత్తు తిరిగి గాడిలో పడాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఉగ్ర ఆదేశాల మేరకు స్థానిక సీఎస్‌పురం రోడ్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు కు గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల తాలూకు కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కమిటీ సభ్యులు, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, ఆర్‌ఆర్ రఫి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు, ఉప్పలపాటి హరిబాబు, షేక్ గౌస్‌బాష, ఇర్రి కోటిరెడ్డి, పులి నాయభా, దేవరపు మాల్యాద్రి, కౌలూరి రహంతుల్లా, పత్తు మస్తాన్, మాచర్ల రహిమాన్, పోకా వినోద్, ఎం రమణయ్య, గుత్తి మహేష్, నాయభా, కావేరి రసూల్ పాల్గొన్నారు.

నంద్యాల శనగతో అధిక దిగుబడి



శనగ పంట క్షేత్రం గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త ప్రసాద్

పామూరు, ఫిబ్రవరి 20 : నంద్యాల శనగ -452 రకం నూతన వంగడంతో పంట సాగు చేసిన రైతులకు అధిక దిగుబడి సాధించారని కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్ బాబు చెప్పారు. మండలంలోని దూబగుంట గ్రామంలో నంద్యాల శనగ - 452 రకంపై క్షేత్ర దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ సమన్వయకర్త అంజనేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు



రమణయ్యతో మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు వెంకటేశ్వరరెడ్డి

పామూరు, ఫిబ్రవరి 20 : దేశ ప్రజలందరికీ కాంగ్రెస్ పార్టీతోనే మేలు జరుగుతుందని పీసీసీ సభ్యులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. మండలంలోని సట్టుమడుగు గ్రామానికి చెందిన రియల్టర్ గంటా రమణయ్యను మంగళవారం కలిసి కాంగ్రెస్‌పార్టీలో చేరాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమణయ్యతో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శ్యావలామౌలాలి, సలాం సుభానిబాష, సోషల్ మీడియా చైర్మన్ సయ్యద్ పాశ్చాహుసేన్ పాల్గొన్నారు.

పామూరు ఎంపీడీవోగా పుట్టారెడ్డి బాధ్యతల స్వీకరణ

పామూరు, ఫిబ్రవరి 20 : పామూరు మండల పరిషత్ కార్యాలయ నూతన ఎంపీడీవోగా పుట్టారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పలనాడు జిల్లా ముప్పాళ్ల మండల ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన బదిలీపై పామూరు వచ్చారు.

పీసీపల్లిలో డయాలసిస్ సెంటరును ఏర్పాటుచేయాలి

పీసీపల్లి, ఫిబ్రవరి 20 : పీసీపల్లిలో డ యాలసిస్ సెం టరును ఏర్పా టు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు దగ్గుమాటి బలరామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనిగిరి డయాలసిస్ సెంటరుకు మంగళవారం వెళ్లిన ఆయన అక్కడ పీసీపల్లి మండలానికి చెందిన కిడ్నీవ్యాధిగ్రస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీసీపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పీసీపల్లి మండలంలో మూత్రపిండాల వ్యాధికి గురవుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. నాటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి పీసీపల్లికి వచ్చినప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే పీసీపల్లిలో డయాలసిస్ సెంటరును ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటికొండ వెంకటేశ్వర్లు ఉన్నారు.

సామాజిక న్యాయాన్ని పరిరక్షించాలి

మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి, ఫిబ్రవరి 20 : సామాజిక న్యాయ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ చెప్పారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక కేసీ కళాశాలలో విద్యార్థులకు న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాశం పిచ్చయ్య మాట్లాడుతూ శాంతి, భద్రత, శ్రేయస్సు కోసం సామాజిక న్యాయం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీసీసీ జిల్లా సభ్యులు కైలాస్ సత్యార్థి, చిల్డ్రన్స్ ఫౌండేషన్, సార్డ్ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, గుడ్ హెల్ప్ రమేష్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా బీమా పథకాలను వినియోగించుకోవాలి



పథకాల గురించి ప్రచారం చేస్తున్న పోస్టల్ సిబ్బంది

పామూరు, ఫిబ్రవరి 20 : తపాలాశాఖ బీమా పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని సబ్ పోస్టుమాస్టర్ ఖాసీంవలి కోరారు. పట్టణంలో పోస్టల్ ఇన్సూరెన్స్‌పై ప్రత్యేక మేళా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కేవలం రూ.520 ప్రీమియం చెల్లించి ఏడాది పాటు బీమా పొందవచ్చునని తెలిపారు. ప్రమాదంలో వ్యక్తి మరణిస్తే గరిష్ట బీమా రూ.10లక్షలు, పూర్తి వైకల్యం, పాముకాటు, విద్యుత్‌షాక్, తో మృతి చెందితే 10 లక్షల పరిహారం అందుతుందని, పథకంలోని లబ్ధిదారులు మరణిస్తే పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు ఒక లక్ష రుపాయాలు అందజేస్తామని చెప్పారు. కనిగిరి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దినకర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రజ్వల, ఎంఓఎం, రామారావు, జీ ప్రతాప్ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక ఆధార్‌సేవలు

పామూరు, ఫిబ్రవరి 20 : మండలంలోని వగ్గంపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో పుట్టారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 22న గురువారం, పడమటకట్టకిందపల్లి, 23న, శుక్రవారం రావిగుంటపల్లి గ్రామాసచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలు ఆధార్ కేంద్రాలను ఉపయోగించుకోవాలని తెలిపారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఓటింగ్ యంత్రాలను భద్రపరిచే గోడౌన్‌ను మంగళవారం కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలను, వీవీప్యాడ్‌ను భద్రపర్చిన గోడౌన్ సీల్‌ను తనిఖీ చేసి సంబంధిత రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్ వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చర్యలు సున్నా...!

ఏళ్ల తరబడి క్రమబద్ధీకరణకు నోచుకోని జీరో ఖాతాల భూములు

కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు

దర్శి, ఫిబ్రవరి 20 : రైతులకు హక్కు కల్గిన పట్టాభూములు అధికారుల తప్పిదం వలన జీరో ఖాతాల్లో పడ్డాయి. ఈ భూములను క్రమబద్ధీకరించుకునేందుకు వారు నానాపాట్లు పడుతున్నారు. ఏళ్ల తరబడి అన్నదాతలు తమ భూములకు హక్కు కల్పించాలని తిరుగుతున్నా పనులు జరగటం లేదు. ఐదేళ్లుగా రైతులు పడిగాపులు కాస్తూనే ఉన్నారు.



దర్శి తహసీల్దార్ కార్యాలయం

మండలంలో సుమారు 4400లకు పైగా జీరో ఖాతాల్లో ఐదు వేల ఎకరాల భూమి నమోదైంది. పాత రికార్డుల ప్రకారం ఆ భూమిపై రైతులకు సర్వహక్కులు ఉన్నప్పటికీ అధికారుల తప్పిదం వలన జీరో ఖాతాల్లో నమోదయ్యాయి. అందువలన ఆన్‌లైన్‌లో కనిపించటం లేదు. రైతులు వ్యవసాయ రుణాలు తీసుకునేందుకు వీలులేకుండా పోయింది. అవసరాలకు విక్రయించుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో తమకు హక్కు కల్గిన భూమి ఎందుకు ఉపయోగపడకుండా పోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. రెవెన్యూ అధికారులు మండలంలో మొత్తం 4406 జీరో ఖాతాల్లో భూములు నమోదైనట్లు లెక్కతేల్చారు. ఆ భూములను క్రమబద్ధీకరించాలని ప్రతిపాదిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. సుమారు మూడేళ్ల క్రితం నివేదిక జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు వెళ్లినప్పటికీ పని జరగలేదు. ఉన్నతాధికారులు ఆ ఫైలు పక్కన పడేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇప్పట్లో జీరో ఖాతాల్లో చేరిన భూములు క్రమబద్ధీకరణకు అవకాశం లేదని రైతులు ఆందోళనలు చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ రికార్డులు గోల్‌మాల్ అవుతున్నాయి. ఏ భూమి ఏ రికార్డుల్లోకి మారుతుందో అర్థంకాని పరిస్థితి. గతంలో పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకొని సంపూర్ణ హక్కులతో అనుభవిస్తున్న భూములను రెవెన్యూ అధికారులు అకారణంగా జీరో ఖాతాల్లో నమోదు చేసినందున రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా కొందరు అధికారులు పట్టాభూములను జీరో ఖాతాల్లో నమోదు చేశారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రికార్డులు క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మీడియాపై దాడి చేసిన దోషులను శిక్షించాలి



రాస్తారోకో చేస్తున్న టీడీపీ శ్రేణులు

పామూరు, ఫిబ్రవరి 20 : వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగ వ్యవస్థలతోపాటు మీడియాకు చెందిన వ్యక్తులపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని, దాడులకు తెగబడిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని టీడీపీ మండలఅధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రాప్తాడులో సోమవారం జరిగిన సీఎం సభలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ శ్రీకృష్ణపై వైసీపీ మద్దతుదారులు కెమెరాను ధ్వంసం చేయడమే కాకుండా అతనిపై భౌతిక దాడులకు తెగబడటం ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాగా టీడీపీ తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసులరెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని ఖండించారు. ముందుగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, వై ప్రసాద్‌రెడ్డి, ఆర్‌ఆర్ రఫి, టీడీపీ పట్టణ కమిటీ ఎలక్షన్ కమిటీ చైర్మన్ డీవీ మనోహర్, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి హరిబాబు, షేక్ గౌస్‌బాష, ఇర్రి కోటిరెడ్డి, ముబినామౌలాలి, డోలా శేషాద్రి, మన్నం రమణయ్య, పులి నాయభా, పువ్వాడి వెంకట్‌చౌదరి పాల్గొన్నారు.

వైసీపీ నేతలు దొంగ ఓట్లు చేరుస్తున్నారు!

ఎమ్మెల్యే స్వామి విమర్శ

అప్రమత్తంగా ఉండాలని టీడీపీ శ్రేణులకు సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, ఫిబ్రవరి 21 : నియోజకవర్గంలో వైసీపీ నాయకులు బరితెగించి దొంగ ఓట్లను చేరుస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆరోపించారు. కొత్త ఓట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని టీడీపీ శ్రేణులకు సూచించారు. నూతనంగా ప్రారంభించిన స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే స్వామి, పార్టీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో స్వామి పాల్గొని మాట్లాడారు. అధికారపార్టీ నేతలు ఓటమి భయంతో పక్క నియోజకవర్గాల ఓట్లను కొండపి సెగ్మెంట్‌లో చేరుస్తున్నారని మండిపడ్డారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు రాష్ట్రంలో, ఇటు నియోజకవర్గంలో టీడీపీ విజయం ఖాయమైందని తేలిపోయాక దొడ్డిదారులను వెతుకుతున్నారని ధ్వజమెత్తారు. అందులోభాగంగానే నియోజవర్గ ఈఆర్వోలుగా నెలవ్యవధిలో ముగ్గురుని, వారం రోజుల్లో సింగరాయకొండ తహసీల్దార్లు ముగ్గురిని మార్చారని తెలిపారు. ఇదంతా మంత్రి సురేష్ ప్రోద్బలంతోనే జరుగుతున్నదని విమర్శించారు. సింగరాయకొండలో అధిక భాగం దొంగ ఓట్లను చేరుస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి తప్పులు చేస్తే అధికారులు తగినమూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. దొంగ ఓట్ల విషయమై టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సందానీబాషా, మించల బ్రహ్మయ్య, గాంధీచౌదరి, రామారావు, కూనపరెడ్డి సుబ్బారావు, సన్నెబోయిన శ్రీనివాసులు, వేల్పుల వెంకట్రావు, నర్రా రాంబాబు, గౌస్, యస్థాని, నరసింహ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- - ఏకేయూ వీసీ
- ఉత్సాహంగా పెడగాజి గేమ్స్ మీట్



విజేతలకు కప్‌లు అందజేస్తున్న వీసీ అంజిరెడ్డి

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 20: క్రీడలతో మానసికోల్లాసం, ఆరోగ్యం లభిస్తాయని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎం.అంజిరెడ్డి పేర్కొన్నారు. పెడగాజి గేమ్స్ మీట్ -2024 మంగళవారం ఒంగోలులోని ఏకేయూలో జరిగింది. ఈ కార్యక్రమానికి వీసీ అంజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. తాను వీసీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రెండోసారి ఈ స్థాయి క్రీడాపోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అంతేగాకుండా ప్రకాశం జిల్లాను స్పోర్ట్స్ బ్రాండ్‌గా తీర్చిదిద్దేందుకు యూనివర్సిటీ పరంగా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరో మూడునెలల్లో యూనివర్సిటీ ప్రాంగణం పేర్నమిట్ట వద్ద ఉన్న యూనివర్సిటీ భవనంలోకి మారనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ఏకేయూ పేర్నమిట్ట క్యాంపస్‌లో యూనివర్సిటీ పరిధిలోని 224 కళాశాలల విద్యార్థులతో మెగా టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించిన వీసీ ఆయా క్రీడాజట్లను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్‌దేవీవరప్రసాద్, కేవీఎన్.రాజు, ప్రొఫెసర్ హరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ కె.నిర్మల, రిమ్స్ వైద్యులు పి.సుధీర్, సీహెచ్. హేమశిల్ప తదితరులు పాల్గొన్నారు. కాగా పలు పాఠశాలల విద్యార్థులు వాలీబాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

జర్నలిస్టులపై దాడులు దుర్మార్గం



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20 : అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం బహిరంగసభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరి మూకలు దాడి చేయడాన్ని జనసేన పార్టీ ప్రచార కో ఆర్డినేటర్ జడా బాలనాగేంద్ర యాదవ్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెం ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమాజంలో అందరికి అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటూ పనిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ కవరేజ్ కోసం వెళ్ళిన శ్రీకృష్ణపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు మొగల్ కాలేషా బేగ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం సభ కవరేజ్ కోసం వెళ్ళిన శ్రీకృష్ణపై వైసీపీ రౌడీ మూకలు దారుణంగా దాడి చేసి కొట్టడం దుర్మార్గంగా ఉందని, ఈ ఘటనకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దారుణం

చీమకుర్తి, ఫిబ్రవరి 20: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిపై కఠినచర్యలు చేపట్టాలని సంతనూతలపాడు నియోజకవర్గంలోని జర్నలిస్టులు మంగళవారం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై పాశవికదాడిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు చేస్తుంటే జర్నలిస్టులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

టంగుటూరులో...

టంగుటూరు, ఫిబ్రవరి 20 : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. ఇది దుర్మార్గమన్నారు. స్వయానా ముఖ్యమంత్రి సమక్షంలోనే ఇంతటి దారుణం జరగడాన్ని చూస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పాతరేసినట్లే అనిపిస్తున్నదన్నారు. వైసీపీ మూకలు దాడి చేసినట్లు ఫొటో వీడియోల ద్వారా స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ ఇంత వరకూ వారిని అరెస్టు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తున్నదన్నారు. దాడిని ఖండించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు బొడ్డు సతీష్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బక్కా తిరుమలరావు మాదిగ, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు కసుకుర్తి శ్రీధర్, సీపీఐ మండల కార్యదర్శి టి.ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు శాంతపాల్ ఉన్నారు.

ఓటర్లకు సౌకర్యవంతంగా పోలింగ్ కేంద్రాలు



మారెళ్లలో తహసీల్దార్ మధుబాబు

ముండ్లమూరు, ఫిబ్రవరి 20 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందని తహసీల్దార్ జే మధుబాబు చెప్పారు. ఆయన మంగళవారం మండలంలోని పోలవరం, శంకరాపురం, తూర్పుకంభంపాడు, నూజెండ్లపల్లి, మారెళ్ల, ఈదర, జమ్మలమడకలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో జాన్‌లిపి, బీ గురవయ్య, పున్నారావు, నాగదర్ మస్తాన్, వేణుగోపాలరెడ్డి, బీఎల్‌వోలు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీఐ



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సీఐ సమీఉల్లా

ముండ్లమూరు, ఫిబ్రవరి 20 : గతంలో ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలు జరిగిన గ్రామాలను దర్శి సీఐ షేక్ షమీ ఉల్లా మంగళవారం సందర్శించారు. తీవ్ర సమస్యాత్మక గ్రామాలైన పోలవరం, శంకరాపురం, మారెళ్ల, ఈదర, తూర్పుకంభంపాడు గ్రామాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా మరమ్మతులు ఉన్నట్లయితే వెంటనే పనులు చేయించాలని సంబంధిత ప్రధానోపాధ్యాయులను, బీఎల్‌వోలను ఆదేశించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే వ్యక్తులను గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఎస్‌ఐ వెంకట కృష్ణయ్యను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, బీఎల్‌వోలు ఉన్నారు.

ఖనిజ లవణాల లోపాలను అధిగమించాలి

దర్శి కేవీకే విజ్ఞాన కేంద్ర పశు విభాగ శాస్త్రవేత్త లీలాకృష్ణ

కనిగిరి, ఫిబ్రవరి 20 : పశువుల్లో ఏర్పడే ఖనిజ లవణాల లోపాలను గుర్తించి సమస్యలను అధిగమించాలని దర్శి కేవీకే విజ్ఞాన కేంద్ర పశువిభాగ శాస్త్రవేత్త ఎన్ లీలాకృష్ణ చెప్పారు. మండలంలోని చాకిరాల గ్రామంలో పాడి రైతులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులలో వచ్చే ఖనిజ లవణాలను అధిగమించాలంటే ప్రతి పశువుకు 50 నుంచి 80 గ్రాముల చొప్పున ఖనిజ లవణాలు ఉన్న మిశ్రమాన్ని దాణాతో గేదెలకు అదించాలన్నారు. తద్వారా పాలల్లో అధిక దిగుబడి పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎలీషా, పాడి రైతులు మహిళలు పాల్గొన్నారు.

మర్రెడ్డిపై దాడిచేసిన దోషులను శిక్షించాలి

పామూరు, ఫిబ్రవరి 20 : టీడీపీ తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసులరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో ప్రతిపక్షపార్టీ నాయకులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను శిక్షించాలని కోరారు.

నేడు నూతన మసీదు ప్రారంభం

పామూరు, ఫిబ్రవరి 20 : పట్టణంలోని విరువూరు రోడ్ సెంట్రింగ్ బుజ్జి బాయ్ రంప కోతమిల్లు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఆయోషా మసీదును బుధవారం ప్రారంభిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు షేక్ అబ్దుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. మసీదు ప్రారంభోత్సవానికి నెల్లూరు నుంచి జనాబ్ అబ్దుల్ వహాబ్, కనిగిరి ఏఎంసి వైస్ చైర్మన్ షేక్ చాంద్‌బాషతో పాటు పట్టణ పుర ప్రముఖులు పాల్గొంటారని వివరించారు.

నేడు దద్దాల ఆత్మీయ సభ

పామూరు, ఫిబ్రవరి 20 : కనిగిరిలోని పవిత్ర ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరగనున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ పరిచయ కార్యాక్రమాన్ని వైసీపీ శ్రేణులు విజయవంతం చేయాలని జిల్లా నాయకులు కల్లూరి రామిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు,



ఆళ్లతో.. జగన్ కాళ్ల బేరం



- ఇద్దరు ఎంపీలతో రాయబారం
- ఓటమి భయంతో సీఎం తత్తరపాటు
- నిన్న పనికిరాలేదు.. నేడు ఆయనే దిక్కని పిలుపు
- వైఎస్ షర్మిలతో ఆళ్ల చెలిమి మూణ్ణాళ్ల ముచ్చటే
- రామకృష్ణారెడ్డి రీ ఎంట్రీతో గంజికి చెక్ పెట్టినట్టేనా..

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఓటమి భయం వెంటాడుతుండటంతో ముఖ్యమంత్రి జగన్ అభ్యర్థుల ఎంపికలో తత్తర పాటుకు గురవుతున్నారు. సిట్టింగ్‌లను తారు మారు చేయటమో లేక తీసివేయటమో చేస్తే గెలుపు సాధ్యమవుతుందనే దింపుడు కల్లం ఆశతో వెనుకడుగులు వేస్తున్నారు. మంగళగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి తిరిగి సీటిస్తే గెలిచే అవకాశాల్లేవని తన సర్వేల ద్వారా తెలుసుకున్న జగన్ మంగళగిరికి గంజి చిరంజీవిని ఇన్‌చార్జిగా నియమించడం ద్వారా ఆళ్లకు పొగబెట్టారు. చిరంజీవి నియామకం రోజే ఆళ్ల ఎమ్మెల్యే పదవికి, వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి షర్మిలతో పాటు కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఇకపై ఆమె వెంటే ఉంటానని కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశిస్తే మంగళగిరి నుంచైనా ఆ పార్టీ తరఫున పోటీ చేసేందుకు సిద్ధమని ఆళ్ల ప్రకటించారు. దీంతో తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు పుట్టింది. మంగళగిరి నుంచి ఆళ్ల కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగితే ఆ నియోజకవర్గంలో వైసీపీ ఘోర పరాజయం ఖాయమని భావించారు. ఎలాగైనా టీడీపీ యువనేత లోకేశ్‌ను ఓడించాలని ఆశతో ఉన్న సీఎం జగన్ ఆళ్ల విషయంలో రాజీపడుతూ కాళ్ల బేరానికి దిగారు. ఎలాగైనా ఆళ్లను ఒప్పించి తిరిగి వైసీపీలోకి తీసుకొచ్చేందుకు ఇద్దరు ఎంపీలను రంగంలోకి దించారు. వారిలో ఒకరు స్వయానా ఆళ్ల సోదరుడు అయోధ్య రామిరెడ్డి కాగా రెండో ఎంపీ విజయసాయిరెడ్డి వీరిద్దరు కొద్ది రోజులుగా ఆళ్లను తరచుగా కలుస్తూ తిరిగి వైసీపీలో చేరాల్సిందిగా బతిమిలాడ టం జరిగింది. ఆళ్ల కాంగ్రెస్‌లో చేరటం మూలంగా అన్న అయోధ్య రామిరెడ్డికి కూడా రాజకీయంగానే కాకుండా వ్యాపార వ్యవహారాల రీత్యా కూడా ఇబ్బందులు ఎదురవుతాయని భావించారు. దీంతో ఆయన కూడా ఆళ్లపై ఒత్తిడి పెంచారు. ఎంపీ విజయసాయిరెడ్డి కూడా ఇప్పటికే రెండు, మూడు సార్లు ఆళ్లను కలుసుకుని ఫోన్‌లో సీఎం జగన్‌తో మాట్లాడించినట్లు సమాచారం. ఎట్టకేలకు ఆయన్ను ఒప్పించి మంగళవారం సీఎంవోకు తోడ్కొని వెళ్లి జగన్‌తో కలిపారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆళ్లను రప్పించి చిరంజీవి ని ఇన్‌చార్జిగా నియమించటం తప్పేనని జగన్ ఒప్పుకున్నట్లు తెలిసింది. జగన్ సారీ చెప్పడంతో తిరిగి వైసీపీలో చేరేందుకు ఆళ్ల అంగీకరించారని తెలిసింది. వాస్తవానికి ఆళ్లకు బదులుగా నియమించిన చిరంజీవికి గెలుపు అవకాశాలు లేవని అధిష్ఠానం గ్రహించినట్లు సమాచారం. పైగా అందరినీ కలుపుకొని వెళడంలో కూడా చిరంజీవి విఫలమయ్యారని భావించటంతో తిరిగి ఆళ్లను దగ్గరకు తీసుకున్నారు. అయితే తిరిగి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి రామకృష్ణారెడ్డిని దించుతారో లేదనేది మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. కాగా ఆళ్లకే తిరిగి సీటు ఇస్తామని సీఎం హామీ ఇవ్వడం మూలంగానే వైసీపీలో చేరినట్లు ఆయన అనుయాయులు చెబుతున్నారు.



పన్ను వసూలు 35.80 శాతమే..



పన్ను వసూలుపై పర్యవేక్షణ కొరవడింది. లక్ష్యాల మేర పన్ను వసూలు జరగటం లేదు. వినుకొండ, అద్దంకి, దాచేపల్లి, మంగళగిరి, తాడేపల్లి మునిసిపాల్టీలు వసూలులో ముందుండగా చిలకలూరిపేట పురపాలక సంఘం చతికిలపడింది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపి వేస్తున్నారు. ప్రణాళికా విభాగం పర్యవేక్షణ లేకపోవటం వలనే ఈ ఆదాయాన్ని మునిసిపాలిటీలు రాబట్టుకోలేక పోతున్నాయి. మార్చి 31 నాటికిపురాల్లో మునిసిపాలిటీలు ఏ మేరకు పన్ను వసూలు చేస్తాయో చూడాలి.

- 40 రోజులు.. రూ 319 కోట్లు..
- పురాల్లో పన్ను వసూలు సాధ్యమేనా ?
- వసూళ్లపై ఎన్నికల ప్రభావం
- గత ఏడాది కంటే తగ్గిన వసూళ్లు
- బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం
- పన్ను వసూలు లక్ష్యం రూ.496.95 కోట్లు
- వసూలైన పన్ను రూ.177.92 కోట్లు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆదాయ వనరులను పెంపొందించుకోవటంలో మునిసిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఆస్తి, నీటిపన్ను బకాయిలు పేరుకుపోయాయి. ప్రకటనలు, తాత్కాలిక ఆక్రమణల పన్నులను భారీగా కోల్పోతున్నాయి. పన్ను వసూలుపై పర్యవేక్షణ కొరవడింది. లక్ష్యాల మేర పన్ను వసూలు జరగటం లేదు. ఆయా విభాగాల సిబ్బంది అలసత్వాన్ని ప్రదర్శిస్తుండటంతో పన్నుల వసూలు నత్తనడకన సాగుతోంది. ఆస్తి, నీటి పన్నులు పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో రూ.496.95 కోట్లు వసూలు చేయాలి. ఇప్పటి వరకు రూ.177.92 కోట్లు వసూలైంది. 35.80 శాతం మాత్రమే ఇప్పటికి పన్నులు వసూలు చేశారు. గత ఏడాది కంటే వసూలు గణనీయంగా తగ్గింది. ఎన్నికల ప్రభావం పన్ను వసూలుపై పడిందని అంచనా వేస్తున్నారు. వినుకొండ, అద్దంకి, దాచేపల్లి, మంగళగిరి, తాడేపల్లి మునిసిపాల్టీలు వసూలులో ముందుండగా చిలకలూరిపేట పురపాలక సంఘం చతికిలపడింది.

నీటిపన్ను వసూలు నామమాత్రం..

గుంటూరు కార్పొరేషన్ సహా మూడు జిల్లాల్లోని అన్ని మునిసిపాలిటీల్లో ఆస్తిపన్ను రూ. 408.42 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.160.25 కోట్లు వసూలైనట్లు డీఎంఏ కార్యాలయాల లెక్కలు తెలియజేస్తున్నాయి. వసూలు 29.23 శాతంగా ఉంది. నీటిపన్ను వసూలు నామమాత్రంగా ఉంది. తాగునీటి పన్ను రూ.88.53 కోట్లు వసూలు చేయాలి. ఇప్పటికి రూ.17.67 కోట్లు మాత్రమే పన్ను వసూలు చేయగలిగారు. నీటిపన్ను వసూలు 19.95 శాతంగా ఉంది. ట్రేడ్ లైసెన్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఇతర అద్దెలు, వ్యాపార ప్రకటనలు తదితర ఆదాయం గణనీయంగా తగ్గింది. ఉన్నతాధికారులు ఏరోజుకారోజు పన్ను వసూలుపై సమీక్షిస్తున్నా మునిసిపాలిటీల్లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. దీని వల్లే పన్ను వసూలులో జాప్యం జరుగుతోంది. గుంటూరు కార్పొరేషన్‌లో దాదాపు రూ.15 కోట్లు ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకుపోయాయి. సత్తెనపల్లి పురపాలక సంఘంలో ఎఫ్‌సీఐ రూ.3.13 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అన్ని పురపాలక సంఘాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకుపోయాయి.

ప్రణాళికా విభాగం పర్యవేక్షణ కరువు..

అభివృద్ధి పనుల నిర్వహణ, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల చెల్లింపులు పురపాలక సంఘాల్లో జాప్యం జరుగుతోంది. సకాలంలో పన్ను వసూలు కాకపోవటం వలనే ఈ పరిస్థితి నెలకొంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపి వేస్తున్నారు. ప్రకటనల పన్ను వసూలు కూడా అలస్యమవుతోంది. పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రకటనల బోర్డులకు, పన్ను వసూలుకు పొంతన లేదు. ప్రకటన పన్ను భారీగా పక్కదారి పడుతోంది. దీనిలో అధికారపార్టీ నేతలు పన్ను ఎగవేస్తున్నారు. తాత్కాలిక ఆక్రమణలు పన్ను వసూలు చేయడంలో సంబంధితులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రకటనలు, తాత్కాలిక ఆక్రమణల పన్నుల ఆదాయాన్ని పెంచుకోవటంలో మునిసిపల్ అధికారులు విఫలమవుతున్నారు. ప్రణాళికా విభాగం పర్యవేక్షణ లేకపోవటం వలనే ఈ ఆదాయాన్ని మునిసిపాలిటీలు రాబట్టుకోలేక పోతున్నాయి. పన్ను వసూలు వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా వారి మొర మునిసిపల్ అధికారులు ఆలకించే పరిస్థితి లేదు. మార్చి 31 నాటికి పురాల్లో ఆస్తి పన్ను రూ.248.17 కోట్లు, తాగునీటి పన్ను రూ.70.86 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. మునిసిపాలిటీలు ఏ మేరకు వసూలు చేస్తాయో చూడాలి.

మునిసిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూలు ఇలా..

మునిసిపాలిటీ	లక్ష్యం కోట్లలో	వసూలైన పన్ను కోట్లలో	శాతం
నరసరావుపేట	16.37	7.17	43.80
చిలకలూరిపేట	15.44	4.04	25.80
వినుకొండ	4.71	3.97	84.30
సత్తెనపల్లి	7.07	3.04	43.00
మాచర్ల	5.48	2.45	44.70
పిడుగురాళ్ళ	5.24	2.83	54.00
దాచేపల్లి	1.97	1.31	66.70
గురజాల	1.43	0.66	46.30
గుంటూరు	256.40	82.21	32.10
తెనాలి	24.61	12.32	50.10
మంగళగిరి, తాడేపల్లి	33.93	19.94	58.76
పొన్నూరు	5.61	3.10	55.20
బాపట్ల	8.98	4.21	46.90
రేపల్లె	5.24	2.91	55.60
చీరాల	11.38	6.95	61.10
అద్దంకి	4.16	3.18	76.40

తమ్ముళ్లలో.. జోష్



ఇంకొల్లులో జరిగిన 'రా..కదలిరా' సభకు హాజరైన జనసందోహాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు (పాతచిత్రం)

- టీడీపీలో కొత్త ఉత్సాహాన్ని నింపిన చంద్రబాబు 'రా.. కదలిరా' సభ
- అధినేత ప్రసంగంపై జిల్లా వ్యాప్తంగా నేటికీ ప్రజల్లో చర్చ
- వైసీపీ నేతల ఉలికిపాటు, విమర్శలను తిప్పికొట్టడానికి నానా తంటాలు
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభ విజయవంతంపై టీడీపీ శ్రేణుల ఆనందం

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలో రా.. కదలిరా సభ నిర్వహించి ఇప్పటికే నాలుగు రోజులు గడిచాయి. కానీ దాని తాలుకా ప్రకంపనలు ఇంకా వైసీపీ నేతలను వెంటాడుతుంటే... టీడీపీ శ్రేణులు మాత్రం మరింత ఉత్సాహంతో కదం తొక్కుతున్నాయి. చంద్రబాబు రా.. కదలిరా సభ అనంతరం మొత్తం మూడు అంశాలు చర్చకు నిలవడంతో తెలుగుతమ్ముళ్లలో ట్రిపుల్ జోష్ కనిపిస్తోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ నెల 17న పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఇంకొల్లులో టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన రా.. కదలిరా సభ అటు పాలకపార్టీ నేతలను జనంలో దోషులుగా నిలబెట్టడం ఒక ఎత్తయితే ఆయన చేసిన విమర్శలు బలంగా ప్రజల్లోకి వెళ్లడంతో పెద్దఎత్తున చర్చ నేటికీ నడుస్తోంది. దీంతో అధికారపార్టీ నేతల్లో ఉలికిపాటు కనబడుతోంది. చంద్రబాబు పర్యటన ఖరారైన అయిదు రోజుల వ్యవధిలోనే ఏర్పాట్లు పూర్తిచేయడం ఒక ఎత్తయితే దానిని అడ్డుకోవడానికి ప్రభుత్వం శతవిధాల ప్రయత్నించి నప్పటికీ సభ విజయవంతమైన తీరు కూడా పాలకపార్టీని ఆలోచనలో పడేసింది. దీంతో చంద్రబాబు పర్యటనతో పై మూడు అంశాలపై జనాల్లో పెద్దఎత్తున చర్చ జరగడంతో తెలుగు తమ్ముళ్లు ట్రిబుల్ జోష్‌తో ఉరకలెత్తుతున్నారు.

సభను భగ్నం చేయాలనుకున్నప్పటికీ..

చంద్రబాబు రా.. కదలిరా సభను పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో ప్రకటించినప్పటి నుంచి ప్రభుత్వం కుట్రలకు తెరలేపిన సంగతి తెలిసిందే. దేవాదాయశాఖ అధికారుల ఫిర్యాదు పేరిట పోలీసులను రంగ ప్రవేశం చేయించి సభాస్థలి దగ్గర హడావిడి చేయడం మొదలుకుని ఆర్టీసీ స్థలానికి ఫెన్సింగ్ వేయించే దుష్ట పన్నాగాలు అనేకం పాలకపార్టీ చేయించింది. అన్నింటినీ ఛేదించుకుని సభ కోసం ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ, జనాన్ని రాకుండా చేయాలనే కుయుక్తులతో ట్రాఫిక్ విషయంలో నియంత్రణ పాటించకుండా ప్రభుత్వం కుట్ర పన్నింది. ఇన్ని చేసినప్పటికీ పెద ఎత్తున జనం సభకు హాజరుకావడం ఒక ఎత్తయితే, అడ్డంకులు సృష్టించినా సభ విజయవంతం అవడంతో శ్రేణుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అధికారపార్టీ మీద ఉన్న వ్యతిరేకతకు ఇదో స్పష్టమైన సూచికనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

నాలుగు రోజులు గడచినా అదే చర్చ..

పాలకపార్టీ నేతలపై ప్రజల్లో నాలుగేళ్లుగా వేళ్లూనుకున్న అసహనాన్నే సభ సాక్షిగా టీడీపీ అధినేత చంద్రబాబు ఎండ గట్టడంతో అది జరిగి నాలుగు రోజులు దాటినా ఆయన లేవనెత్తిన అంశాలపై ఇంకా జనాల్లో చర్చ జరుగుతుందని రాజకీయ పండితులు అభిప్రాయ పడుతున్నారు. వైసీపీ నేతలు ప్రజలను ఏ విధంగా పీడిస్తున్నారనే అంశంతో పాటు, సహజవనరుల విధ్వంసం పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయమే చంద్రబాబు నోటి వెంట రావడంతో ఆ ప్రసంగం బాధితులకు స్వాంతన చేకూర్చిందనే మాటలు వినిపిస్తున్నాయి.

అధినేత ప్రసంగంపై జిల్లా వ్యాప్తంగా చర్చ...

ఇంకొల్లు సభలో చంద్రబాబు ప్రసంగం ఆసాంతం సూటిగా, పదునైన విమర్శలతో సాగింది. ముఖ్యంగా బాపట్ల పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు చేసిన దురాగతాలను ఎండగడుతున్నప్పుడు ప్రజల్లో పెద్ద ఎత్తున స్పందన రావడం గమనార్హం. పైగా ఆ వ్యాఖ్యల పట్ల నేటికీ జిల్లావ్యాప్తంగా జనంలో చర్చ నడుస్తూనే ఉంది. ఆమరావతిలో పెద్ద సైకో ఉంటే పర్చూరులో చిన్న సైకో ఉన్నారని వైసీపీ నేత ఆమంచిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకుని పాలకపార్టీ చేసిన ఓట్ల అక్రమాలను మరోసారి చంద్రబాబు ప్రజలకు వివరించారు. బాపట్ల ఎంపీ సురేష్‌కు కబ్జాలు, బెదిరింపులు, అక్రమాలు చేయడం తప్ప పార్లమెంటులో పొడిచిందేమి లేదని, చెరుకుతోటలు కాల్చడం తప్ప ఏదీ చేతకాదని విమర్శించారు. సంతనూతలపాడు వైసీపీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు అసెంబ్లీ వేదికగా ప్రకాశం జిల్లా కొండెపి టీడీపీ ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామిపై దాడికి వచ్చిన విధానాన్ని ఆ సభ వేదికగా మరోమారు టీడీపీ అధినేత గుర్తు చేశారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అధికారంలోకి వచ్చాక కమర్షియల్ రఘుపతిగా మారిపోయారని ఎద్దేవా చేశారు. వేమూరు లో ఇసుక ద్వారా వంద కోట్లు వెనకేసిన మంత్రి ఇప్పుడు సంతనూతలపాడుకు వెళ్లారన్నారు. 2019లో టీడీపీ తరఫున గెలిచి పార్టీమారిన దుర్మార్గుడు అని చీరాల శాసనసభ్యుడు బలరాంను ఉద్దేశించి అనగా, శాశ్వతంగా పేకాట ఆడుకోవడమేనని రేపల్లె వైసీపీ నేత, ఎంపీ మోపిదేవిని విమర్శించారు. ఇవే కాకుండా జిల్లాలో జరుగుతున్న అక్రమాలను, దుర్మార్గాలను, పడకేసిన అభివృద్ధి పనులను సభా వేదికగా ఎండగట్టారు.

వైసీపీ నేతల్లో ఉలికిపాటు...

అంచనాలకు మించి జనసందోహం కదలిరావడం ఒక ఎత్తయితే ఆయన చేసిన విమర్శల పట్ల జనాల్లో ఇంత పెద్దఎత్తున చర్చ జరగడం వైసీపీ నేతలకు మింగుడు పడడంలేదు. నష్ట నివారణ కోసం నానా తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో ఆయన చేసిన ఆరోపణల పట్ల హుందాగా సమాధానమివ్వాల్సిన నేతలు అదుపు తప్పి మాట్లాడుతున్నారనే వ్యాఖ్యలు ప్రజల నుంచే వ్యక్తమవుతున్నాయి. జరిగిన డ్యామేజీని కంట్రోల్ చేసుకునే నేపథ్యంలో ప్రజల్లో మరింత పలుచనవుతున్నారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన విమర్శల పట్ల తాజాగా పర్చూరు నియోజకవర్గంలో మంత్రి మేరుగ నాగార్జున స్పందించారు. ఎదురుదాడి తప్ప మరేమీ దానిలో కన్పించకపోవడం గమనార్హం. ఇక చీరాల శాసన సభ్యులు కరణం బలరాం కృష్ణమూర్తి కూడా చంద్రబాబు చేసిన విమర్శల పట్ల స్పందించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బలరాం చేసిన వ్యాఖ్యలు కూడా పూర్తిగా అదుపుతప్పి మాట్లాడినట్లుగా ఉంది తప్పితే మాజీ ముఖ్యమంత్రి చేసిన విమర్శలను తిప్పికొట్టడంలో విఫలమయ్యారనే చర్చ నడుస్తోంది. ఈ నేతలే కాకుండా జిల్లాలో ఉన్న మిగిలిన వైసీపీ నేతలు కూడా టీడీపీ అధినేత పర్యటన విజయవంతం కావడం, ఆయన చేసిన వ్యాఖ్యలు పట్ల కలవరపాటుకు గురవుతూనే ఉన్నారు.



పెనుమూడిలో నది ఒడ్డున పడవల్లో నుంచి ట్రాక్టర్‌లోకి ఎత్తుతున్న ఇసుక

డ్రెడ్జర్‌తో.. తవ్వకాలు

- పెనుమూడిలో ఇసుకాసురల బరితెగింపు
- వారధికి ముప్పువాటిల్లే ప్రమాదమున్నా పట్టదు
- అడ్డగోలుగా అధికార పార్టీ నేతల ఇసుక దోపిడీ
- అధికారులు చోద్యం.. వందల ట్రక్కుల తరలింపు

రేపల్లె, ఫిబ్రవరి 20: అనుమతులు లేవు.. అధికారం అండతో.. రేపల్లె మండలం పెనుమూడి కృష్ణానదిలో ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. డ్రెడ్జర్ సహాయంతో ఇసుకను నదిలో నుంచి తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిని చూసి ప్రశ్నించిన గ్రామస్థులను సైతం బెదిరిస్తున్నారు. అయినా అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారే తప్ప కనీస చర్యలు తీసుకోవడంలేదు. అధికారం మాది చేతనైంది చేసుకోండి.. తవ్వకాలు మాత్రం ఆపేదిలేదన్న రీతిలో ఇసుక అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. రీచ్‌కు అనుమతులు లేకున్నా స్థానిక అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇసుకను ట్రాక్టరు టక్కుకు రూ.5 వేలు, 10 టైర్ల టిప్పర్‌కు రూ.30 వేలు వసూలు చేస్తున్నారు. వందలాది ట్రక్కుల ఇసుకను తోడేస్తూ ట్రాకర్లు, టిప్పర్ల ద్వారా తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. పెనుమూడి-పులిగడ్డ వారధి పక్కనే పెద్ద బోటుతో డ్రెడ్జర్‌ను ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఈ కారణంగా వారధికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తీరప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక ర్యాంప్ కాంట్రాక్టు తీసుకున్నామని చెబుతూ అడ్డగోలుగా తవ్వకాలు జరుపుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించిన దాఖలాలు లేవని పెనుమూడి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుమూడి కరకట్ట వద్దే పోలీస్ చెక్‌పోస్టు ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉన్నతాధికారుల దృష్టిసారించి అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపివేసి వారధిని రక్షించాలని కోరుతున్నారు. ఇసుక కోసం వచ్చే భారీ వాహనాలతో కరకట్ట ఛిద్రమై ప్రమాదభరితంగా మారుతుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వారధి పక్కనే డ్రెడ్జర్ల ద్వారా ఇసుక తవ్వకాలు

పొగాకు కొనుగోళ్లకు సన్నాహాలు

నేడు రైతు ప్రతినిధులతో బోర్డు ఉన్నతాధికారుల సమావేశం

నెలాఖరు నుంచి వేలం ప్రారంభించే అవకాశం

కర్ణాటకలో ముగింపు దశలో మార్కెట్



ఒంగోలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లకు బోర్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కర్ణాటకలో మార్కెట్ దాదాపు ముగింపు దశకు చేరుకోవడంతో పాటు దక్షిణాదిలో ఎండలు తీవ్రత పెరుగుతుండటంతో తక్షణం రాష్ట్రంలో వేలం ప్రారంభించాలన్న డిమాండ్ రైతుల నుంచి వస్తోంది. దీంతో నెలాఖరులో వేలం ప్రక్రియను ప్రారంభించే యోచన చేస్తున్న బోర్డు అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితులపై ఇప్పటికే వేలంకేంద్రాల వారీ రైతులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. తిరిగి గుంటూరులోని పొగాకుబోర్డు ప్రధాన కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కొక్క వేలంకేంద్రం నుంచి ఇద్దరేసి రైతు ప్రతినిధులు, ఆయా వేలంకేంద్రాల అధికారులను ఆ సమావేశానికి హాజరుకావాలని సూచించారు. అలాగే బోర్డులో రాష్ట్రం నుంచి ఉన్న రైతు ప్రతినిధులు కూడా పాల్గొనే ఈ సమావేశానికి వ్యాపారుల ప్రతినిధులు కూడా వస్తారని సమాచారం. గతేడాది ఫిబ్రవరి 24న రాష్ట్రంలో తొలివిడత దక్షిణాదిలోని కొన్ని వేలంకేంద్రాల్లో కొనుగోళ్లను ప్రారంభించారు. అలాగే ఈ ఏడాది కూడా ఈ నెలలోనే వేలం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్రంలో 140 మిలియన్ కిలోలను 2023-24 సంవత్సరానికి ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా మరో 40 మిలియన్ల వరకు అధికంగా ఉత్పత్తయ్యే అవకాశం కనిపిస్తోంది. ప్రత్యేకించి దక్షిణాదిలోనే అధికంగా పంట సాగు తదనుగుణంగా ఉత్పత్తి పెరుగుతోంది. దీనికి తోడు గతం కన్నా ఎండలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో దక్షిణాదిలో తక్షణం వేలం ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై బుధవారం నాటి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇదిలా ఉండగా కర్ణాటకలో ప్రస్తుత మార్కెట్ ఉగింపు దశకు చేరింది. అక్కడ 100 మిలియన్లకు గతేడాది అనుమతి ఇవ్వగా 85 మిలియన్లు ఉత్పత్తి జరిగింది. ఇప్పటికే మూడొంతుల కేంద్రాల్లో వేలం ముగియగా ఈ వారంలో మిగతా వాటిలోనూ ముగుస్తుందని సమాచారం.

జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

సీఎం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి

ఒంగోలులో జర్నలిస్టులు ర్యాలీ

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టుల సంఘాల నాయకులు


ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20 : తమకు రక్షణ కల్పించడంతో పాటు రాప్తాడు బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వైసీపీ రౌడీ మూకలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జర్నలిస్టు నాయకులు డిమాండ్ చేశారు. వివిధ జర్నలిస్టుల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రమైన ఒంగోలులో ర్యాలీ నిర్వహించి కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో జర్నలిస్టు సంఘాల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి బహిరంగ సభ కార్యక్రమాన్ని కవరేజ్ కోసం వెళ్ళిన ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేసి పాశవికంగా కొట్టడం దుర్మార్గంగా ఉందన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇటువంటి దాడులను ఆపకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. శ్రీకృష్ణపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి దాసరి కనకయ్య, రాష్ట్ర ప్రతినిధి ఎ.సురేష్, ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.నాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు పి.రామకోటేశ్వరరావు, ఎన్.జనార్దన్, ఏబీఎన్ వెంకట్రావు, ఇఫ్తేకర్ బాషా, మేకపాటి మాల్యాద్రి, నంబూరి సురేష్, అజయ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణమస్తు, షాదీతోఫా కింద రూ.3.43కోట్లు లబ్ధి

ఒంగోలు(కలెక్టరేట్); ఫిబ్రవరి 20: జిల్లాలో వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా కింద ఐదవ విడతలో 416మంది లబ్ధిదారులకు రూ.3.43కోట్లు లబ్ధి చేకూరిందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం సీఎం లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వధువుల తల్లుల ఖాతాల్లోకి ఈ నిధులను జమచేస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఏకేయూ వీసీ అంజిరెడ్డి
- ఉత్సాహంగా పెడగాజి గేమ్స్ మీట్



విజేతలకు కప్‌లు అందజేస్తున్న వీసీ అంజిరెడ్డి

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 20: క్రీడలతో మానసికోల్లాసం, ఆరోగ్యం లభిస్తాయని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎం.అంజిరెడ్డి పేర్కొన్నారు. పెడగాజి గేమ్స్ మీట్ -2024 మంగళవారం ఒంగోలులోని ఏకేయూలో జరిగింది. ఈ కార్యక్రమానికి వీసీ అంజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. తాను వీసీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రెండోసారి ఈ స్థాయి క్రీడాపోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అంతేగాకుండా ప్రకాశం జిల్లాను స్పోర్ట్స్ బ్రాండ్‌గా తీర్చిదిద్దేందుకు యూనివర్సిటీ పరంగా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరో మూడునెలల్లో యూనివర్సిటీ ప్రాంగణం పేర్నమిట్ట వద్ద ఉన్న యూనివర్సిటీ భవనంలోకి మారనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ఏకేయూ పేర్నమిట్ట క్యాంపస్‌లో యూనివర్సిటీ పరిధిలోని 224 కళాశాలల విద్యార్థులతో మెగా టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించిన వీసీ ఆయా క్రీడాజట్లను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ దేవీవరప్రసాద్, కేవీఎన్.రాజు, ప్రొఫెసర్ హరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ కెనిర్మల, రిమ్స్ వైద్యులు పి.సుధీర్, సీహెచ్.హేమశిల్ప తదితరులు పాల్గొన్నారు. కాగా పలు పాఠశాలల విద్యార్థులు వాలీబాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

సర్వర్..సంకటం

పట్టాలు రిజిస్ట్రేషన్ చేసేందుకు అనేక అడ్డంకులు

ఎన్నికల వేళ ప్రభుత్వం హడావుడి

జగనన్న లేఅవుట్లలో అనేక అవకతవకలు

ఇబ్బందిపడుతున్న సచివాలయ సిబ్బంది

గంటల తరబడి లబ్ధిదారుల ఎదురుచూపులు

ఒంగోలు(కలెక్టరేట్)/పామూరు/వెలిగండ్ల, ఫిబ్రవరి 20: సార్వత్రిక ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో అధికారులే కాకుండా ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం హడావుడిగా సచివాలయాల ద్వారా పట్టాల రిజిస్ట్రేషన్లు చేస్తామనే పేరుతో ఉద్యోగులకు రెండురోజుల పాటు శిక్షణ ఇచ్చి ప్రక్రియను ప్రారంభించడంతో ఉద్యోగులకు తలనొప్పిగా మారింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు చేసేందుకు సాఫ్ట్‌వేర్ వెర్షన్ మార్పులు చేశారు. అయితే అది సరిగ్గా లేకపోవడంతో ప్రస్తుత వెర్షన్‌తోనే సచివాలయాల్లో పట్టాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు శ్రీకారం చుట్టారు. అయితే అనేక గ్రామాల్లో పెద్దఎత్తున పట్టాలు పంపిణీ చేశారు. అటువంటి గ్రామాల్లో పేదలు పనులు మానుకొని గత పది రోజులుగా సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల లేఅవుట్లలో 51,060 మందికి పట్టాలు ఇవ్వగా ఇప్పటివరకు 25వేల మందికి మాత్రమే రిజిస్ట్రేషన్లు చేశారు. మిగిలిన పట్టాలను రిజిస్ట్రేషన్లు చేసేందుకు సాంకేతిక సమస్యలతో సర్వర్ పనిచేయక అటు ఉద్యోగులు, ఇటు లబ్ధిదారులు సచివాలయాల వద్దనే పడిగాపులు గాయాల్సి వస్తోంది. శనివారం సర్వర్ బాగా పనిచేయగా సోమవారం సర్వర్ పనిచేయని పరిస్థితి ఏర్పడింది. మంగళవారం సర్వర్ కొంతసేపు పనిచేసి నిలిచిపోయింది. సర్వర్ పూర్తిగా స్లోగా ఉండటంతో సబ్‌ట్రెజరీ కార్యాలయాలపై కూడా ఆ ప్రభావం పడింది.

పనులు మానుకొని రోజులు తరబడి..

కాగా పేదలు తమ ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్లు చేయించుకొని రోజులు తరబడి సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా ఏ రోజుకారోజు పనులకు వెళ్లి పూటగడుపుకొనే పేదలు కూడా లక్షల్లో ఉన్నారు. అటువంటి వారందరూ తమ పనులు పోగొట్టుకొని సచివాలయాల వద్దనే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉన్నా.. పట్టుమని పదిమందికి కూడా వేలిముద్ర పడటం లేదు. సాధారణంగా సాంకేతిక సమస్యలు లేకుండా సర్వర్ పనిచేస్తే రోజుకు ఒక సచివాలయం నుంచి 30 నుంచి 40 మంది పట్టాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం నాలుగైదు మించి కావడం లేదు.

-వెలిగండ్ల మండలంలో 1,075 మందికి గతంలో పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు పొందిన వారందరికీ రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా, కేవలం 260 మందికి మాత్రమే చేశారు. మొత్తం 29 లేఅవుట్లు వేయగా కేవలం హుస్సేన్‌పురంలో 10మంది మాత్రమే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. 28 గ్రామాల్లో పునాదులు కూడా పడలేదు. రోజుకు 40-50 పత్రాలకు రిజిస్ట్రేషన్ చేయాలన్న లక్ష్యం ఉండగా, పది కూడా చేయలేని పరిస్థితి ఉందని, సర్వర్ మొరాయింపు పెద్ద సమస్యగా మారిందని సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనివేళలో అధిక లోడ్‌తో సైట్ నిలిచిపోతోంది. దీంతో రాత్రిళ్లు 10 గంటల వరకూ రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు చెప్తున్నారు.

-పామూరు మండలంలోని చిలకపాడు, రెవెన్యూ పరిధిలోని పామూరు, చిలకపాడు, తూర్పుకోడిగుడ్లపాడు, జగనన్న కాలనీలకు ఉచిత రిజిస్ట్రేషన్ కార్యక్రమం నుచ్చుపొద సచివాలయంలో చేస్తున్నారు. చిలకపాడులో 519, తూర్పుకోడిగుడ్లపాడులో 140 మందికి పట్టాలు మంజూరు చేశారు. ఈనెల 1 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. రెండు వారాలైనా సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. 659 పట్టాలకు గాను సగం కూడా పూర్తికాలేదు. రోజుకు 30 కూపన్లు ఇస్తున్నామని, అయినా టార్గెట్‌ను పూర్తిచేయలేని పరిస్థితి ఉందని సిబ్బంది చెప్తున్నారు.

-జగనన్న ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్‌లకు సర్వర్ చిక్కులు ఏర్పడ్డాయి. దీంతో సకాలంలో రిజిస్ట్రేషన్లు కాక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికారపార్టీ ఓట్ల కోసం హడావుడిగా ప్రక్రియ చేపట్టడంతోనే ఈ సంకటం నెలకొంది. పట్టాలకు రిజిస్ట్రేషన్లు అని పిలుస్తుండటంతో లబ్ధిదారులు పరుగులు తీస్తున్నారు. తమ స్థలాలు ఎక్కడున్నాయో తెలియదు గానీ అధికారుల ఒత్తిడితో సచివాలయాలకు వస్తున్నారు. ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌తో బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చని, సర్టిఫైడ్ కాపీని పొందే వీలుంటుందని, ఇంటిని అమ్ముకునే సమయంలో ఈ డాక్యుమెంట్ సరిపోతుందని వైసీపీ నాయకులు ప్రచారమే ఇందుకు కారణం. తీరా వచ్చాక సర్వర్ పనిచేయక పడిగాపులు కాయాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రిజిస్ట్రేషన్ కోసం వేచి చూస్తున్న మహిళలు

పట్టా ఒకరికి...పొజిషన్ మరొకరికి

కాగా సచివాలయాల ద్వారా జగనన్న కాలనీల స్థలాల రిజిస్ట్రేషన్ల సమయంలో అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. జగనన్న కాలనీల పట్టాల పంపిణీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపణలు నేపథ్యంలో ప్రస్తుతం రిజిస్ట్రేషన్ల సమయంలో వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది. జగనన్న లేఅవుట్లు వేసిన తర్వాత ఆయా గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారుల పేరుతో రెవెన్యూ అధికారులు పొజిషన్ చూపించారు. అయితే వివిధ కారణాల పేరుతో పొజిషన్ చూపించిన లబ్ధిదారునికి కాకుండా మరొకరి పేరుతో పట్టా ఇచ్చారు. ఇప్పుడు సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల సమయంలో ఈ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. కొంతమంది లబ్ధిదారులకు పట్టా ఉన్నా, రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో తేడాలు వస్తున్నాయి. ఆ సమయంలో సచివాలయ ఉద్యోగులు ఈ విషయాన్ని ప్రశ్నించినప్పుడు పట్టా పొందిన వ్యక్తి సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో సుమారు 20 శాతం మంది పట్టాల్లో తేడాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది.

తప్పులతడకలతో ఇబ్బందులు

పేదలకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఆచరణలో తగిన సౌకర్యం కల్పించడం లేదని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. పేదలకు ఇచ్చిన పట్టాల్లో పేర్లు, సర్వే నంబర్లు, ప్లాట్ నెంబర్, హద్దులు తప్పుగా ఉండడంతో రిజిస్ట్రేషన్ కావడం లేదు. ఆన్‌లైన్ దరఖాస్తు తర్వాత. రిజిస్ట్రేషన్‌కు ఇచ్చిన తేదీన కార్యాలయానికి వచ్చినా తిరస్కరణకు గురవుతుండటంతో లబ్ధిదారులు ఉసూరుమని వెనుదిరుగుతున్నారు. మరోపక్క గ్రామాల్లో కరెంట్ కోతల కారణంగా ప్రక్రియ ముందుకు సాగడం లేదు. సాంకేతిక సమస్యలు లేకుంటే 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని చెప్తున్నారు. కాగా రోజూ సర్వర్ సమస్యతో నిరీక్షించాల్సి వస్తోందని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కదంతొక్కిన ఉద్యోగులు

బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ ఆందోళన

సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం

మహాధర్నాలో ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరిక



కలెక్టర్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20 : తమకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కదంతొక్కారు. జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు జిల్లా జేఏసీ చైర్మన్ కూచిపూడి శరత్‌బాబు అధ్యక్షత వహించారు. జేఏసీ వైస్ చైర్మన్, పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాన్నారు. డీఏలు, సరెండరల్ లీవులు, పీఆర్సీ అరియర్స్, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్, మెడికల్ బిల్లులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళిన పట్టించుకోకపోవడంతో రోడ్డు మీదకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. శరత్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 27న చలో విజయవాడ చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అంకిరెడ్డి, చెన్నుపాటి మంజుల, డి. వీరాంజనేయులు సుబ్బారావు, వెంకటేశ్వరరావు, సాగర్‌రెడ్డి, ఏడుకొండలు, కిరణ్, మధు, రోజ్‌కుమార్, లక్ష్మయ్య, మంజేష్, షరీఫ్, శివకుమార్, సునీల్, కిషోర్, తోట శ్రీను, కరీముల్లా, మాధవి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థుల పరీక్షల షెడ్యూల్

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 20: పాఠశాలల్లో 1 నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. 1 నుంచి 9 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ)4, 10వ తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలను ఈనెల 23 నుంచి నిర్వహించాలని పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ ఆదేశించారు. ఈనెల 23 నుంచి 28 వరకు ఎఫ్ఏ-4 పరీక్షలు, 23 నుంచి మార్చి 4 వరకు ప్రీ ఫైనల్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు.

- ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులకు 23న ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం, 24న ఉదయం పరిసరాల విజ్ఞానం, మధ్యాహ్నం ఇంగ్లీషు పార్ట్ ఏ, పార్ట్ బీ, 25న ఓఎస్ఎస్సీ పరీక్ష జరుగుతుంది.
- ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 6, 7, 8 తరగతుల విద్యార్థులకు 23న ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం, 24న హిందీ, జనరల్ సైన్స్, 26న సోషల్ స్టడీస్, 27న ఇంగ్లీషు పార్ట్ ఏ, టోఫెల్, 28న ఓఎస్ఎస్సీ, ఓఎస్ఎస్సీ-2 పరీక్ష ఉంటుంది.
- 9వ తరగతి విద్యార్థులకు 23న తెలుగు, గణితం, 24న హిందీ, జనరల్ సైన్స్, 26న సోషల్, 27న ఇంగ్లీషు, 28న ఓఎస్ఎస్సీ పరీక్ష జరుగుతుంది.
- పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఈనెల 23 నుంచి ప్రీఫైనల్ పరీక్షలు మధ్యాహ్నం 1.15 నుంచి 4.30 వరకు జరుగుతాయి. 23న తెలుగు, 24న హిందీ, 26న ఇంగ్లీషు, 27న గణితం, 28న ఫిజికల్ సైన్స్, 29న బయాజికల్ సైన్స్, మార్చి 1న సోషల్, 2న కాంపోజిట్ కోర్సు ఓఎస్ఎస్సీ, 4న ఓఎస్ఎస్సీ-2 పరీక్ష జరుగుతుంది. ఎఫ్ఏ-4 పరీక్షలకు ప్రశ్నాపత్రాలను వాట్సాప్ ద్వారా ఆ పాఠశాలలకు చేరుస్తారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులే ప్రశ్నపత్రాలను సమకూర్చుకుని విద్యార్థులకు అందజేయాలి. పదవ తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలకు డీసీఈబీ ద్వారా ప్రశ్నపత్రాలను పాఠశాలలకు అందజేస్తారు.

చర్యలు సున్నా...!

ఏళ్ల తరబడి క్రమబద్ధీకరణకు నోచుకోని జీరో ఖాతాల భూములు

కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు

దర్శి, ఫిబ్రవరి 20 : రైతులకు హక్కు కల్పిన పట్టాభూములు అధికారుల తప్పిదం వలన జీరో ఖాతాల్లో పడ్డాయి. ఈ భూములను క్రమబద్ధీకరించుకునేందుకు వారు నానాపాట్లు పడుతున్నారు. ఏళ్ల తరబడి అన్నదాతలు తమ భూములకు హక్కు కల్పించాలని తిరుగుతున్నా పనులు జరగటం లేదు. ఐదేళ్లుగా రైతులు పడిగాపులు కాస్తూనే ఉన్నారు.



దర్శి తహసీల్దార్ కార్యాలయం

మండలంలో సుమారు 4400లకు పైగా జీరో ఖాతాల్లో ఐదు వేల ఎకరాల భూమి నమోదైంది. పాత రికార్డుల ప్రకారం ఆ భూమిపై రైతులకు సర్వహక్కులు ఉన్నప్పటికీ అధికారుల తప్పిదం వలన జీరో ఖాతాల్లో నమోదయ్యాయి. అందువలన ఆన్‌లైన్‌లో కనిపించటం లేదు. రైతులు వ్యవసాయ రుణాలు తీసుకునేందుకు వీలులేకుండా పోయింది. అవసరాలకు విక్రయించుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో తమకు హక్కు కల్గిన భూమి ఎందుకు ఉపయోగపడకుండా పోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. రెవెన్యూ అధికారులు మండలంలో మొత్తం 4406 జీరో ఖాతాల్లో భూములు నమోదైనట్లు లెక్కతేల్చారు. ఆ భూములను క్రమబద్ధీకరించాలని ప్రతిపాదిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. సుమారు మూడేళ్ల క్రితం నివేదిక జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు వెళ్లినప్పటికీ పని జరగలేదు. ఉన్నతాధికారులు ఆ ఫైలు పక్కన పడేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇప్పట్లో జీరో ఖాతాల్లో చేరిన భూములు క్రమబద్ధీకరణకు అవకాశం లేదని రైతులు ఆందోళనలు చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ రికార్డులు గోల్‌మాల్ అవుతున్నాయి. ఏ భూమి ఏ రికార్డుల్లోకి మారుతుందో అర్థంకాని పరిస్థితి. గతంలో పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకొని సంపూర్ణ హక్కులతో అనుభవిస్తున్న భూములను రెవెన్యూ అధికారులు అకారణంగా జీరో ఖాతాల్లో నమోదు చేసినందున రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా కొందరు అధికారులు పట్టాభూములను జీరో ఖాతాల్లో నమోదు చేశారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రికార్డులు క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వైసీపీ నేతలు దొంగ ఓట్లు చేరుస్తున్నారు!

ఎమ్మెల్యే స్వామి విమర్శ

అప్రమత్తంగా ఉండాలని టీడీపీ శ్రేణులకు సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, ఫిబ్రవరి 21 : నియోజకవర్గంలో వైసీపీ నాయకులు బరితెగించి దొంగ ఓట్లను చేరుస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆరోపించారు. కొత్త ఓట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని టీడీపీ శ్రేణులకు సూచించారు. నూతనంగా ప్రారంభించిన స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే స్వామి, పార్టీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో స్వామి పాల్గొని మాట్లాడారు. అధికారపార్టీ నేతలు ఓటమి భయంతో పక్క నియోజకవర్గాల ఓట్లను కొండపి సెగ్మెంట్‌లో చేరుస్తున్నారని మండిపడ్డారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు రాష్ట్రంలో, ఇటు నియోజకవర్గంలో టీడీపీ విజయం ఖాయమైందని తెలిసిపోయాక దొడ్డిదారులను వెతుకుతున్నారని ధ్వజమెత్తారు. అందులోభాగంగానే నియోజవర్గ ఈఆర్వోలుగా నెలవ్యవధిలో ముగ్గురుని, వారం రోజుల్లో సింగరాయకొండ తహసీల్దార్లు ముగ్గురిని మార్చారని తెలిపారు. ఇదంతా మంత్రి సురేష్ ప్రోద్బలంతోనే జరుగుతున్నదని విమర్శించారు. సింగరాయకొండలో అధిక భాగం దొంగ ఓట్లను చేరుస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి తప్పులు చేస్తే అధికారులు తగినమూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. దొంగ ఓట్ల విషయమై టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సందానీబాషా, మించల బ్రహ్మయ్య, గాంధీచౌదరి, రామారావు, కూనపరెడ్డి సుబ్బారావు, సన్నెబోయిన శ్రీనివాసులు, వేల్పుల వెంకట్రావు, నర్రా రాంబాబు, గౌస్, యస్థాని, నరసింహ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

అద్దంకి, ఫిబ్రవరి 20: మండలంలోని వెంపరాల ఎస్సీ కాలనీలో జి.అంకమ్మరావు(32) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. అంకమ్మరావు బేల్దారి పనులకు వెళ్లి కుటుంబపోషణ సాగిస్తున్నాడు. ప్రస్తుతం భార్యాభర్తలు పచ్చాకు పనికి వెళ్తున్నారు. గత కొద్దిరోజులుగా అంకమ్మరావు పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నట్లు తెలుస్తుంది. ఈక్రమంలో మంగళవారం కుటుంబసభ్యులు ఎవరూలేని సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే గమనించి 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలోపు మృతి చెందాడు. అంకమ్మరావుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు

యద్దనపూడి(మార్టూరు) ఫిబ్రవరి 20: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో శోభకృత్ భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు నారాయణ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఏకాదశ పర్యాయ పారాయణలు, అష్టాదశోధ్యాయ గీత పారాయణ కార్యక్రమాలతో పాటు ఏకాదశి పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులతో భీష్మ పూజాదికాలు, గీతా మాతా అర్చనలు జరిపించారు. తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గ్రానైట్ శ్లాబుల లారీ పట్టివేత

మార్టూరు, ఫిబ్రవరి 20: మార్టూరు సెంటరు నుంచి రాజుపాలెం వెళ్లే సర్వీసు రోడ్డులో సోమవారం అర్ధరాత్రి ఎలాంటి బిల్లులు లేకుండా ఇతర రాష్ట్రానికి వెళుతున్న గ్రానైట్ శ్లాబుల లారీని పట్టుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మూడు రోజుల క్రితం రాజుగారిపాలెం రోడ్డు వద్ద కూడా మరో గ్రానైట్ శ్లాబుల లారీని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీటిని స్టేషన్‌కు తరలించిన అనంతరం మైనింగ్ అధికారులకు పట్టుబడిన లారీల విషయమై ఫిర్యాదు చేశామన్నారు.

437 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, ఫిబ్రవరి 20: మండలంలోని గొనసపూడి గ్రామంలో పోలేరమ్మ ఆలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.కీర్తిసరోజ్, బి.నాగేంద్ర, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ షేక్ అజీమ్ 437 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, మాధవి, వరదానం, శ్రీలక్ష్మి, సుధ, జి.విజయప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మనపాలెం రేషన్ డీలర్ తొలగింపు

మేదరమెట్ల , ఫిబ్రవరి 20: మండలంలోని తిమ్మనపాలెం రేషన్ డీలర్‌ను తొలగిస్తూ ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. తిమ్మనపాలెం రేషన్ డీలర్‌గా జి. లక్ష్మీ కుమారి పనిచేస్తున్నారు. ఆమె 2021 పంచాయతీ ఎన్నికల్లో తిమ్మనపాలెం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నవారు రేషన్ షాపు నిర్వహించడానికి వీలు లేదని పౌరసరఫరాల చట్టంలో స్పష్టంగా పెర్కొన్నారని గ్రామానికి చెందిన వారు పిర్యాదు చేయడంతో లక్ష్మీకుమారిని రేషన్ డీలర్‌గా తొలగిస్తు ఆర్‌డీవో సూర్యనారాయణరెడ్డి ఉత్వర్వులు జారీ చేశారు. తక్షణమే తగిన చర్యలు తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలని కొరిశపాడు తహసీల్దార్‌ను ఆదేశించారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

మేదరమెట్ల , ఫిబ్రవరి 20: వచ్చేనెల మూడవ తేదిన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఎస్.విజయమ్మ ఆదేశించారు. మంగళవారం మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డెలివరీ రూం, ఐఎల్ఆర్, డిఫ్‌ఫీజర్‌లను ఆమె పరిశీలించారు. గర్భిణులకు అందించే సేవలలో ఎలాంటి అశ్రద్ధ వహించవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.చిట్టిబాబు, డాక్టర్ పి.నిఖిలా రెడ్డి, డాక్టర్ మనోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

'భవనాసి' చుట్టూ చేపల చెరువులు

- కలుషిత నీటిని చెరువులోకి వదులుతున్న నిర్వాహకులు
- దుర్వాసన వెదజల్లుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



భవనాసి చెరువు అంచున ఉన్న చేపల చెరువులు

అద్దంకి, ఫిబ్రవరి 20: ఒకప్పుడు స్వచ్ఛంగా ఉండే భవనాసి చెరువు నీరు నేడు కలుషితంగా మారిపోయాయి. శింగరకొండ వద్ద ఉన్న భవనాసి చెరువుకు రెండు వైపులా పెద్ద సంఖ్యలో చేపల చెరువులు ఏర్పాటుచేశారు. చేపల చెరువుల విస్తీర్ణం ఏటికేడు పెరుగుతుంది. భవనాసి చెరువు నీటినే చేపల చెరువులకు నింపుకుంటున్న నిర్వాహకులు చేపల మేతగా వినియోగించే మాంసం వ్యర్థాలతో కలుషితమైన నీటిని భవనాసి చెరువులోకి వదులుతున్నారు. దీంతో భవనాసి చెరువు నీరు మొత్తం కలుషితంగా మారుతుంది. కలుషిత నీరే పంట పొలాలతో పాటు గుండ్లకమ్మ నదిలో ఉన్న మంచినీటి ఊటబావుల వరకు చేరుతున్నాయి. దీంతో అద్దంకి పట్టణంతో పాటు పలు గ్రామాల ప్రజలకు ఆ ఊటబావుల నీరే సరఫరా అవుతుంది. కలుషిత నీటితో భవనాసి చెరువులో కూడా గతంలో ఎన్నడూ లేనివిధంగా నాచు పెరిగి, కుళ్లిన తర్వాత మరింత దుర్వాసన వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అటు చేపల చెరువుల నుంచి వచ్చే వ్యర్థాలకు తోడు నాచు కుళ్లటం ద్వారా మరింత కలుషితమై భవనాసి చెరువులో చేపల ఎదుగుదలపై కూడా ప్రభావం చూపుతుందని జాలర్లు ఆందోళన చెందుతున్నారు.

భవనాసి చెరువుకు రెండువైపులా ఇష్టానుసారంగా చేపల చెరువుల తవ్వకాలు చేస్తున్నా, కొంతమేర భవనాసి చెరువు భూమి ఆక్రమించి చేపల చెరువుల ఏర్పాటు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవటం మరింత విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చేపల చెరువుల నుంచి కలుషిత నీరు భవనాసి చెరువు లోకి విడుదల చేయకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

డంపింగ్ యార్డులుగా ప్రధాన రహదారులు

- వ్యర్థాలు, బండరాళ్లతో నిండిపోతున్న వైనం
- దుర్గంధంతో ప్రజల అవస్థలు
- పట్టనట్టుగా అధికారులు



పర్చూరు - చీరాల రహదారిలో వ్యర్థాలతో నిండిన రోడ్డు మార్జిన్

పర్చూరు, ఫిబ్రవరి 20: ఓపక్క దుర్గంధం, మరోవైపు ప్రమాద భరితంగా బండరాళ్ళు వ్యర్థాలతో ప్రధాన రహదారులు దర్శనమిస్తున్నాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, ప్రజలతో రాకపోకలు సాగించే ప్రధాన రోడ్ల మార్జిన్‌ల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీనికితోడు వ్యర్థాలతో చెత్తకుప్పలుగా మారటంతో సమస్య మరింత జఠిలంగా మారింది. చెత్తకుప్పల్లో నుంచి ఒక్కసారిగా జీవాలు రోడ్డుపైకి రావటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పర్చూరు - చీరాలకి వెళ్ళే ప్రధాన ఆర్అండ్‌బీ రహదారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఈమార్గంలో ఇటీవల పర్చూరు మండలం ఉప్పుటూరుకు చెందిన ఓవ్యక్తి ద్విచక్ర వాహనంపై పర్చూరు వస్తుండగా చెత్తకుప్పలుగా మారిన వ్యర్థాలలో నుంచి పందులు రోడ్డుపైకి రావటంతో ప్రమాదానికి గురై మృతిచెందాడు. ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయి. అదేవిధంగా ఇళ్ల వ్యర్థాలు, బండరాళ్ళు సైతం ప్రధాన రోడ్లకు ఇరువైపులా పోస్తున్నారు. దీంతో సమస్య మరింత ప్రమాదభరితంగా మారింది. ఒకవైపు రోడ్లు అధ్వానంగా మారటం, మరోవైపు మార్జిన్‌లు వర్థాలతో నిండిపోయి ఉండటంతో రోడ్డు మార్జిన్‌ల్లోకి వాహనం వెళితే ప్రమాదానికి గురికావల్సిందే. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత ప్రమాదభరితంగా ఉంది. రోడ్డు మార్జిన్‌లు వ్యర్థాలతో నిండి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూస్తున్న దాఖలాలు కానరావటం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మార్జిన్‌ల్లో వర్థాలను తొలగించేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఉప్పుటూరు సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లో పడవేసిన బండరాళ్ళు

పారిశుధ్యం పట్టదా..!

- అద్దంకి మున్సిపల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్‌ల ధ్వజం
- వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి
- మారిన అధికారపార్టీ కౌన్సిలర్‌ల తీరు



పారిశుధ్యం, తాగునీటి సమస్యపై ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్‌లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, ఫిబ్రవరి 20: అద్దంకి మున్సిపల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్‌లు పాత పంథానే కొనసాగించగా, అధికారపార్టీ కౌన్సిలర్‌లలో మాత్రం మార్పు కనిపించింది. గతంలో టీడీపీ కౌన్సిలర్‌లు సమావేశంలో ఏ చిన్నపాటి సమస్యను ప్రస్తావించినా అధికారపార్టీ వారు మూకుమ్మడిగా ఎదురుదాడికి దిగేవారు. మహిళా కౌన్సిలర్‌లు అని కూడా చూడకుండా రన్నింగ్ కామెంటరీ చేసిన సందర్భాలు కూడా చోటు చేసుకున్నాయి. అయితే, మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మాత్రం గతానికి భిన్నంగా జరిగింది. టీడీపీ కౌన్సిలర్‌లు పారిశుధ్యం, తాగునీటి ఎద్దడి గురించి ప్రస్తావించినా.. అధికారపార్టీ కౌన్సిలర్‌లలో ఒకరిద్దరు మాత్రమే మాట్లాడే ప్రయత్నం చేశారు. అత్యధిక శాతం అధికార పార్టీ కౌన్సిలర్‌లు మాత్రం ప్రజాసమస్యలను ఎలాగూ తాము ప్రస్తావించలేకపోతున్నాం, కనీసం టీడీపీ కౌన్సిలర్‌లు అయినా మాట్లాడితే బాగుండు అన్న విధంగా వ్యవహరించారు. దీనికితోడు త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటం కూడా కారణంగా తెలుస్తుంది. ఈక్రమంలో ఎందుకువచ్చిన తంటా మాట్లాడకుండా ఉండటం మేలన్న ధోరణితో ఉన్నట్లు తెలుస్తుంది. అధికారపార్టీ కౌన్సిలర్‌లలో మార్పు కనిపించటం టీడీపీ కౌన్సిలర్‌లను సైతం ఆశ్చర్యానికి గురి చేసింది.

అద్దంకి పట్టణంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందని 6వ వార్డు కౌన్సిలర్ కంపా రజని ప్రశ్నించారు. మురుగు కాలువల పూడికతీత చేపట్టడం లేదని, ఫాగింగ్ చేయకపోవటంతో దోమల బెడద ఎక్కువైందని అన్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని 4వ వార్డు కౌన్సిలర్ మాగులూరి తిరపతమ్మ కోరారు. దీనికి స్పందించిన చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, కమిషనర్ అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ త్వరలో ఫాగింగ్ చేపడతామన్నారు. నీటిఎద్దడి లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్‌చైర్మన్ దేసు పద్మేష్, కమిషనర్ అబ్దుల్ రషీద్, మేనేజర్ శ్రీదేవి, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మేదరమెట్ల , ఫిబ్రవరి 20: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనమనమూరు గ్రామానికి చెందిన కొప్పోలు గోపి బైక్‌పై బైపాస్‌లోని పెట్రోల్ బంకులో అయిల్ పోయించుకుని బయటకు వచ్చాడు. అదే సమయంలో మరో బైకిస్టుకు ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు అద్దంకి విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 20: అద్దంకిలోని ఎన్‌టీఆర్ మోమోరియల్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పట్టణంలోని నంబూరివారిపాలెంకు చెందిన దినేష్ ఎన్‌టీఆర్ కళాశాలలో చదువుతూ ప్రకాశం జిల్లాలో జనవరి 30న జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీలో గెలుపొంది గోల్డ్‌మెడల్ సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 28 నుంచి మార్చి 5 వరకు పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలలో పాల్గొననున్నారు. ఈసందర్భంగా కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ఎంఎ రత్తయ్య కరస్పాండెంట్ ఎంవీ రత్తయ్య, అధ్యాపకులు అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 20: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులకు, సిబ్బందికి ఎంపీడీవో రూతమ్మ సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో ఉన్న చిల్లచెట్లను తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పంగులూరు, ఫిబ్రవరి 20: మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం బోల్తాపడిన ఘటనలో అలవలపాడు గ్రామానికి చెందిన యువకుడికి గాయాలయ్యాయి. మంగళవారం ద్విచక్ర వాహనంపై మార్టూరు వైపు వెళుతున్న దుద్దు భాస్కర్, ముందు వెళుతున్న కారును క్రాస్‌చేసే ప్రయత్నం చేశాడు. కారు డ్రైవర్ సైడ్ ఇవ్వక పోవడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న భాస్కర్ అతి వేగంతో కారును ఛేజింగ్ చేసే ప్రయత్నంలో బైక్ బోల్తాపడి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో గాయపడిన భాస్కర్‌ను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మసకబారుతున్న 'మోటుపల్లి'

- ప్రాశస్త్యం కోల్పోతున్న వైనం
- గతం ఘనం.. వర్తమానం నామమాత్రం



ఒకప్పటి మోటుపల్లి ఓడరేవు

చీరాల, ఫిబ్రవరి 20: మోటుపల్లి ప్రాశస్త్యం మసకబారుతుంది. చినగంజాం మండలి పరిధిలోని మోటుపల్లి తీరప్రాంత గ్రామం. గతంలో ఇక్కడ ఓడరేవు ప్రసిద్ధిగాంచింది. ఆ ఆనవాళ్లన్నీ కోల్పోయింది. ప్రస్తుతం ఆనాటి ఓడరేవు ప్రాంతం కేవలం పడవలను నిలిపే ప్రదేశంగా మాత్రమే కనిపిస్తుంది.

మోటుపల్లి ఒకప్పటి మోహనగిరిపట్నం. ఇక్కడి ఓడరేవు చరిత్రాత్మకం. ఇక్కడ నుంచి వజ్ర, వైఢూర్యాలు, వస్త్రాలు ఇతర దేశాలకు ఎగుమతి అయ్యేవి. 11వ శతాబ్దంలో చోళులు మోటుపల్లి ప్రాంతం నుంచి ప్రాంతం నుంచి పాలన సాగించారు. వారి పాలనలో ప్రస్తుతం మోటుపల్లి ప్రాంతానికి మోహనగిరిపట్నంగా పేరుంది. అప్పట్లో మోటుపల్లి ప్రాంతంలోని సముద్రతీరం వాణిజ్యకేంద్రంగా విరాజిల్లింది. చోళులు తరువాత రెడ్డి రాజులు, పల్లవులు, కాకతీయులు ఈప్రాంతాన్ని పాలించారు. కాకతీయుల కాలంలో మోటుపల్లి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. మోటుపల్లిలోని వీరభద్రస్వామి ఆలయం గర్భగుడి చోళుల కాలంలో జరిగితే కాకతీయుల కాలంలో విస్తరణ జరిగింది. ఆ కాలంలోనే బౌద్ధమతవ్యాప్తి కూడా ఆ ప్రాంతంలో జరిగిందని చారిత్రిక ఆధారాలు చెప్తున్నాయి.



ఆలయ ప్రాంగణంలో నందీశ్వరుడులేని శివలింగం

పురావస్తుశాఖ పర్యవేక్షణలో వీరభద్రస్వామి ఆలయం

మోటుపల్లిలోని వీరభద్రస్వామి ఆలయం పురావస్తుశాఖ పర్యవేక్షణలో ఉంది. మూలవిరాట్ గుప్తనిధుల కోసం అన్వేషించే దొంగల పాలయింది. మూలవిరాట్‌కు ఎదురుగా మండపంలో ఉండే నందీశ్వరుని విగ్రహాన్ని కూడా కొందరు పెకలించారు. దీంతో ఆ విగ్రహాన్ని ఆలయంలో భద్రపరిచారు. ప్రస్తుతం ఆలయం పురావస్తుశాఖ ఆధీనంలో ఉండటంతో పూజలు, దీపధూప నైవేద్యాలు కొరవడ్డాయి. కేవలం చారిత్రక స్థలంగా మాత్రమే మిగిలింది. ఎవరన్నా పర్యాటకులు సందర్శనకు వచ్చినపుడు మాత్రమే అక్కడ అలికిడి ఉంటుంది. లేదంటే తలుపులకు తాళాలు వేసి ఉంటున్నాయి.

పాలకులు పట్టించుకుంటేనే పూర్వవైభవం

మోటుపల్లి ప్రత్యేకతలు అనేకం. అక్కడ అప్పట్లో బౌద్ధమతం వ్యాప్తి కూడా జరిగిందని చెప్తుంటారు. వీరభద్రస్వామి ఆలయానికి సమీపంలో దెబ్బతిన్న భారీ బుద్ధ విగ్రహం అందుకు నిదర్శనం. చినగంజాం-ఉప్పుగుంటూరు జాతీయ రహదారి సమీపంలో బకింగ్‌హామ్ కెనాల్ పక్కన ఉన్న బౌద్ధ ఆరామక్షేత్రం కూడా ఆనాటి ఆనవాళ్లలో భాగమని ఆ ప్రాంతవాసులు భావిస్తుంటారు. ఈనేపథ్యంలో పాలకులు, అధికారులు స్పందించి మోటుపల్లి ఓడరేవు, వీరభద్రస్వామి ఆలయం, బౌద్ధ ఆరామ క్షేత్రానికి పూర్వ వైభవం తేవాలని ప్రజలు కోరుతున్నారు. అందుకు అనుగుణంగా పాలకులు, అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

ఐఎల్‌టీడీ గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ ఘనవిజయం



విజయోత్సాహంలో సీఐటీయూ ప్రతినిధులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 20: చీరాల ఐఎల్‌టీడీ ప్రాంగణంలో మంగళవారం జరిగిన గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ ఘనవిజయం సాధించింది. కంపెనీలో చీరాల పరిధిలో 1546, రాజమండ్రిలో 37, అనపర్తిలో 470 ఓట్లు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 338 ఓట్ల ఆధిక్యంతో సీఐటీయూ గుర్తింపు సాధించింది. విజయానందంతో ప్రతినిధులు బాణ సంచాతో ర్యాలీ నిర్వహించారు.

జడ్పీ పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 20: జిల్లాలోని జడ్పీ పరిధిలోని ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ.వీ.వీరారెడ్డి, డి.వీరాంజనే యులు కోరారు. ఈమేరకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. టీచర్ల పీఎఫ్ ఖాతాల్లో పెండింగ్‌లు లేకుండా సంబంధిత డీడీవోల నుంచి షెడ్యూల్స్‌ను తెప్పించి మిస్సింగులు లేకుండా చూడాలన్నారు. సీఎఫ్ఎంఎస్‌కు వీలైనంత త్వరగా అప్‌డేట్ చేసిన ఖాతాలకు సంబంధించిన సమాచారం పంపాలని వారు కోరారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం

బల్లికురవ, ఫిబ్రవరి 20: పదో తరగతి పరీక్షలు ముగిసేవరకు విద్యార్థులకు సాయంత్రం సమయంలో అల్పాహారం అందజేస్తామని పాఠశాల స్థలదాత కొణిదెన వెంకటసుబ్బారావు తెలిపారు. మంగళవారం మండలంలోని కొణిదెన యజ్ఞన్నారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాఠశాల స్థలదాత అయిన వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించే సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అల్పాహారాన్ని అందజేసేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు సద్వినియెగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కొణిదెనలో నవగ్రహాల ప్రతిష్ఠ



కొణిదెనలో నవగ్రహాల ప్రతిష్ఠకు సిద్ధం చేస్తున్న భక్తులు

బల్లికురవ, ఫిబ్రవరి 20: మండలంలోని కొణిదెనలో గల బ్రహ్మగుండం వద్ద బుధవారం నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. కార్యక్రమంలో భాగంగా రెండురోజుల నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నవగ్రహాల విగ్రహాలను తీసుకువచ్చి ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నారు. వేద పండితులచే ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచే నవగ్రహాలను జలాదీవాసం నిర్వహించారు. అలాగే, బ్రహ్మగుండం వద్ద ఉన్న వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి 5 వార్షిక కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

సెయింట్ ఆన్స్ అధ్యాపకునికి జాతీయస్థాయి అవార్డు



అవార్డు సాధించిన అధ్యాపకుడిని అభినందిస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు

చీరాల, ఫిబ్రవరి 20: సెయింట్ ఆన్స్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ టి.గోపాలరావు జాతీయస్థాయి అవార్డు సాధించారు. కళాశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు గోపాలరావును అభినందిచారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల ప్రతిష్ఠను ఇనుమడింపజేసే విధంగా గోపాలరావు ముందడుగు వేయటం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాధిపతి డాక్టర్ సీహెచ్ లక్ష్మీతులసి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ క్రయ విక్రయాలు నేరం

చీరాలటౌన్, ఫిబ్రవరి 20: మద్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, క్రయ విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలోని పాపాయిపాలెంలోని ఓ ఇంట్లో అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేఖ కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై వెంట కానిస్టేబుళ్లు రమేష్, కృపా తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, ఫిబ్రవరి 20: చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి సుధ పేర్కొన్నారు. సామాజిక న్యాయదినోత్సవం సందర్భంగా పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలోన్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయాధికారి బాలికలకు గుడ్‌టచ్ - బ్యాడ్‌టచ్, ఫోక్సో యాక్టు, బాలకార్మిక నిరోధకచట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, న్యాయవాదులు ఈశ్వరిరెడ్డి, సురేష్, పీఎల్వీ ఎస్డీ మథీన్, హాస్టల్ వార్డెన్‌లు విజయలక్ష్మి, కోటేశ్వరమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు యద్దనపూడికి కలెక్టర్ రాక

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 20: స్థానిక జడ్పీ హైస్కూల్లో బుధవారం మధ్యాహ్నం జరగనున్న జగనన్నకు చెబుతాం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషా పాల్గొంటారని ఎంపీడీవో శివసుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు కూడా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే రవికుమార్ పర్యటన వివరాలు

అద్దంకి, ఫిబ్రవరి 20: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బుధవారం పలు గ్రామాలలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు కామేపల్లి, 10.30కి పాతమాగులూరు, 11 గంటలకు అంబడిపూడి, 12 గంటలకు నాగులుప్పలపాడు మండలం పోతవరం, ఒంటి గంటకు దైవాలరావూరులో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశం


అద్దంకి, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరుగుతుందని నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ కోరే సురేంద్రనాథ్ తెలిపారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ప్రాణాంతక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 20: ప్రాణాంతక వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శోభారాణి, సెర్ప్ సంస్థ పీసీవో కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల కార్యాలయంలో ఐటీసీ బంగారు భవిష్యత్తు, సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. తడి, పొడి చెత్తపై సిబ్బంది ప్రజలకు వివరించాలన్నారు. వ్యర్థాలతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. చెత్తను తగులబెట్టడం వల్ల రోగాలు వ్యాపిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో దారా హనుమంతరావు, నారాయణ. నాగరాజు, అరుణ్, సతీష్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 20: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు జి.నివేదిత, జి.ప్రసన్న ఎంపికయ్యారు. గత ఆదివారం చినగంజాంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచి ఈనెల 21 నుంచి 23 వరకు సతెన్నపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారు. పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది వీరిని ప్రత్యేకంగా అభినందించారు.



'కల్యాణమస్తు, షాదీ తోఫా' పంపిణీ

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలోని 490 మంది జంటలకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫాను మంగళవారం అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి రూ.4.09 కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. నగరంలోని తిక్కన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, కలెక్టర్ హరినారాయణ్ లబ్ధిదారులకు మెగా చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదే ఆగ్రహం!



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు, రాజకీయ పార్టీల నాయకులు

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిపై కొనసాగుతున్న ఆందోళనలు
- రెండోరోజూ జర్నలిస్టులకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు

ఆత్మకూరు, ఫిబ్రవరి 20 : రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై వైసీపీ మూకలు చేసిన దాడిని నిరసిస్తూ రెండో రోజు మంగళవారం కూడా జర్నలిస్టు సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రోడ్డెక్కి నినదించారు. పాత్రికేయులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఆపలేరా!? అంటూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, యూట్యూబ్ నిర్వాహకులు భగ్గుమన్నారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆత్మకూరులో జరిగిన భారీ ర్యాలీలో టీడీపీ, బీజేపీ, సీపీఎం, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలతోపాటు ఏబీవీపీ, పలు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కదిలొచ్చి మద్దతు ప్రకటించారు. ముందుగా బీఎస్ఆర్ సెంటర్‌లో మానవహారం నిర్మించి, ఆర్డీవో కార్యాలయం వరకు ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ జరిగిన ధర్నాలో ఏపీయూడబ్ల్యూజే నేతలు సోమా వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచలచౌదరి, సురేష్, సీపీఎం నాయకులు కె డేవిడ్‌రాజు, ఆత్మకూరు నాగయ్య, బీజేపీ నేత కుడుముల సుధాకర్‌రెడ్డి, జనసేన నాయకుడు నలిశెట్టి శ్రీధర్, ఏబీవీపీ నాయకుడు మల్లవరపు అశోక్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని తదితరులు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆర్డీవో మధులతకు వినతిపత్రం అందజేశారు. ఆత్మకూరు ప్రాంత ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, యూట్యూబ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలంలో టీడీపీ నాయకుల నిరసన



కావలిలో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నేతలు



బిట్రగుంట : తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తూ..

- **వెంకటాచలం :** సాక్షాత్తు సీఎం సభలోనే ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు జరిపిన దాడి అమానుషమని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ తెలిపారు. వెంకటాచలంలోని టీడీపీ కార్యాలయం వద్ద నాయకులు నిరసన తెలిపారు. సీఎం జగన్‌కు, వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
- **కావలి (టౌన్) :** దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ట్రంకురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ మల్లి మాట్లాడుతూ మీడియాపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనన్నారు. పీసీసీ సభ్యుడు శివశేఖర్ రెడ్డి పాల్గొని సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- **ఇందుకూరుపేట :** సీపీఎం మండల కన్వీనర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో యూట్యూబ్ చానళ్ల ప్రతినిధులు నల్లబ్యాడ్జీలు ధరించి, తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు.
- **బిట్రగుంట :** ఫొటో జర్నలిస్టుపై దాడిపై బోగులు మండల విలేకర్లు నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తహసీల్దారు వెంకటరత్నంకు వినతిపత్రం అందించారు. వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణయ్య, జ్యోతి శ్రీనివాసులు, శ్రీనివాసులు, యజ్ఞ, సుబ్బరాయుడు, దిలీప్, జీవన్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

కందుకూరు వైసీపీలో గందరగోళం



- మహీధరరెడ్డిని దూరం పెడుతున్న అధిష్ఠానం
- ఎమ్మెల్సీ తూమాటికి సీఎంవో నుంచి పిలుపు
- కందుకూరు బాధ్యతలు చూడాలని జగన్ సూచన

కందుకూరు, ఫిబ్రవరి 20 : కందుకూరు వైసీపీలో గందరగోళం కొనసాగుతోంది. సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డిని పూర్తిగా పక్కన పెట్టడమే లక్ష్యంగా ఆ పార్టీ అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. ఈ నెల 16వ తేదీన ఆదిశంకర విద్యాసంస్థల అధినేత వంకి పెంచలయ్య పెద్ద కుమార్తె కఠారి అరవిందను కందుకూరు పార్టీ ఇన్చార్జిగా నియమిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. అభ్యర్థిని ప్రకటించాక సిటింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డిని పిలవని జగన్ కందుకూరు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ తూమాటి మాధవరావును మాత్రం సోమవారం పిలిపించుకుని మాట్లాడారు. సీఎంఓ నుంచి వచ్చిన పిలుపుమేరకు సోమవారం సాయంత్రం మాధవరావు జగన్‌ను కలవగా 15 నిమిషాలకుపైగా ఆయనతో చర్చించిన జగన్ కందుకూరులో అరవిందను గెలిపించడమే లక్ష్యంగా బాధ్యతతో పని చేయాలని సూచించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మహీధరరెడ్డి రాజకీయ అడుగులపైన, ఆయనకున్న బలమైన వర్గం, నేపథ్యం తదితర అంశాలను వివరిస్తూ పలు సందేహాలు వ్యక్తం చేయగా జగన్ వాటిన్నిటినీ తేలిగ్గా కొట్టిపారేసినట్లు విశ్వసనీయ సమాచారం. మన అభ్యర్థి అరవింద అందులో ఎలాంటి మార్పు ఉండబోదు. ఆమె విజయానికి కృషి చేసే బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేసినట్లు సమాచారం.

● అనుచరుల్లో ఆగ్రహం

కాగా, నియోజకవర్గంలో అనేక మందికి పెంచలయ్య ఫోన్లు చేసి మాట్లాడుతుండటమే గాక ఇక్కడ పార్టీ కార్యాలయం కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. ఈ విషయాల్లో సిటింగ్ ఎమ్మెల్యేపై ఏమాత్రం ఆధారపడకుండా పనులు చేసుకుంటుండటం అభ్యర్థి ప్రకటన జరిగాక అయన్ను కలవకపోవటం మరోవైపు సీఎం జగన్ ఎమ్మెల్సీ మాధవరావును పిలిపించుకుని మాట్లాడటం వైసీపీ వర్గాలలో హాట్ టాపిక్‌గా మారింది. జరుగుతున్న పరిణామాలతో ఎమ్మెల్యే అనుచరులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నారు. రాజకీయంగా ఏదైనా నిర్ణయం తీసుకోవాలన్న కోణంలో వారు మహీధరరెడ్డిపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. పార్టీ పెద్దలు తనపట్ల అనుసరిస్తున్న విధానాన్ని అవమానకరంగా భావిస్తున్న ఆయన గుంభనంగా రాజకీయ అడుగులు వేస్తున్నారని భావిస్తున్నారు.

వ్యవసాయ సర్వీసులకు రిజిస్టర్ చేసుకోండి

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 20 : జిల్లాలోని రైతులు వ్యవసాయ సర్వీసులకు స్థానిక సచివాలయాలలో ఉన్న జగనన్న రైతునేస్తంలో రిజిస్టర్ చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇక నుంచి రైతులందరూ జగనన్న రైతునేస్తం పోర్టల్ ద్వారా వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దీంతో రైతులకు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం ఉండదన్నారు. అలాగే పీఎం సూర్యఘర్ మస్ట్ బిజిలీ యోజన ద్వారా 150 యూనిట్ల గృహవినియోగం ఉన్న వారికి ఒకటి నుంచి రెండు కిలో వాట్స్ వరకు సోలార్ రూట్ టాప్ ప్లాంట్‌ను సబ్సిడీతో అందించనున్నట్లు చెప్పారు. దీనిని వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూమేగా

కబ్జా చేస్తేపోలా!?

నెల్లూరు నగరానికి కూతవేటు దూరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూమి అది. సుమారు రూ.10 కోట్ల విలువైన ఈ భూమిపై కొంతమంది కళ్లు పడ్డాయి. అధికార దర్పమే పెట్టుబడిగా పైసా ఖర్చు లేకుండా కబ్జా చేసి ప్లాట్ల రూపంలో జనం నెత్తిన అంటగట్టడానికి రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం నుడా అధికారుల ముందు ఉంది. అన్నీ సవ్యంగా జరిగితే అంటే అధికారులంతా కళ్లుమూసుకుంటే మరో నాలుగైదు రోజుల్లో ఈ ప్రభుత్వ భూమి పరాధీనం కావడం తథ్యం.

- నెల్లూరు రూరల్‌లో బరితెగిస్తున్న అక్రమార్కులు
- రూ.10 కోట్ల ప్రభుత్వ భూమి స్వాహాకు యత్నం
- పట్టా భూమిని కలుపుకొని ఎంచక్కా లేఅవుట్
- అధికార పార్టీ నేత కనుసన్నల్లోనే అంతా
- అప్రూవల్ కోసం నుడాకు చేరిన ఫైల్


నెల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని అంబాపురంలో ప్రభుత్వ భూమిని ఇళ్ల ప్లాట్ల కింద విక్రయించడానికి అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు స్కెచ్ వేశాడు. అనుకున్నదే తడవుగా పక్కనున్న పట్టా భూమిని కొనుగోలు చేశాడు. సుమారు 20 ఎకరాల లే అవుట్‌లో 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కలుపుకొని ప్లాట్లు వేశాడు. సర్వే నెం.79-1, 2, 3, 16, 18, 21లలో, 80-1, 81-17, 19లలో 2.87 ఎకరాల గయాళ్లు పోరంబోకు ఉంది. అలాగే 77, 78, 80 సర్వే నంబర్లలో 21 సెంట్ల దిబ్బ పోరంబోకు ఉంది. మొత్తం ఈ మూడెకరాల ప్రభుత్వ భూమిని పట్టా భూమిలో కలుపుకొని లే అవుట్ వేశాడు.

● లే అవుట్ల ముసుగులో..

ఆ.. మొత్తం మూడెకరాలే కదా! ఇదేమంత గొప్ప విషయం అనుకుంటే పొరబాటే. మార్కెట్ విలువ ప్రకారం ఈ ప్రాంతంలో ఎకరం ధర రూ.3 కోట్లు పలుకుతోంది. ఈ లెక్కన పట్టా భూముల ముసుగులో కొట్టేయడానికి ప్రయత్నిస్తున్న మూడెకరాల ప్రభుత్వ భూమి విలువ రమారమి 10 కోట్ల రూపాయలు. నగర పరిసరాల్లో ఇలా లే అవుట్ల ముసుగులో ప్రభుత్వ భూములను కొట్టేయడం పరిపాటిగా మారింది. ఒకటి రెండు ఘటనలపై ఫిర్యాదులు, కోర్టు కేసుల వరకు వెళ్లినా అధికారులు చేతులు ముడుచుకొని కూర్చోవడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోయి ప్రభుత్వ భూముల కబ్జాకు తెగపడుతున్నారు. విలువైన ప్రభుత్వ భూములు హారతి కర్పూరం అవుతున్నాయి.

● చకచక కదులుతున్న ఫైలు

ప్రస్తుతం ఈ లే అవుట్‌కు సంబంధించిన ఫైలు అప్రూవల్ కోసం నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) కార్యాలయానికి చేరిందని సమాచారం. అధికార బలంతో నుడా అధికారులు కళ్లు మూసుకొని అప్రూవల్ ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. సాధారణంగా ఒక లే అవుట్ మధ్యలో ప్రభుత్వ భూమి ఉంటే ఆ భూమిని మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వం నుంచి కొనుగోలు చేయాల్సి ఉంది. అలా చేయాలంటే భూమి కొనుగోలుకు సంబంధించిన ఫైలు అనుమతి కోసం కలెక్టర్ ముందు ఉంచాలి. కలెక్టర్ అనుమతి మేరకు మార్కెట్ రేటు ప్రభుత్వానికి చెల్లించిన తరువాతే ఆ భూమిపై హక్కు లభిస్తుంది. అప్పుడే నుడా అప్రూవల్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇలాంటివేవి జరగకుండా, సదరు లే అవుట్‌లో ప్రభుత్వ భూమి ఉందన్న విషయాన్ని కూడా బట్టబయలు కానివ్వకుండా చడీ చప్పుడు లేకుండా నుడా అప్రువల్ తెచ్చుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఇదే జరిగితే రూ. పది కోట్ల ప్రభుత్వ భూమి పరులపాలవుతుందని స్థానికులు అంటున్నారు. అధికారులు తక్షణం స్పందించి లే అవుట్‌లోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, లేదా చట్టబద్ధంగా విక్రయించాలని స్థానికులు కోరుకుంటున్నారు.





ప్రభుత్వ భూమిని కలుపుకుని వేసిన వేసిన లేఅవుట్ (ఇన్‌సెట్) నుడాకు అందజేసిన మ్యాప్

సమరం



తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మంగళవారం నెల్లూరులో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు భారీ ర్యాలీ నిర్వహించారు.

కోవూరుపల్లి పీహెచ్‌సీలో కనీస వసతుల కరువు

● తాగునీటి కోసం వాటర్‌క్యాన్ల కొనుగోలు ● సౌకర్యాలు లేకున్నా నోరుమెదపని వైద్య సిబ్బంది



పనిచేయని మినీ వాటర్ ప్యూరిఫైర్



ఉపయోగంలో లేని మరుగు దొడ్డి

బిట్రగుంట, ఫిబ్రవరి 20 : బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీ 24 గంటల ఆసుపత్రి అయినా కనీస వసతులు కరువయ్యాయి. వైద్యశాలలో ఏర్పాటుచేసిన మినీ వాటర్ ప్యూరిఫైర్ ఆరు నెలలుగా మరమ్మతుకు గురి కావడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. సిబ్బంది ఇళ్ల వద్ద నుంచి వాటర్ బాటిళ్లు తీసుకొచ్చుకుంటున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల కోసం వైద్యాధికారులు వాటర్ క్యాన్లు కొనుగోలు చేస్తున్నారు. నెల క్రితం నుంచి విద్యుత్ మోటారు మొరాయించడంతో ఆసుపత్రిలో పనిచేసే మహిళా సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు.ఇకపోతే పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నామమాత్రంగా ఉన్నాయని గ్రామ పెద్దలు అంటున్నారు. ఇటీవల స్థానికులు బీపీ, షుగర్ చెక్ చేయించుకునేందుకు వెళ్లిన సమయంలో సిబ్బంది ఎవరూ లేరని ఆవేదన చెందారు. విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సును ఎక్కడికి పోయిందని అడగ్గా నైట్‌డ్యూటీ చేసిన ఆ మహిళ వాష్‌రూముకు వెళ్లానని పేర్కొంది. కోవూరుపల్లి పీహెచ్‌సీ జాతీయ రహదారికి సమీపంలో ఉన్నా కనీస వసతులు లేకపోవడం సిగ్గుచేటని గ్రామస్థులు అంటున్నారు. నిత్యం వైద్యశాలను తనిఖీ చేస్తున్న జిల్లా ఉన్నతాధికారులకు ఈ సమస్యలు కనిపించవా...? అని గ్రామ పెద్దలు అంటున్నారు. ఇన్‌చార్జిగా అల్లూరు మండలం ఇస్కపల్లి చెందిన వైద్యుడు ఉండటంతో చాలా వరకు సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిసింది. ప్రజల ఆరోగ్యం కోసం రూ. కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం



పోలేరమ్మకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

సంగం, ఫిబ్రవరి 20: మండలంలోని మక్తాపురంలోని పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జండామాను నుంచి మహిళలు కలశాలతో ర్యాలీగా ఆలయానికి చేరుకుని పోలేరమ్మ మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. పొంగళ్లు పొంగిచి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆత్మకూరు అభివృద్ధికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

ఆత్మకూరు, ఫిబ్రవరి 20: మున్సిపాల్టీలోని అన్ని వార్డుల అభివృద్ధికి సమిష్టిగా పనిచేస్తామని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లాలా తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని 9వ వార్డులో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి, వైసీపీ నాయకుడు కొప్పోలు చిన్నపురెడ్డి, మున్సిపల్ ఏఈ జూపల్లి ప్రసాద్, ఆర్ఐ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



రోగులకు మందులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 20: మండలంలోని తూర్పు కొండారెడ్డిపల్లిలో మంగళవారం కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు చైర్మన్, టీడీపీ నియోజకవర్గ నాయకులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సంజీవని ఆరోగ్యరథం ద్వారా వైద్యులు రోగులకు అన్నిరకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యరగాటి మాలకొండారెడ్డి, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాముడూరులో...

చేజర్ల: మండలంలోని మాముడూరు గ్రామంలో మంగళవారం నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వెద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈ రమాదేవి రోగులను పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 20: మండలంలోని భైరవరం గ్రామంలో మంగళవారం మారెడ్డి కొండమ్మకు చెందిన పొగాకు బ్యారన్ ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. ఉదయగిరి అగ్నిమాపక కేంద్రం వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిలినట్లు బాధితులు వాపోయారు.

వలంటీర్లకు పురస్కారాలు

సీతారామపురం, ఫిబ్రవరి 20: మండలంలోని 9 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో వాలంటీర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, మండల కన్వీనర్ చింతరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ చింతరెడ్డి పద్మావతి, పాల్గొన్నారు.

రైల్వే విశ్రాంత ఉద్యోగులకు మజ్దూరు యూనియన్ అండ

బిట్రగుంట, ఫిబ్రవరి 20: రైల్వే విశ్రాంత ఉద్యోగులకు సౌత్‌సెంట్రల్ మజ్దూరు యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కార్మిక నాయకుడు సుబ్బారావు అన్నారు. బోగోలు పంచాయతీ సమావేశ మందిరంలో ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ సంక్షేమ సమాఖ్య సమావేశం మంగళవారం జరిగింది. రైల్వే విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, సుధాకర్, కృపయ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ విజయవాడ డివిజనల్ అధ్యక్షుడు రామ్‌గోపాల్, కార్యదర్శి కామేశ్వరావు, బ్యాంకు మేనేజర్లు దివ్య, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

బాబు సీఎం అయితేనే ఎయిర్‌పోర్టు,

ఫిషింగ్ హార్బర్ పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కావ్య కృష్ణారెడ్డి

బిట్రగుంట, ఫిబ్రవరి 20: టీడీపీ ప్రభుత్వంలోనే దగదర్తిలో ఎయిర్‌పోర్టు, జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్, రామాయపట్నంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారని, చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే వాటి ప్రారంభోత్సవాలు జరుగుతాయని కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి అన్నారు. బోగోలులో మంగళవారం సాయంత్రం పార్టీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో కార్యకర్తల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ కావలి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు బొమ్మిసురేంద్ర, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, జిల్లా నాయకులు బీద గిరిధర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, తప్పుడు కేసులు బనాయించడం వంటివి పెరిగిపోయాయన్నారు. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకున్న వారిపై దాడులు, వేధింపులు పెరిగాయని మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. ఆఫ్కాబ్ మాజీ నేత కోడూరు పాలిశెట్టి తదితరులు మాట్లాడారు. అంతకుముందు ఇబ్రహీంపేట నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, లక్కాకుల మాధవరావు, రావి విజయ్‌కుమార్‌యాదవ్, కోటా వెంకారెడ్డి, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, కుందుర్తి వెంకటవరప్రసాద్, కాంద్రం ఘురామ్‌నాయుడు తదితరులు ఉన్నారు.

వెంగమాంబ సన్నిధిలో వేలం పాటలు



వేలంపాటలు నిర్వహిస్తున్న అధికారులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 20: మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ అంశాలపై వేలం పాటలు నిర్వహించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ నెల్లూరు డివిజన్ పరిశీలకుడు సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో, ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్ల సమక్షంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ టెండర్లు, వేలంపాటలు నిర్వహించారు. వేలంపాటల్లో పాటదారులు వివిధ అంశాలకు సంబంధించి రూ.16,48,000కు పాడారు. గతేడాది కంటే ఈ ఏడాది వేలంపాటల ద్వారా ఆదాయం పెరిగిందని అధికారులు తెలిపారు. అలాగే కూరగాయలు, పూలు, అమ్మవారి అభిషేక సామాగ్రి తదితర వాటికి సంబంధించి టెండర్లు నిర్వహించారు. తక్కువ నమోదు చేసిన టెండర్లను దేవదాయ, ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులకు పంపినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు బెల్లంకొండ పెద్దభద్రయ్య, పాటదారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

చేజర్ల, ఫిబ్రవరి 20 : మండలంలోని పలు గ్రామాలలో రైతులు పండిస్తున్న వరి, జొన్న, మిరప తదితర పంటలను మంగళవారం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మి, పొదలకూరు ఏడీఏ శివనాయక్, మండల వ్యవసాయశాఖ అధికారి వి శశిధర్ పరిశీలించారు. వరి, మిరప పంటలకు సోకిన తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి ఏవో వాసు, కెవికే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, విఏఏ మాధురి, రైతులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



సిబ్బందితో సమీక్షిస్తున్న సబ్ డీఎఫ్‌వో

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 20: అడవుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని కావలి సబ్ డీఎఫ్‌వో పీ రాజశేఖర్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక అటవీ శాఖా రేంజ్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని అడవులు అగ్నికి ఆహుతి కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వన్యప్రాణులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రేంజ్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వనసంరక్షణ సమితుల్లో నరికిన జామాయిల్ వివరాలను తెలుసుకున్నారు. ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, డీఆర్వో శ్రీనివాసులు, ఎఫ్ఎస్‌వోలు భోగ్యం శ్రీనివాసులు, షేక్ మునీర్, ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

సీతారామపురం, ఫిబ్రవరి 20 : మండలంలోని 14 పంచాయతీల్లో 2022-2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 7.4 కోట్లతో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై మంగళ వారం స్థానిక స్త్రీశక్తి భవనం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా సోషల్ ఆడిట్ బృందాలు ఉపాధి హామీ పథకంలో పాల్గొన్న కూలీలను, చేసిన పనులను క్షేత్రస్థాయిలో విచారించారు. మొత్తం 14 పంచాయతీల్లో పనులు జరగగా సుమారు. రూ. 81322 మేర అక్రమాలు జరిగాయని సమావేశం దృష్టికి తెచ్చారు. విచారించిన అధికారులు సంబంధిత సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకట్రావు, ఏపీడీ గాయత్రీదేవి, అంబుడ్స్‌మెన్ వెంకట్రామిరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ సీఈవో వేణుగోపాల్, ఎంపీడీవో, ఏపీవో సుభాషిణి, ఇసి సువర్ణయ్య, టెక్నికల్ అసిస్టెంట్‌లు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

వెలుగొండ జలాలతో ఉదయగిరి సస్యశ్యామం

ఉదయగిరి, ఫిబ్రవరి 20: ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలు సస్యశ్యామలం కావాలంటే వెలుగొండ, సోమశిల జలాలతోనే సాధ్యమని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేక పాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి వైసీపీ సమన్వయకర్త మేక పాటి రాజగోపాల్‌రెడ్డిలు పేర్కొ న్నారు. మంగళవారం ఉదయ గిరిలోని మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో బుధవారం జరగనున్న దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి రెండో వర్ధంతి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ గౌతంరెడ్డి వర్ధంతికి ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, అక్కి భాస్కర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వరికుంటపాడు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం విరువూరు, నార్త్‌కొండాయపాళెం, తూర్పుపాళెం, తొడుగుపల్లి, ధర్మవరం గ్రామాల్లో విజయ సంకల్పయాత్ర నిర్వహించారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోండి

గుడ్లూరు మండల సమావేశంలో ఎంపీపీ రమేష్



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

గుడ్లూరు, ఫిబ్రవరి 20: రానున్న వేసవి దృష్ట్యా మండలంలో నీటిఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పులి రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో జటిలంగా మారిన పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. చేవూరు నుంచి రావూరుకి వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని చేవూరు ఎంపీటీసీ సభ్యుడు నక్కల శ్రీనివాసులు కోరారు. పొజర్లలో మంచినీటి బోర్లు బాగుచేయించాలని సర్పంచి పాటి వెంకటేశ్వర్లు కోరారు. అలాగే ఎస్టీ కాలనీలోని పాఠశాల పనులను పూర్తిగా చేయించాలన్నారు. గుడ్లూరు సర్పంచి పాలకీర్తి శంకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు సంవత్సర కాలం నుంచి జీతాలు పడడం లేదని అన్నారు. గుడ్లూరు ఎంపీటీసీ 1 సభ్యురాలు చెన్నారెడ్డి వరమ్మ మాట్లాడుతూ స్థానిక పశువైద్య శాలలో మందులు అందుబాటులో లేకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఏవీ సుబ్బారావు, వెలుగు ఏపీఎం అశోక్, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఎంఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి గరుడ వాహనసేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

కావలిటౌన్, ఫిబ్రవరి20: ముసునూరులోని హనుమత్ క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి మంగళవారం గరుడ వాహన సేవలందించారు. ఆలయ వ్యవస్థాపక అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



గిరిజనులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందచేస్తున్న శ్రీనాథరెడ్డి

జలదంకి, ఫిబ్రవరి20: జలదంకి పంచాయతీ పరిధి నెహ్రూనగర్ కాలనీలోని 20 గిరిజన కుటుంబాలకు ఉచితంగా గ్యాస్ స్టౌ, సిలిండర్లను బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథరెడ్డి మంగళవారం అందించారు. మండల నాయకుడు ముడి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కమతం బాలకోటయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కపల్లిలో 2వేల మెజార్టీ రాకుంటే రాజకీయాలొద్దు : బీఎమ్మార్

కావలిటౌన్, ఫిబ్రవరి20: తన స్వగ్రామం ఇస్కపల్లిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి 2,000 మెజార్టీ రాకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో బీఎమ్మార్ మాట్లాడారు. రాజధాని లేకపోయినా, రాష్ట్ర ఆదాయం లేకపోయినా జగనన్న ప్రజా సంక్షేమానికి లక్షల కోట్లు ఖర్చు పెట్టడం చిన్న విషయం కాదన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల అండతో ఎన్నికలకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, ఫిబ్రవరి 20 : మండలంలోని వీఆర్ కోట సమీపంలోని మన్నేరులో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో దాడి చేసి ఇసుక నింపుకుంటున్న రెండు ట్రాక్టర్లను, డ్రైవర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

అండర్‌పాస్ బ్రిడ్జి పరిశీలన



కావలిటౌన్, ఫిబ్రవరి 20: ముసునూరు రైల్వేగేట్ వద్ద నిర్మించిన అండర్‌పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంగళవారం అధికారులు, బీజేపీ నేతలు పరిశీలించారు. ఈనెల 26న దేశంలోని అండర్‌పాస్ బ్రిడ్జిలను ప్రధాని మోదీ పర్చువల్‌గా ప్రారంభిస్తారని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కె బ్రహ్మానందం పేర్కొన్నారు. అందులో భాగంగా ముసునూరులో నిర్మించిన అండర్‌పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మందా కిరణ్, కామినేని ఉదయలక్ష్మి, మస్తాన్, సవీంద్ర, తిరుపతిస్వామి, మనోజ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

లింగసముద్రం : మండలంలోని ఎర్రారెడ్డిపాలెం, మాలకొండరాయునిపాలెం, వీఆర్ కోట గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లను మంగళవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఎంపీడీవో యు శేషుబాబు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు వలంటీర్లను సేవామిత్ర పురస్కారంతోపాటు ప్రశంసా పత్రాలు అందజేసి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచు డి మల్లికార్జున, వైసీపీ నాయకులు ఎం శ్రీనివాసులు, వి వెంకటేశ్వర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రాజధాని ఫైల్స్ ఉచిత ప్రదర్శన

కందుకూరు : అమరావతి రైతుల కన్నీటి వ్యథను కళ్లకు కడుతూ రూపొందించిన రాజధాని ఫైల్స్ చిత్రాన్ని కందుకూరులో టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా ప్రదర్శిస్తున్నట్లు ఆపార్టీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తల కోసం ఈ ఉచిత ప్రదర్శనను యువరాజ్ థియేటర్‌లో ఏర్పాటుచేస్తున్నందున ప్రతిఒక్కరూ వీక్షించాలని కోరారు.

సూపర్‌సిక్స్ పథకాల పట్ల ఎంతో ఆదరణ : ఇంటూరి



మహిళకు కరపత్రం అందచేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 20: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల పట్ల ప్రజల్లో ఎంతో ఆదరణ ఉందని కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం పట్టణంలోని 27వ వార్డు పరిధిలోని పడమర రజకపాలెంలో నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీచేశారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే ఈ పథకాలన్నింటినీ అమలుచేస్తారని తెలిపారు. కందుకూరులో తనను ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, పాకల మాల్యాద్రి, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కొచ్చర్ల వీరరాఘవులు, తలమంచి రాజేష్, కొత్తకోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

నివాసితుల సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

కావలి, ఫిబ్రవరి 20: పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న టిడ్కో ఇళ్లలో ఉంటున్న నివాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ 200 టిడ్కో ఇళ్లలో ప్రజలు నివాసాలు ఉంటున్నారని, అక్కడ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీధిలైట్లు, తాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయని,అంతేకాక అపరిశుభ్రత తాండవిస్తోందన్నారు. ప్రహరీ కూడా లేదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పసుపులేటి పెంచలయ్య, వై కృష్ణమోహన్, జీ. మధుసూదనరావు, బీ. క్రిష్టయ్య, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల శనగ 452 రకంతో అధిక దిగుబడులు



శనగపైరును పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టరు ప్రసాద్‌బాబు తదితరులు

కందుకూరు, ఫిబ్రవరి 20 : నంద్యాల శనగ 452 రకంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని కందుకూరు కృషి విజ్ఞానకేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జీ ప్రసాద్‌బాబు తెలిపారు. బొట్లగుడూరు సమీపంలోని దూబగుంట గ్రామంలో ఎస్సీ రైతులకు ఎస్సీఎస్పీ పథకం కింద ఈరకం శనగ విత్తనాన్ని క్షేత్ర పరిశీలనకోసం అందజేసి సాగుచేయించగా, అధిక దిగుబడులు సాధించినట్లు మంగళవారం ఆయన వివరించారు. సాధారణ జెజె11 రకం సాగుచేసిన రైతులు ఎకరానికి 5 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే సాధించగా, నంద్యాల గ్రామ్ 452రకం సాగుచేసిన రైతులు 7.5 క్వింటాళ్ల దిగుబడి సాధించినట్లు తెలిపారు. రైతులు నంద్యాల 452ను ఎంచుకోవాలని ఆయన అన్నారు. వాతావరణం అనుకూలిస్తే 14 క్వింటాళ్లవరకు కూడా దిగుబడి సాధించే అవకాశం ఉంటుందన్నారు.

'పసుపులేటి' గెలుపునకు కృషి చేయాలి

అల్లూరు, ఫిబ్రవరి 20 : కావలి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న పసుపులేటి సుధాకర్ గెలుపున కు ప్రతి కార్యకర్త కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త పసుపులేటి వెంకటేశ్వర్లు అన్నారు. అల్లూరులోని కార్యాలయంలో మంగళవారం మండలంలోని నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అల్లూరు సమన్వయకర్త ఎల్లు సాల్మన్‌రాజు, దర్శిగుంట వాసు, పసుపులేటి ప్రసాద్, కప్పల నవీన్, గుమ్మడి రాజేష్ బాబు, సత్యవోలు శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడిగా ఏడుకొండలు

సీతారామపురం : ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడిగా మండలానికి చెందిన అప్పన ఏడుకొండలు ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లా డుతూ వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులపై వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని, చిన్న కారణాలతో నోటీసులు ఇవ్వడం సమంజసం కాదని తెలిపారు. నెల్లూరు జిల్లాలో 163 మంది ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన నోటీసులు తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, రాష్ట్ర ఆర్థిక కమిటీలో అప్పనఏడుకొండలుకు స్థానం లభించటంతో పలువురు ఉపాధ్యాయులు, ఎస్టీయూ కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

దాడులతో భయపెట్టాలనుకోవడం తగదు : కండ్లగుంట

కావలి, ఫిబ్రవరి20: రాజకీయాల్లో దాడులు చేసి భయపెట్టాలనుకోవడం పిరికిపంద చర్య అని సోమశిల ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డిపై ఒంగోలు జరిగిన దాడిని ఆయన ఖండించారు. రాజకీయాలలో ఇలాంటి విషసంస్కృతి మంచిది కాదన్నారు. ఆయన రాష్ట్రనాయకుడిగా ఎదగటం చూసి ఓర్వలేకనే ఆయనపై దాడి చేశారన్నారు. ఇలాంటి దాడులను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

కందుకూరు, ఫిబ్రవరి 20: రాష్ట్ర తెలుగురైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై ఇనుపరాడ్లుతో దాడిచేసి కొట్టడమే కాక, తన అనుచరులతో కత్తులతో దాడిచేయించిన ఒంగోలు జిమ్స్ హాస్పటల్ యజమాని డాక్టరు రామచంద్రారెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీనివాసరెడ్డి త్వరగా కోలుకుని ప్రజాజీవితంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. డాక్టర్ రామచంద్రారెడ్డిని తక్షణం అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నాసిరకం నిర్మాణాలతో ప్రమాదాలు



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న యువజన సంఘం నాయకులు

బిట్రగుంట, ఫిబ్రవరి 20: బోగోలు మండలం సీఆర్ పాలెం పంచాయతీలో నిర్మిస్తున్న స్కూలు భవన నిర్మాణానికి నాసిరకం సామగ్రిని వాడుతున్నారని, తద్వారా పిల్లల ప్రాణాలకు ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున మంగళవారం ఎంపీడీవో కార్యాలయంవద్ద అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతోపాటు పనుల నాణ్యతపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సాల్మన్‌రాజు, అంబేడ్కర్ ఇండియన్ మిషన్ కావలి డివిజన్ అధ్యక్షుడు బత్తల రవిచంద్ర, కావూరి బంగారయ్య, వేణుగోపాల్, వాసు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.